డిసెంబర్
2020

176

సంపుటి : 15 సంచిక : 6 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

మనుస్మృతి: బిజెపి ప్రభుత్వం
ప్రతిష్ట తగ్గిన సుప్రింకోర్టు
వేదకాలం-తొలి దశ
అమెరికా యుద్ధ వ్యూహంలో పావుగా భారత్
సంక్షోభాన్ని తీవ్రం చేసే విద్యుత్ బిల్లు
అమెరికా ఎన్నికలు : బైడెన్‌వీ అవే విధానాలు
భారత వ్యతిరేక చట్టం 'ఉపా'
వీర తెలంగాణ విప్లవ పోరాటం: పోలీసు చర్య -3

# వీర తెలంగాణ విప్లవ పోరాటం

# పోలీసు చర్య-3

పోరాట విరమణ: 1948 సెప్టెంబర్ 13న యూనియన్ ప్రభుత్వం 'పోలీసు చర్య' ప్రారంభించింది. నిజాం సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయమని బలవంత పెట్టేందుకు, తెలంగాణా రైతాంగ ఉద్యమం విస్తృతంగా వ్యాపించకుండా ఆపేందుకు సైన్యాన్ని హైదరాబాద్‌కి పంపించింది. ఎక్కడో కొన్నిచోట్ల తప్పితే నిజాం సైన్యం యూనియన్ సైన్యాన్ని ఎదిరించకుడా లొంగిపోయింది. అయిదు రోజుల్లోగా, అంటే 1948 సెప్టెంబర్ 18 నాటికి నిజాం తనంతట తానే లొంగిపోయాడు.

ఈ 'పోలీసు చర్యను' అవకాశంగా తీసుకుని ప్రజా సాయుధ దళాలు రజాకార్ల క్యాంపులపై దాడి చేసి, వాటిని నాశనం చేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. రోడ్లపైనా, పొలాల గుండా పారిపోతున్న సైనికులను పట్టుకుని తగిన బుద్ధి చెప్పాయి. శత్రువుల భవనాలను, ఆస్తులను ధ్వంసం చేయడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకత. భూస్వాముల గడులున్న చోటల్లా ప్రజలు వందలు, వేలల్లో అక్కడికి చేరుకొని వాటిని చుట్టుముట్టేవారు.

'పోలీసు చర్య' కొనసాగుతున్నంతకాలం, భారత సైన్యం రజాకార్లను, నిజాం సైన్యాన్ని మట్టుపెడుతున్నంత కాలం, పార్టీ ప్రాంతీయ దళాలను, గెరిల్లా దళాలను అందులో జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. రజాకార్లు, నిజాం సైనికులపై స్వతంత్రంగా దాడులు చేసి, వారి క్యాంపులను ధ్వంసం చేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకుని, వాటితో ఆధునిక ఆయుధాల కొరతను పూడ్చుకోవాలని ఆదేశించింది. కొన్ని వారాలు ఆగితే భారత సైనికులు, భూస్వాముల, దేశ్‌ముఖ్‌ల గ్యాంగులు తెలంగాణా రైతాంగం పట్ల ఎలా ప్రవర్తిస్తారో ప్రజలకు తెలిసిపోతుందని, అప్పుడు ప్రజలలో వారి పట్ల ఉన్న భ్రమలు తొలగిపోతాయని, వాళ్లలో ఏర్పడ్డ ఆశలు అడుగంటుతాయని పార్టీ ఆదేశించింది.

భారత సైన్యం అడుగు పెట్టిన వారం రోజులకు పార్టీపై దాడులు మొదలయ్యాయి. సైన్యం పార్టీని, గెరిల్లా దళాలను ధ్వంసం చేయటానికి పూనుకున్నది. సాయుధ గెరిల్లా దళాలను రద్దుచేయవద్దని పార్టీ నాయకత్వం హెచ్చరిస్తూనే వచ్చింది. ఆయుధాలను విడిచిపెట్ట వద్దని, భారత యూనియన్ సైన్యం, స్థానిక భూస్వాములు దేశముఖులు, పోలీసులు గెరిల్లా దళాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తారని హెచ్చరిస్తూ వచ్చింది. కానీ దురదృష్టవశాత్తు పార్టీ దళాలలో, రాజకీయ నిర్మాణ బాధ్యతలలో ఉన్నవారిలో ఎక్కువ మంది ఇటువంటి దాడులను ఎదుర్కోడానికి సిద్ధంగా లేరు. భారత ప్రభుత్వం పట్ల వారికున్న భ్రమలే ఇందుకు ప్రధాన కారణం. భారత సైన్యం ప్రవేశించిన రెండు వారాలకే పారిపోయిన భూస్వాములు, దేశ్ ముఖులు తిరిగి గ్రామాలకు చేరుకున్నారు. అధికారుల అండదండలతో తాము కోల్పోయిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేశారు. వేలాది కార్యకర్తలు, జోనల్, ప్రాంతీయ నాయకులను ఖైదు చేయించారు. మిగిలిన దళాలను నిర్దాక్షిణ్యంగా వెంటాడారు, పట్టుబడినవారిని హింసించారు, అనేకమందిని కాల్చి చంపారు. వందలాది గ్రామాలలో ప్రజలను మూకుమ్మడిగా అరెస్టులు చేయడం, హింసించడం సర్వ సాధారణమైంది.

నిజాం దురాగతాలను ఎదిరించి నిలిచిన సాధారణ ముస్లింలపై కూడా దాడులు జరిగాయి. చెప్పుకోలేని విధంగా వారిని హింసించారు. అటువంటి వారికి హిందువులు గ్రామంలోని తమ ఇళ్లలో ఆశ్రయం కల్పించారు. హైదరాబాద్ సంస్థానంలో ప్రజాతంత్ర ఉద్యమం బలహీనంగా ఉన్న ప్రాంతాలలో ముస్లింల పట్ల ఏహ్యత, వారిపై దాడులు విస్తృతంగా జరిగేవి గాని, ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో -హిందూ ముస్లింల మధ్య ఐక్యత ఉండేది. అందుకే తెలంగాణ ఉద్యమం సాధించిన విజయాలలో హిందూ ముస్లిం ఐక్యత ఒకటని గర్వంగా చెప్పుకోవచ్చు. సంస్థానాలను పూర్తిగా రద్దు చేసి పక్కనున్న అదే భాష మాట్లాడే ప్రాంతాలలో కలిపి నిజమైన ప్రజాతంత్ర ఫెడరల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేదు. భారత రాజ్యాంగం ఆమోదించబడిన 1950 జనవరి 26న నిజాంను రాజ ప్రముఖ్‌గా ప్రకటించారు. నిజాం పాలనలో అరాచకాలకు పాల్పడిన అధికారులను శిక్షించలేదు. పైగా పోరాట యోధులపై తప్పుడు కేసులు బనాయించి శిక్షలు వేశారు. కొందరికయితే ఉరిశిక్ష కూడా పడింది. చాలామంది కామ్రేడ్స్‌ని జైళ్ళ నుండి బయటికి తీసుకొచ్చి అడవులలోకి, గుట్టలలోకి తీసుకెళ్లి కాల్చి చంపారు. భారత ప్రభుత్వం, నూతన రాజ్యాంగం అమలులోకి రాక మునుపే పోరాట యోధులకు శిక్షలు అమలు చేయాలనే అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, వెను వెంటనే రహస్యంగా ఉరిశిక్షలు అమలుచేసింది. ఇలా 12 మంది యోధులు హతులయ్యారు. పాల్ రాబ్సన్ లాంటి ఎంతో మంది పేరెన్నికగన్న వారు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజాతంత్ర సంస్థలు ఇటువంటి శిక్షలను ఖండించాయి. తెలంగాణ యోధుల రక్షణ కమిటి ఏర్పాటు చేయబడింది. ఇటువంటి నిరసనలు, ఖండనలతో ప్రభుత్వం మరణ శిక్షలను యావజ్జీవ కారాగార శిక్షలుగా మార్చింది.

**ఈ దశలో పార్టీ ఎదుర్కొన్న కొన్ని సమస్యలు:** రైతులు పొందిన భూములను, ప్రజాతంత్ర హక్కులను కాపాడుకోవడం కోసం భారత యూనియన్‌కి వ్యతిరేకంగా గెరిల్లా ప్రతిఘటన కొనసాగించాలా వద్దా, కాంగ్రెస్ ప్రభుత్వ సైన్యానికి ఆయుధాలను అప్పచెప్పాలా లేక తెలంగాణా ప్రజలు వీరోచితంగా పోరాడి, పార్టీపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలా? పాక్షిక సైనిక చర్యలను నిలిపివేసి, కాంగ్రెస్ ప్రభుత్వ మిలిటరీ పాలనలో చట్టపరమైన విధానాలను అనుసరించాలా? సైనిక జోక్యం జరిగిన వెంటనే, ఏ విధమైన షరతులు లేకుండా పోరాటాన్ని నిలిపి వేస్తే పోరాటంలో పాల్గొన్న వేలాది గెరిల్లా దళాలకు, కార్యకర్తలకు, పార్టీ సభ్యులకు భారత ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటిస్తుందా?

ఈ ప్రశ్నలపై పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక వర్గం భారత సైనికదళాలకు వ్యతిరేకంగా పాక్షిక

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. వీర తెలంగాణ విప్లవ పోరాటం
పోలీసు చర్య -3 ........ 2

2. మనుస్మృతి: బిజెపి ప్రభుత్వం
సుభాషిణి ఆలి....... 4

3. ప్రతిష్ట తగ్గిన సుప్రీంకోర్టు
జస్టిస్ ఎపి షా....... 8

4. వేదకాలం-తొలి దశ
ఎంవిఎస్ శర్మ..... 14

5. అమెరికా యుద్ధ వ్యూహంలో పావుగా భారత్
ఎస్.వెంకట్రావు ...... 18

6. సంక్షోభాన్ని తీవ్రం చేసే విద్యుత్ బిల్లు
తేజ్‌పాల్ కనిట్కర్, సుధా మహాలింగం, ఆర్.శ్రీకాంత్.... 23

7. అమెరికా ఎన్నికలు : బైడెన్ అవే విధానాలు
ఎ. కోటిరెడ్డి .......... 29

8. భారత వ్యఇరేక చట్టం 'ఉపా'
ఎజి నూరాని ......... 32



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పోరాటం

"పోరాటం మాత్రమే పీడిత వర్గాన్ని ఎడ్యుకేట్ చేస్తుంది" అన్నాడు మహానేత లెనిన్. "పోరాటం మాత్రమే దాని శక్తి ఏమిటో దానికి తెలియజేస్తుంది. పోరాటం మాత్రమే దాని శక్తిని విస్తృత పరుస్తుంది, దాని సామర్థ్యాన్ని పెంచుతుంది, దానికి స్పష్టతనిస్తుంది, ఆత్మస్థైర్యాన్ని చేకూరుస్తుంది" అని చెప్పాడు. ఇప్పటికిప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటం, అంతకు ముందు కార్మికవర్గం దేశ వ్యాపితంగా చేసిన సమ్మె పోరాటం, గత కొన్నాళ్లుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన, జరుగుతున్న అనేకానేక పోరాటాలు... నయా-ఉదారవాద నిజస్వరూపం గురించి, అది ఎన్నుకున్న రాజకీయ మితవాదం గురించి కూడా శ్రామిక వర్గాన్ని ఎడ్యుకేట్ చేస్తున్నాయి. ఇది మన దేశంలోనే కాదు నేడు ప్రపంచ వ్యాపితంగా కనిపిస్తున్న పరిణామం.

లాటిన్ అమెరికాలో వామపక్ష ఉద్యమాలను అణచివేసేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష, పరోక్ష జోక్యంతో గద్దెనెక్కిన మితవాద ప్రభుత్వాలు నేడు ప్రజలనుండి తీవ్ర ప్రతిఘటన నెదుర్కొంటున్నాయి. బొలీవియాలో ఇవో మోరెల్స్ ప్రభుత్వాన్ని కుట్రలతో కూల్చివేసి మితవాద శక్తులు గద్దెనెక్కాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మళ్లీ మోరెల్స్ పార్టీ ద్విగుణీకృత శక్తితో విజయం సాధించింది. బ్రెజిల్‌లో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన పచ్చి మితవాద బోల్సెనారో ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు చుక్కలు చూపించారు. అమెరికా సామ్రాజ్యవాదుల అండతో అభివృద్ధి నిరోధక శక్తులు సాగిస్తున్న ప్రతీఘాత పోరాటాన్ని ఎదుర్కొని వెనిజులా ప్రజలు ధైర్యంగా నిలబడ్డారు. చిలీ, అర్జెంటీనా, ఈక్వెడార్ తదితర దేశాల్లో వెల్లువెత్తిన ప్రజా పోరాటాలు పాలకవర్గాలకు గంగవెర్రులెత్తిస్తున్నాయి.

యూరప్‌లోని వివిధ దేశాల్లో కార్మిక వర్గం పోరాట బాట పడుతోంది. కార్మికవర్గ పోరాటాలతో ఫ్రాన్స్ దద్దరిల్లింది. గ్రీస్‌లో మళ్లీ సమ్మెల వెల్లువ ప్రారంభమైంది. అమెరికాలో ట్రంప్ మితవాద రాజకీయాలకు, నల్లజాతివారిపై దాడులకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటం ఆయనను ఎన్నికల్లో ఓడించింది. అమెరికా అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టకుండా ప్రజలు సాగనంపడం అరుదైన ఘటన.

మన దేశంలో కూడా ఇటీవలి కాలంలో జరిగిన ప్రజా పోరాటాలు ఫలించకుండా పోలేదు. బీహార్ ఎన్నికల్లో నరేంద్ర మోడీ, బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు తమ శక్తినంతటినీ ఒడ్డి పనిచేశారు. డబ్బు, అధికారాన్ని ఉపయోగించి అనేక కుట్రలు కుయుక్తులకు పాల్పడ్డారు. అయినప్పటికీ ఆర్‌జెడీ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమి ఓడిపోయినా, ఎన్డీఏ కన్నా ఎక్కువ ఓట్లు సాధించిందంటే ప్రజాభిప్రాయం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఈ పరిణామాలన్నీ ప్రపంచ వ్యాపితంగానూ, మన దేశంలోనూ మితవాద రాజకీయాల పట్ల ప్రజల వ్యతిరేకతను సూచిస్తున్నాయి. మితవాదం ఎంతగా ప్రజలను అణచివేస్తే దానికి ప్రతిఘటన కూడా అంతగా పెరుగుతుంది. పరస్పరం ఘర్షించే శక్తుల నుండే చరిత్ర పుడుతుందని మార్క్సిస్టు మహోపాధ్యాయులు చెప్పారు. ఈ రోజు ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఈ ఘర్షణను మరింతగా పెంచే అవకాశాలు, ఆ ఘర్షణలనుండి కొత్త చరిత్ర ఉద్భవించే అవకాశాలు మెరుగైనాయి. ఈ అవకాశాలను వామపక్ష ప్రజాతంత్ర శక్తులు అందిపుచ్చుకుని పోరాటాలను సరైన దిశలోకి మళ్లించాలి.


**చందా వివరాలు**
విడిప్రతిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# మనుస్మృతి: బిజెపి ప్రభుత్వం

**సుభాషిణి ఆలి**

'తమిళనాడు విదుత్తలై చిరుతైగల్ కట్చి' నాయకుడు తిరుమల వలవన్ మనుస్మృతికి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కొత్తగా బిజెపి తీర్థం పుచుకున్న ఖుష్బూ చెన్నైలో మహిళలతో ఒక ప్రదర్శన నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ మనుస్మృతిని సమర్థిస్తూ బహిరంగంగా చేసిన మొట్ట మొదటి ప్రదర్శన ఇదే. ఈ సనాతన గ్రంథంలో పేర్కొన్న అంశాలను అమలుచేసే క్రమాన్ని ఇప్పుడు సంఘ్ పరివార్ మరింత తీవ్రతరం చేసినట్టుంది. జమ్మూ–కాశ్మీర్‌కు సంబంధించి 370 అధికరణాన్ని, 35 ఏ ని రద్దుచేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన మొదటి ఏడాది సంబరాలు జరుపుకోవడంలోనే ఇది కనిపించింది. జమ్మూ–కాశ్మీర్ ప్రజల హక్కులపై జరిగిన ఈ పాశవిక దాడితో, భారతదేశంలో ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉన్న ఒకే ఒక్క రాష్ట్రం అయిన కాశ్మీర్ జనాభా స్వరూప స్వభావాలు మార్చటానికి మార్గం సుగమం చేశారు. సంఘ్ పరివార్ కల అయిన హిందూ రాష్ట్రస్థాపన సాకారానికి ఇదొక ముఖ్యమైన ముందడుగు.

**హిందూ రాష్ట్ర ఏర్పాటుకు చర్యలు**

2020 ఆగస్టు 5 న బాబ్రీమసీదు శిథిలాల పై రామమందిర నిర్మాణానికి భూమిపూజ జరిగింది. వాస్తవానికి ఇది హిందూరాష్ట్ర ఏర్పాటుకు శంఖుస్థాపన అన్నది సుస్పష్టం. ఈ సందర్భంలో ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ఒక శ్లోకాన్ని వినిపించారు.

"ఈ దేశంలో పుట్టిన తొలి సంతానం (బ్రాహ్మణులు) ఈ భూమిమీద పుట్టిన మనుషులందరికీ తమ తమ బాధ్యతలు తెలియచేయుదురు గాక." (మనుస్మృతిలోని ఒకటవ అధ్యాయంలో 73 వ పేజీ – ఢిల్లీలోని ఆర్ష సాహిత్య ప్రచార ట్రస్ట్ డాక్టర్ సురేష్ కుమార్ సంపాదకత్వంలో ప్రచురించిన పుస్తకం నుండి. ఇది ఆర్‌ఎస్‌ఎస్ కు అధికారిక గ్రంథం )

2014 ఎన్నికలలో విజయం పొందడంతో ఇక అధికారంలో తామే ఉంటామన్న గట్టి నమ్మకం కలిగిన భగవత్, భారతదేశం ఏ దిశలో ప్రయాణించబోతోందో సూచించడమే కాదు', మనుస్మృతిలోని ఈ శ్లోకాన్ని చదవడం ద్వారా తమ భవిష్యత్ గమనాన్ని స్పష్టం చేశారు.

భారత రాజ్యాంగం ఆమోదించబడిన నాలుగు రోజుల తర్వాత 1949, నవంబర్ 30 వ తేదీ ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్ ఇలా వ్రాసింది :

"భారత రాజ్యాంగంలోని అత్యంత నీచమైన విషయం ఏమిటంటే ఇందులో భారతీయత అన్నది ఏ మాత్రం లేదు. ప్రాచీన భారతదేశంలో ఉన్నతమైన రాజ్యాంగ వ్యవస్థ అభివృద్ధి చెందిన తీరు ప్రస్తావనే లేదు.... ఈ రోజుకీ ఆయన (మనువు) ప్రపంచ పాలకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతూ, వారి అభినందనలను పొందుతున్నారు. కానీ మన రాజ్యాంగ పండితులకు ఇవేం పట్టలేదు."

ఎన్నికల ప్రయోజనాలే సంఘ్ పరివార్ లక్ష్యం కావటంతో తరువాత డెబ్బయి ఏళ్ళు బహిరంగంగా మనుస్మృతికి మద్దతు తెలుపలేదు. అలా మద్దతు ఇచ్చి ఉంటే సమాజంలోని పెద్ద సెక్షన్ ప్రజలకు వారు దూరమయేవారు. వారి రాజకీయ ప్రయోజనాలు దెబ్బతినేవి. అయితే భారత రాజ్యాంగంతో మౌలికంగా విభేధిస్తున్నట్టు వారు తెలియచేస్తూ వచ్చారు. రాజ్యాంగంలోని ఉపోద్ఘాతం నుండి 'లౌకిక, సోషలిస్టు' పదాలను తొలగించాలని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. వాజపాయ్ ప్రభుత్వ హయాంలో వేసిన ఒక కమిటీ రాజ్యాంగంలో కొన్ని సవరణలు చేయాలని ప్రతిపాదించింది. అయితే అదంతగా ప్రచారం పొందలేదు.

2014, 2019 లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత సంఘ్ పరివార్ తన సొంత ఎజెండా అమలు వేగాన్ని ఉధృతం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

చేసింది. భారత సమాజాన్ని సమానత్వం వైపుకు, న్యాయం వైపుకు మళ్లించే రాజ్యాంగ సంస్థలన్నిటిపై దాడి చేస్తూ వాటిని నిర్వీర్య పరచడానికి పూనుకుంది. మత విభజనలను పెంచుతూ హక్కులు నిరాకరించబడుతన్న, సమానత్వాన్ని కోరుకుంటున్న వారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. పార్లమెంటులో తన పశుబలాన్ని ఉపయోగించి మహిళలు, దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నది.

'హిందూమతం ప్రాతిపదికగా' ప్రభుత్వం ఏర్పడుతుందని చాలామంది మేధావులు భయపడుతున్నారు. ఇది మైనారిటీలకు హాని కలిగించేది మినహా తమకేమీ నష్టం జరగదని, వాస్తవంలో తమకు కొన్ని ప్రయోజనాలు కలిగే అవకాశాలు కూడా ఉన్నాయని కొంతమంది మెజారిటీ మతానికి చెందినవారు భ్రమపడుతున్నారు.

**మనుధర్మ శాస్త్రం**

మనుధర్మశాస్త్రం ఈ దేశాన్ని హిందూ దేశంగా మారుస్తుందని అనుకుంటే అంతకంటే తప్పుడు అవగాహన ఇంకొకటి ఉండదు. ఈ శాస్త్రం ఆధారంగా చేసే చట్టాలు దేశంలో పుట్టుక వలన ఏర్పడ్డ సామాజిక, ఆర్థిక, లింగ అసమానతలను మరింత గట్టి పరుస్తాయి. ఈ అసమానతలు తప్పించుకోలేనివని, మార్చలేనివని ఈ శాస్త్రం బోధిస్తుంది. పుట్టుకతో నిర్ణయించబడే వృత్తులను అందరూ అనుసరించవలసిందే. అంటే ఏ కులంలో పుట్టినవారు ఆ వృత్తులనే చేయాలి.

మను ధర్మశాస్త్రం వృత్తులను పరిశుభ్రమైనవి, అపరిశుభ్రమైనవిగా విభజించింది. అపరిశుభ్రమైన పనులు చేసే వారు నీచంగా చూస్తారు. అసహ్యించుకుంటారు. అంతులేని హింసకు గురిచేస్తారు. ఇతర వర్ణాలు చేసే పనులను వారు ఆశించకూడదు. ఆశిస్తే వారు

పాపులు అవుతారు. తీవ్రమైన శిక్షకు గురవుతారు. తమ ఉద్యోగాలను 'రిజర్వేషన్'ల పేర దళితులకు, వెనుకబడిన కులాల వారికి కట్ట పెడుతున్నారని వాపోతూ, వాటిని వ్యతిరేకిస్తూ అగ్రకులాల వారు హింసాత్మకంగా ప్రదర్శనలు చేయడం ఇందుకు నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం కూడా రిజర్వేషన్లను రద్దు చేయటానికి అనేక రకాలుగా ప్రయత్నం చేస్తున్నది. ఉన్న ఉద్యోగాలు తగ్గిపోవడంతో వేరే దారి లేక అంటరాని పనులు చేసేవారు కూడా తమకే ఆ పనులు కేటాయించాలని కోరుతున్నారు. అంటే ఉన్నత వర్గాలవారు, అస్పృలు కూడా మనుస్మృతితో ఏర్పడ్డ 'రిజర్వేషన్లు' కొనసాగాలని కోరుకుంటున్నారన్నమాట. ఇది అత్యంత దురదృష్టకరమైన పరిణామం.

మనుస్మృతిలోని దాదాపు ప్రతి శ్లోకం అసమానతలు స్థిరంగా ఉండేందుకు దోహద పడేదే. కుల పరిధులను దాటి వర్ణ సంకరం చేసేవారికి అత్యంత కఠినమైన శిక్ష పడుతుంది. వర్ణ సంకరం పెరిగిన సమాజంలో పశుత్వం, అరాచకం, అరిష్టం ఏర్పడతాయని మనుధర్మ శాస్త్రం చెబుతుంది. కుల పవిత్రతను కాపాడడానికి మహిళలు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితమవ్వాలని పేర్కొంటుంది. పుట్టుక నుండి గిట్టే వరకు మహిళలను ప్రతిక్షణం కాపలా కాయాలని, వారి ప్రతి కదలికను నియంత్రించాలని చెబుతున్నది.

**చట్టం ముందు సమానత్వం–మనుస్మృతి**


సమానత్వం అన్నది ఆధునిక రాజ్యాంగంలో అత్యంత కీలకమైన అంశం. కానీ మనుధర్మ శాస్త్రంలో దీనికి చోటే లేదు. అందువలన ఒక దోషి తాను చేసిన దోషాన్ని బట్టే కాదు, అతను/ఆమె కులాన్ని బట్టి కూడా శిక్ష అనుభవిస్తారు. ఒకే రకం తప్పుచేసినా శిక్ష మాత్రం కులం మీద ఆధారపడి ఉంటుంది.

మనుస్మృతిలోని కొన్ని శ్లోకాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

(ఈ శ్లోకాలన్నీ ఈ మధ్యే ప్రచురించబడిన 'ది లా కోడ్ అఫ్ మను, పాట్రిక్ ఓలివెల్, ఆక్స్‌ఫర్డ్ వరల్డ్ క్లాసిక్స్ నుండి సేకరించబడినవి. ఇవన్నీ డాక్టర్ సురేంద్ర కుమార్ గారి హిందీ / సంస్కృత పుస్తకంలో కూడా ఉన్నాయి.)

మనుస్మృతిలోని మొట్టమొదటి అధ్యాయంలో, "ఈ ప్రపంచం వృద్ధి చెందడానికి సృష్టికర్త తన నోటి నుంచి, భుజాల నుంచి, తొడల నుంచి, పాదాల నుంచి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, సూద్రులను సృష్టించాడు". దళితులకు వర్ణాశ్రమ ధర్మంలో స్థానమే లేదు. వారు 'వెలివేయబడ్డవారు'.

"ప్రాచీన భారతదేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం ఉన్నాయనే భావన కొంత మందిలో ఉంది. కానీ అది వాస్తవం కాదు. మనుస్మృతి లో (5 విభాగం, శ్లోకాలు 148,149) ఏముందో చూడండి : "ఒక మహిళ, తన ఇంట్లో కూడా (బాలిక అయినా, యవ్వనవతి అయినా, ముదుసలి అయినా) ఏ పనీ స్వతంత్రంగా చేయకూడదు. చిన్న వయసులో తండ్రి, యవ్వనంలో భర్త, భర్త చనిపోయిన తరువాత కొడుకు అధీనంలో ఉండాలి" అని ఉంది."




ఢిల్లీలోని ఆర్ష సాహిత్య ప్రచార ట్రస్ట్ వారు డాక్టర్ సురేష్‌కుమార్ సంపాదకత్వంలో ప్రచురించిన 'మనుస్మృతి' పుస్తకం

వర్ణం అన్నది పుట్టుకతో రాదని, యోగ్యతని బట్టి వస్తుందని మనువు పేర్కొన్నట్టు వర్ణాశ్రమ ధర్మాన్ని సమర్ధించేవారు అంటారు. కానీ మనువు ఒడుగు సమయంలో వేసుకునే జంధ్యం విషయంలో స్పష్టంగా, బ్రాహ్మణులు వేసుకునే జంధ్యం ఉత్తమమైనదిగానూ, అతి సున్నితంగా ఉండాలనీ, క్షత్రియుడు వేసుకునే జంధ్యం కాస్త మోటుగానూ, వైశ్యులు వేసుకునే జంధ్యం ఇంకాస్త మోటుగానూ ఉండాలని రాశాడు. సూద్రులు ఒకేసారి పుడతారు కాబట్టి శూద్రులు ఒడుగు చేసుకోకూడదు. జంధ్యం వేసుకోకూడదు.

పిల్లలకు పెట్టే పేర్లు కూడా వివిధ స్థాయిలలో విభజించబడ్డాయి. "బ్రాహ్మణుల పేర్లలో పవిత్రత ప్రదర్శించబడాలి. క్షత్రియుల పేర్లలో బలాధ్యత, వైశ్యుల పేర్లలో సంపద, శూద్రుల పేర్లలో ఏహ్యభావం కనపడాలి. (రెండో విభాగం. 30,31,3, శ్లోకాలు.) పసి పిల్లలు తమ సామర్ధ్యాలను, ఇష్టాలను ప్రదర్శించలేరు. కాబట్టి మనుస్మృతి పుట్టుక ఆధారంగానే కులాలు నిర్ణయించబడ్డాయని చెప్పటానికి ఈ శ్లోకాలే సాక్ష్యాలుగా ఉన్నాయి.

ఈ గ్రంథం క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం, క్రీస్తు శకం రెండవ శతాబ్దాల మధ్య రాయబడినదని రచయిత నిరూపించారు. "మనుస్మృతిని రాయడానికి మూడు ప్రధానమైన సామాజిక, రాజకీయ కారణాలున్నాయని భావించవచ్చు. ఇందులో ప్రధానమైనది మౌర్య సామ్రాజ్యం ఏర్పడిన తర్వాత రెండు, మూడు శతాబ్దాలకు అశోకుడు రాజకీయ, సామాజిక, మతపరమైన సంస్కరణలు అమలు జరిపాడు. అశోకుడు బుద్ధుని అనుయాయుడు. ఆయన బ్రాహ్మణ వ్యతిరేకా కాదా అన్నది వివాదాస్పదం. అయితే అయన అమలు చేసిన సంస్కరణల వలన బ్రాహ్మణులు సామాజిక దొంతరలో తమ ప్రాధాన్యాతను కోల్పోయారన్నది మాత్రం నిర్వివాదం. రాజకీయ అధికారానికి, మత సంస్థలకు ప్రాతినిధ్యం వహించే బ్రాహ్మణులకు మధ్య ఉండే ప్రత్యేక సంబంధాలు తెగిపోయాయి" అని ఒలివెల్లే తన పుస్తకంలోని 13వ పేజీలో రాసిన పరిచయంలో పేర్కొన్నారు.

**మహిళలకు ప్రత్యేక సూత్రాలు**

మనువు మహిళలకు ఎటువంటి నీతి సూత్రాలు బోధించాడో చూద్దాం.

ప్రాచీన భారతదేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం ఉన్నాయనే భావన కొంత మందిలో ఉంది. కానీ అది వాస్తవం కాదు. మనుస్మృతి లో (5 విభాగం, శ్లోకాలు 148,149) ఏముందో చూడండి : "ఒక మహిళ, తన ఇంట్లో కూడా (బాలిక అయినా, యవ్వనవతి అయినా, ముదుసలి అయినా) ఏ పనీ స్వతంత్రంగా చేయకూడదు. చిన్న వయసులో తండ్రి, యవ్వనంలో భర్త, భర్త చనిపోయిన తరువాత కొడుకు అధీనంలో ఉండాలి" అని ఉంది. 154 శ్లోకం దీనికి అదనంగా " భర్తకి ఏ సుగుణాలు లేకపోయినా, కామ పిపాసి అయినా, ఏ ఒక్క మంచి లక్షణం లేకపోయినా, ఒక మంచి

> “మహిళ తన చావులోనూ, బతుకులోనూ నమ్మకస్తురాలిగా మెలగాలి. కానీ భర్త మాత్రం “భార్య చితికి నిప్పు పెట్టినవెంటనే మళ్ళీ పెళ్లి చేసుకొని, తన కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించుకోవచ్చు” అని పేర్కొన్నారు. ఇందులో ఏమయినా సందేహాలుంటే వాటిని 8 విభాగంలోని 416 శ్లోకం తీర్చేసింది. ఇందులో, “భార్య, కొడుకు, బానిస- ఈ ముగ్గురికి సంపద ఉండకూడదని మన సంప్రదాయం చెపుతున్నది.”

(పతివ్రత) మహిళ తన భర్తనే దేముడిగా కొలవాలి”.

మహిళ తన చావులోనూ, బతుకులోనూ నమ్మకస్తురాలిగా మెలగాలి. కానీ భర్త మాత్రం “భార్య చితికి నిప్పు పెట్టినవెంటనే మళ్ళీ పెళ్లి చేసుకొని, తన కార్యక్రమాలను యథావిధిగా కొనసాగించుకోవచ్చు” అని పేర్కొన్నారు.

ఇందులో ఏమయినా సందేహాలుంటే వాటిని 8 విభాగంలోని 416 శ్లోకం తీర్చేసింది. ఇందులో, “భార్య, కొడుకు, బానిస– ఈ ముగ్గురికి సంపద ఉండకూడదని మన సంప్రదాయం చెపుతున్నది. వారు సంపాదించినది ఏదయినా ఉంటే, అది వారికి సంబంధించిన ఇంటి యజమానికి చెందు తుంది”.

మహిళలు యుక్త వయసుకు వచ్చిన వెంటనే పెళ్ళి చేయాలని, కుల, వర్ణ స్వచ్ఛతను కాపాడటానికి ఇది అవసరమని పేర్కొన్నారు. పురుషులకు భిన్నమైన నిబంధనలను మహిళలకు విధించింది. వారు మహిళలతో ఇష్టానుసారం వ్యవహరించటానికి అవకాశం ఇచ్చింది. ద్విజులు తమ కులంలోని వారిని పెళ్ళాడిన తర్వాత కామవాంఛలను తీర్చుకోవటానికి ఇతరకులాల వారిని పెళ్ళాడటానికి అవకాశం ఇచ్చింది. వైశ్యుడు తనకులంలోని వారిని పెళ్ళాడిన తర్వాత కింది కులం మహిళను పెళ్ళి చేసుకోవచ్చు. క్షత్రియుడు తనకులంలోని మహిళను పెళ్ళాడిన తర్వాత వైశ్య, సూద్రకులాల వారిని పెళ్ళి చేసుకోవచ్చు. బ్రాహ్మణుడు తనకులంలోని మహిళను పెళ్ళాడిన తర్వాత మిగతా మూడు కులాల వారిని పెళ్ళాడవచ్చు. సూద్రుడు మాత్రం తనకులంలోని వారినే పెళ్ళాడాలని పేర్కొన్నారు.

కుల, వర్గ దొంతరలను మనుస్మృతి కొనియాడింది. మనుస్మృతి ఆ రెండింటికీ మద్దత్తు నిస్తుంది. పుట్టుకతో వచ్చిన కులవృత్తి పరిధులను దాటితే తీవ్రమైన శిక్షలు ఉంటాయి అని 8 విభాగంలో 21, 22 శ్లోకాలు తెలియ చేస్తున్నాయి. “బ్రాహ్మణులను పక్కన పెట్టి, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక వివరణను సూద్రుడి నుంచి రాజు వింటే, ఆవు బురదలో కూరుకుపోయినట్టు ఆ రాజ్యం సమస్యలలో కూరుకుపోతుంది. రాజ్యం అంతా కరువు, కాటకాలతో కుప్పకూలిపోతుంది.”

8 విభాగం లోని 410 శ్లోకంలో, “రాజు ద్విజులకు సూద్రుడిని సేవకుడిగా నియమించాలి”. 413, 414 శ్లోకాలు, “బానిసగా బ్రతకడానికే శూద్రుడిని బ్రహ్మ సృష్టించాడు. ఒకవేళ బానిసత్వం నుండి అతని యజమాని విముక్తి కలిగించినా సూద్రుడు తన బానిసత్వం నుండి విముక్తి పొందినట్టు కాదు. అతనిలో సహజంగా ఉన్న బానిస స్థితి నుండి అతనిని ఎవరు విముక్తి చేయగలరు”? అని చెప్పాయి.

అదే విభాగంలో 129 వ శ్లోకంలో “సూద్రుడు ఎంతటి సమర్ధుడయినా సంపదని పోగుచేసుకోకూడదు. ఎందుకంటే సంపద కలిగిన సూద్రుడు బ్రాహ్మణుడిని బాధించవచ్చు.”

ఇక 10 వ విభాగంలో 51, 56 శ్లోకాలు చూద్దాం. “ఛండాలులు, సేవకులు, ఊరి బయటే ఉండాలి. వారి ఆస్తులు కుక్కలు, గాడిదలే. శవాలపై వేసిన బట్టలే వారి వస్త్రాలుగా ఉండాలి. వారు విరిగిపోయిన చిప్పలలోనే తినాలి. వారు ఇనపలోహంతో చేసిన వాటినే అలంకారాలుగా ధరించాలి. చట్టాన్ని అనుసరించే ఏ మనిషీ వారితో ఎటువంటి సంబంధాలూ పెట్టుకోకూడదు. వారు ఆహారం కోసం ఇతరులపై ఆధారపడాలి. వారికి విరిగిన బొచ్చులలోనే ఆహారం ఇవ్వాలి. వారు రాత్రిపూట గ్రామ వీధులలో తిరగకూడదు. పగటి పూట మాత్రం రాజు నిర్వహించమన్న కర్తవ్యాన్ని నిర్వహించడానికి ప్రత్యేకమైన దుస్తులు ధరించివెళ్ళాలి. బంధువులు లేని అనాథ శవాలకు వారే అంతిమ సంస్కారం చేయాలి. మరణశిక్ష పడిన వారికి దండనను అమలు చేయాలి”.

ద్విజులు కూడా వారి కులానికి సంబంధించిన పనులే చేయాలి కానీ తక్కువ కులం వారు చేసే పనులు చేయకూడదు. ఒకసారి ఉన్నత తరగతి వారు తమ కులవృత్తిని విడిచిపెట్టి సూద్రుల పని, వ్యవసాయం చేయుడం మొదలు పెడితే వారిక ఆ సమూహానికే చెందుతారు. సమాజంలో వారి ఉన్నత తరగతి సౌకర్యాలు వదులుకో వలసిందేనని మనుస్మృతి చెబుతుంది.

“సూద్రులు, వైశ్యులు వారి వారి కులవృత్తులు చేసుకునేటట్టు రాజు చర్యలు తీసుకోవాలి. కుల వృత్తులకు భిన్నంగా గనక చేస్తే ఈ ప్రపంచాన్నే గందరగోళ పరిచినవారవుతారు అని 8 విభాగంలోని 418వ శ్లోకంలో పేర్కొన్నారు. 162 వ శ్లోకం “వ్యవసాయం, సేవలు చేసే, సొమ్మును అప్పులిచ్చే లేదా పశువులను తోలుకునే బ్రాహ్మణులను సూద్రులుగానే రాజు పరిగణించాలి” అని చెప్పింది.

10 విభాగంలోని 92వ శ్లోకం, “మాంసాన్ని, లక్కని, ఉప్పును అమ్ముకునే బ్రాహ్మణులను వెంటనే కులం నుండి వేలివేయాలి. పాలను అమ్ముకుంటే మూడు రోజులలోనే సూద్రుడవుతాడు” అని చెప్పింది.

అదే విభాగం లో 95, 97 శ్లోకాలలో, “ఇతరుల విధులను నూటికి నూరుశాతం అమలు చేయడం కన్నా తమ సొంత విధులను ఏ మేరకయినా అమలు చేయడమే ఉత్తమం. ఇతరుల విధులను అమలు చేసేవాడిని వెంటనే కుల బహిష్కరణ చేయాలి” అని పేర్కొన్నారు.

## మనుస్మృతి – శిక్షలు

అసమానతలను శాశ్వతం చేసేందుకు మనుస్మృతి చేయని ప్రయత్నం లేదు. ‘హిందూ రాష్ట్ర’ అసమాన న్యాయ వ్యవస్థను కొనసాగిస్తుందనడానికి ఏమాత్రం సందేహించ నవసరం లేదు. అటువంటి సంఘటనలను మనం ఇప్పటికే చూస్తున్నాము.

మనుస్మృతిలో ఇందుకు సంబంధించిన అనేక శ్లోకాలు ఉన్నాయి.

బ్రాహ్మణులను చంపడం అతి భయంకరమైన నేరంగా పరిగణించబడుతుందని పదేపదే చెప్పడం జరిగింది. ఉదాహరణకి 11 విభాగంలోని 307వ శ్లోకం: “బ్రాహ్మణుని బాధించాలనుకునే మనిషి నరకానికి పోతాడు. అతనిని భయపెడితే అక్కడ వందేళ్లు ఉంటాడు. కొడితే వెయ్యేళ్ళు ఉంటాడు”.

వివిధ కులాల వారిని చంపినందుకు శిక్షలు వేరువేరుగా ఉంటాయి. 11వ విభాగం లోని 127వ శ్లోకంలో “బ్రాహ్మణిడిని చంపితే పడే శిక్షలో క్షత్రియుడిని చంపితే నాలుగోవంతు, వైశ్యుడిని చంపితే ఎనిమిదో వంతు, సూద్రుడిని చంపితే పదహారో వంతు శిక్ష పడుతుంది”

అని చెప్పారు.

అలాగే 8వ విభాగంలో 267, 268 శ్లోకాలు "బ్రాహ్మణుడిని క్షత్రియుడు చంపితే 100, వైశ్యుడు చంపితే 150 నుండి 200 రూపాయల జరిమానా వేయాలి. కానీ సూద్రుడు చంపితే ఉరిశిక్ష వేయాలి. బ్రాహ్మణుడు క్షత్రియుడిని దుర్భాషలాడితే 50, వైశ్యుడిని దుర్భాషలాడితే 25, సూద్రుడిని దుర్భాషలాడితే 12 రూపాయలు జరిమానా వేయాలి''. (రూపాయలకు బదులుగా ఆనాటి నాణాలని అర్థం చేసుకోవాలి. మనం అర్థం చేసుకోవలసినది కేవలం మోతాదు మాత్రమే).

> ❝ ఈ దేశ పాలకులు మనుస్మృతికి ఇచ్చే విలువ మహిళల విషయంలో మరింత స్పష్టం గా కనిపిస్తుంది. మహిళలకు రక్షణకల్పి ంచే విషయంలో పాలకులకు ఏ మాత్రం శ్రద్ధ లేక పోవడం, పై కులాలకు చెందినవారు చేసే అత్యాచారాలకు బహిరంగంగా మద్దతు పలకడం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన శ్లోకాలు మనుస్మృతిలో అనేకం ఉన్నాయి. ❞

సూద్రులకు, దళితులకు అత్యంత నీచమయిన శిక్షలు విధించబడ్డాయి. 8వ ప్రకరణంలో 270, 272 శ్లోకాలలో ఇలా ఉంది: "ఒక ద్విజుడిని నిమ్న కులస్థుడు దుర్భాషలాడితే అతని నాలుకను కోసేయాలి, ఎందుకంటే ఆతను పుట్టినది బ్రహ్మ శరీరంలోని కింది భాగం నుండి. అతనే కనుక కులం పేరెత్తితే పదివేళ్ళ పొడవున్న కాల్చిన ఇనుప గొట్టాన్ని అతని నోటిలో దూర్చాలి. అతను అహంభావంతో బ్రాహ్మణుల విషయంలో చట్టాన్ని ప్రశ్నిస్తే రాజు కాలుతున్న వేడి నూనెను అతని నోట్లో, చెవులలో పోయాలి". (ఈ చివరి శ్లోకం సూద్రులు, దళితులు వేదాలు శాస్త్రాలు ఎందుకు చదవకూడదని అన్నారో తెలియచేస్తుంది.)

11వ విభాగంలో 40, 47 శ్లోకాలు ఆవును చంపడం తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నాయి. కొన్నిసార్లు ఇందుకు శిక్ష కుల బహిష్కరణ. ఈ శిక్ష ఒక క్షత్రియ, వైశ్య, సూద్ర మహిళ అత్యాచారానికి గురైన శిక్షతో సమానం. నిజానికి అనేక సందర్భాలలో ఆవును చంపినందుకు పడే శిక్ష మనుషులను చంపినందుకు వేసే శిక్ష కన్నా ఎక్కువగా ఉంటుంది. ఆవు మాంసం తిన్నారనో, ఆవును చంపారనో, లేదా అమ్మారనో ముస్లింలపై ఈ నాడు జరిగేదాడులను మనుస్మృతిని నమ్మడం వలన జరిగే పరిణామాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

బ్రాహ్మణులకు అన్ని శిక్షల నుండి రక్షణ ఎలా ఉంటుందో 11 విభాగంలోని 162వ శ్లోకంలో చూడవచ్చు. "అతను (బ్రాహ్మణుడు) ఈ మూడు లోకాలను సర్వనాశనం చేసినా, అందరి ఆహారం తినేసినా, ఋగ్వేదాన్ని మస్తిష్కంలో దాచుకున్న బ్రాహ్మణుడికి మాత్రం ఏ పాపం అంటదు."

గత ఆరేళ్ళ కేంద్రంలోని బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ విధానాలు, చట్టాలలో చేస్తున్న సంపూర్ణ మార్పులు, న్యాయవ్యవస్థ ఇస్తున్న లోపభూయిష్టమైన తీర్పులు మనుస్మృతిని ఏ విధంగా అమలు పరచాలని ప్రయత్నిస్తున్నారో తెలియచేస్తుంది. ఈ మధ్యనే కార్మికుల, కర్షకుల చట్టాలలో చేసిన మార్పులు వారి హక్కులను పూర్తిగా రద్దు చేశాయి. మనుస్మృతి కార్మికులు, కర్షకులు చేసే శ్రమను తిరస్కారభావంతో చూడటం, దోపిడీదారులకు ఇచ్చే మద్దతు ఇందుకు కారణం అని పై అంశాలు తెలియజేస్తున్నాయి.

ఈ దేశ పాలకులు మనుస్మృతికి ఇచ్చే విలువ మహిళల విషయంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. మహిళలకు రక్షణకల్పి ంచే విషయంలో పాలకులకు ఏ మాత్రం శ్రద్ధ లేకపోవడం, పై కులాలకు చెందినవారు చేసే అత్యాచారాలకు బహిరంగంగా మద్దతు పలకడం ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన శ్లోకాలు మనుస్మృతిలో అనేకం ఉన్నాయి. స్వకులంలోని, వివిధ కులాల్లోని మహిళలతో మగవారికుండే సంబంధాలను గురించి ఇందులో చెప్పినవి చూస్తే మహిళల హక్కులు హరించడం న్యాయమేనని, వారిపై జరిగే భౌతిక దాడులు సమర్ధనీయమని నమ్మించే శ్లోకాలను ఇందులో నుండి చదువుతున్నారు.

మనుస్మృతి 3వ విభాగంలోని 24, 26 శ్లోకాలు, 8 రకాల పెళ్ళిళ్ళను గురించి ప్రస్తావించాయి. అందులో కొన్ని మహిళలను బలవంతంగా ఎత్తుకురావడాన్ని, హింసించి 'ఒప్పించడం '(రాక్షస వివాహం) అని పేరు పెట్టినవి కూడా ఉన్నాయి. ఇది అత్యంత పాశవికంగా ఉంటుంది. అత్యంత క్రూరమైన పద్ధతి. 24 వ శ్లోకంలో ఇది క్షత్రియులకు మాత్రమే అనుసరించదగ్గదని రాశారు. "ఒక అమ్మాయి భయపడుతూ, ఏడుస్తుండగా హత్యలు చేసి, విధ్వంసం సృష్టించి ఆమెను హింసించి, ఇంటినుండి ఎత్తుకొచ్చి చేసుకునే పెళ్లిని రాక్షస వివాహం అంటారు అని చెప్పారు".

2,000 ఏళ్ల కిందట ఈ మనుస్మృతిలో వర్ణించినట్టు, భయంకరమైనటువంటి ఈ వివాహ పద్ధతి హత్రాస్ ఘటనలో ప్రతిబింబిస్తుంది. ఇందులో ఒక వాల్మీకి కులానికి చెందిన అమ్మాయి నాలుక కోసేశారు. అయినా ఆమె తనపై నలుగురు క్షత్రియులు మూకుమ్మ డిగా మానభంగానికి పాల్పడినట్టు మరణ వాంగ్మూలం ఇచ్చే చనిపోయింది.

మనుధర్మ శాస్త్రంలో మహిళలకు, సూద్రులకు, అణగారిన తరగతులకు ఏ రకమైన నిబంధనలు ఉన్నాయో, ఉన్నత వర్గాలకు, బ్రాహ్మణులకు ఎటువంటి వెసులుబాట్లు ఉన్నాయో చూశాం. వాటిని అనుసరించడం వలననే నేటి ప్రభుత్వంలోని అనేకులు సమాజపు అంచులకు నెట్టివేయబడుతున్న వారికి అండగా నిలవక పోగా వారిపై మరిన్ని హింసలకు పాల్పడుతున్నారు. నిస్సిగ్గుగా ప్రకటనలు, ప్రచారాలు చేసుకుంటున్నారు. రాజ్యాంగ బద్ధంగా మైనారిటీలకు రక్షణ నివ్వవలసిన న్యాయకోవిదులు 'ఆత్మసాక్షిగా' న్యాయ నిర్ధారణ చేస్తున్నారు.

పైన ఉటంకించిన మనుధర్మ సూత్రాలను అమలు చేయడం వలన భారత సమాజం సమానత్వం వైపు నుండి అసమానత్వం వైపుకు తిరోగమించటం ప్రారంభమౌతుంది.

2,000 ఏళ్లనాటి మను ధర్మశాస్త్రాన్ని ఆదర్శంగా భావించడం వల్లనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దోషులైన క్షత్రియులను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. కానీ బాధితులకు న్యాయం చేయాలనుకోలేదు. అటువంటి మనుధర్మ శాస్త్రాన్ని ఈనాడు మనం అంగీకరిద్దామా? ఆ శాస్త్రాన్ని ఆధారం చేసుకుని పాలించాలనుకునే పాలకులను సమర్థిద్దామా అని విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలి.

ఆధునిక సమాజం సమానత్వం కోరుకుంటుంది. వందల ఏళ్ల పాటు అందుకోసం ప్రగతిశీల శక్తులు విశేషమైన కృషి చేశారు. ఇక ముందు కూడా చేస్తారు. మనం ఆ ప్రగతిశీల శక్తులతో చేయి కలిపి, ప్రాచీన ధర్మశాస్త్రంగా చెప్పబడే అధర్మాన్ని, దానిని అనుసరించే పాలకులను వ్యతిరేకించాలి. అదే నేటి ధర్మం.

**(అనువాదం: కె ఉషారాణి)**

# ప్రతిష్ట తగ్గిన సుప్రీంకోర్టు



రచయిత ఢిల్లీ హైకోర్టు
విశ్రాంత న్యాయమూర్తి

**జస్టిస్ ఎపి షా**

**(జస్టిస్ ఏపి షా 2008 మే నుండి 2010 ఫిబ్రవరిలో పదవీ విరమణ చేసే వరకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 20వ లా కమిషన్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. 2020 సెప్టెంబర్‌లో జస్టిస్ హొసబెత్ సురేష్ స్మారకసభలో "దిగజారుతున్న సుప్రీంకోర్టు: మరుగునపడుతున్న స్వేచ్ఛ, తరుగుతున్న హక్కులు" అంశంపై జస్టిస్ ఎ పి షా ప్రసంగించారు. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం ఇతర అనేక సంస్థలతో కలిసి ఈ సభను నిర్వహించింది. ఈ సందర్భంలో డాక్టర్ అస్గర్ అలీ ఇంజినీర్ జీవిత పురస్కారం దివంగత హొసబెత్ సురేష్‌కి ప్రధానం చేశారు. జస్టిస్ షా ప్రసంగ పాఠాన్ని మార్చిస్టు పాఠకులకు అందిస్తున్నాం... సంపాదకులు)**

డాక్టర్ ఇంజనీర్, జస్టిస్ సురేష్ అచంచలమైన నిబద్ధత గలవారు. భౌతిక దాడులకు, దూషణలకు ఎన్నడూ వెరవలేదు. ఇద్దరూ వేరు వేరు స్థాయిలలో దాడులను ధైర్యంగా ఎదుర్కొని న్యాయాన్ని నిలపడానికి ఎలా పోరాడాలో మనలాంటి సామాన్య మానవులకు చూపించారు. అస్ఘర్ అలి ఇంజనీర్ దావూది బోహ్రా తెగలో సంస్కరణల కోసం పోరాడారు. జస్టిస్ హొసబెత్ సురేష్ రిటైర్‌మెంట్ తర్వాత మూడు దశాబ్దాల పాటుమానవ హక్కుల కోసం పోరాడారు. జస్టిస్ సురేష్ తనమాటే తన అంత:కరణ అని చెప్పాడు. నిష్కర్షగా పోరాడడం నేర్పిన వారిద్దరికీ మనం సదా రుణపడి ఉండాలి.

నేనీరోజు ఆ 'అంతఃకరణ' గురించే మాట్లాడతాను. అదే మనకాలంలో అత్యంత ఆందోళన కలిగించే అంశమని నేను భావిస్తున్నాను. దిగజారుతున్న సుప్రీంకోర్టును గురించి ఒకప్పటి న్యాయమూర్తిగా ముందస్తు హెచ్చరిక చేయవలసిన బాధ్యత నాపై ఉందని విశ్వసిస్తున్నాను.

ఎడ్మండ్ బ్రూక్ అనే రాజకీయ తత్వవేత్త "జడ్జీలు దుష్టపాలనను పసిగట్టేందుకు తగిన శిక్షణ పొంది ఉంటారు. వారు, రాజకీయ పవనాలలోని నిరంకుశ పోకడలను ఇట్టే పసికట్టగలరు" అన్నారు. అటువంటి కోర్టులే మనకు కావాలి. కానీ దురదృష్టవశాత్తు మనకీనాడు అటువంటి కోర్టులు లేవు.

**గత వైభవం**

సుప్రీంకోర్టు ఘనచరిత్ర కలది. అందుకది గర్వించాలి. కేశవానంద భారతి వర్సెస్ కేరళ రాష్ట్రం (1973) కేసులో 13 మంది జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో కీలకమైన మౌలిక నిర్మాణానికి పునాది పడింది. రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థ సంరక్షణకు కోర్టులు ఏమి చేయగలవనేది చూపించింది. కోర్టు రాజ్యాంగానికి "ప్రాథమిక రక్షకుడు", "వ్యాఖ్యాత" అని గ్రాన్‌విల్లే ఆస్టిన్ వ్యాఖ్యానించడం సముచితం అని నిరూపించబడింది.

మొదట్లో సుప్రీంకోర్టు చురుకుగా వ్యవహరించలేదు. అయితే క్రమంగా దేశ పరిపాలనలో తన పాత్రను అర్థం చేసుకుని, అధికారాన్ని విస్తృతపరచుకుంది. భవిష్యత్తులో క్రియాశీల పాత్ర పోషించడానికి పునాదులు వేసుకుంది. కేశవానందభారతి కేసుతో ఈ క్రమం ప్రారంభమైంది. తరువాతి కాలంలో ఇచ్చిన తీర్పుల వలన సుప్రీంకోర్టు గుర్తింపు మరింత పెరిగింది. ఇందులో చెప్పుకోదగ్గవి– మేనకా గాంధీ వర్సెస్ భారత యూనియన్ (1978), ఫ్రాన్సిస్ కొరాలి వర్సెస్ యూనియన్ టెర్రిటరీ ఆఫ్ న్యూఢిల్లీ (1981), ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీ వర్సెస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ (2000). వీటన్నింటి విచారణలో వ్యవస్థను సరైన క్రమంలో పెట్టారు. రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్‌లో ఉన్న హక్కులను విస్తృతపరిచారు.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యం –పిల్– అన్నదానితో "సోషలిస్టు న్యాయవాద" దశ ఆరంభమయింది. దీనితో కోర్టు క్రియాశీల పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుంది. 1990ల చివరికి వచ్చేసరికి పర్యావరణ పరిరక్షణలాంటి వాటిలో కూడా తన అధికారాన్ని వినియోగించడం ప్రారంభించింది. ఈ క్రమంలో కోర్టు తీర్పులు కార్యనిర్వాహక వ్యవస్థ పరిధిలోకి చొరబడటంతో కోర్టుల పాత్ర విమర్శలకు గురైంది. ఈ విమర్శ అనవసరమైనది కాదు. అయితే సంస్థ అనుసరించిన ఈ ధోరణికి దానిని పొగడవచ్చు కూడా. అయితే పిల్‌ను కొన్నిసార్లు దుర్వినియోగం చేశారు. అంటే సుప్రీంకోర్టు చరిత్రలో ఎగుడుదిగుడులు లేవనికాదు. తీవ్రమైన పొరపాట్లు జరిగిన వాటిలో జబల్పూర్ అడిషనల్ మెజిస్ట్రేట్ వర్సెస్ శివకాంత్ శుక్లా (1976) కేసు ఒకటి. ఇందులో కోర్టు దారి తప్పిందని అర్థం చేసుకొని, తరువాతి కాలంలో దానిని సరిదిద్దుకునేందుకు, కోర్టు ప్రతిష్ఠను పునరుద్ధరించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగాయి. ఇకపై ఇటువంటి తప్పిదాలు జరగవని మొదటి తరం జడ్జీలు నమ్మారు. కాని 1980, 90 దశాబ్దాలలో కొద్దికాలం కోర్టు తన ప్రతిష్ఠను కొంతమేరకు కోల్పోయి, తిరిగి సరైనదారికి వచ్చింది. కానీ ప్రస్తుతం మళ్ళీ తిరోగమనం ప్రారంభమయింది. ఎమర్జెన్సీ వంటి దుర్భర పరిస్థితులను నివారించటం కోసం ముందుగానే మేల్కొన వలసిన అవసరం ఉన్నది.

**పాలనావ్యవస్థ పైచేయి**

వీటన్నిటి గురించి మాట్లాడవలసిన అవసరం ఏమిటని మీరు అడగవచ్చు. మనకు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకిక సార్వభౌమత్వం అన్ని ఉన్నట్టు కాగితంపై కనిపిస్తుంది. మనకి ప్రాథమిక హక్కులు దుర్భేద్యమైన గోడల మధ్య భద్రంగా ఉన్నట్టు అనిపిస్తుంది. పార్లమెంటరీ పాలనా వ్యవస్థలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు, బాధ్యతలు విభజించబడినట్టుగా కనిపిస్తుంది. ఇది ఎంతో మందికి అసూయ కలిగిస్తుంది. చట్టసభలు, రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ఆడిటర్ జనరల్,

ఎన్నికల కమిషన్, హ్యూమన్ రైట్స్ వాచ్, అవినీతి నిర్మూలన శాఖ, ప్రసార మాధ్యమాలు, పౌర సమాజం తదితర సంస్థల ద్వారా సర్వాధికారాలు కలిగిన పాలనా వ్యవస్థ ప్రజలకు జవాబుదారీగా ఉన్నట్టు కనిపిస్తుంది. దురదృష్టవశాత్తు నేను చెప్పినవన్నీ కాగితాలపైనే ఉన్నాయి.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఏర్పాటుచేసిన ప్రతి సంస్థనూ క్రమపద్ధతిలో విధ్వంసం చేస్తున్నారు. 2014లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రాగానే ఈ విధ్వంసం మొదలయింది. దీనిని ఇందిరాగాంధీ ప్రభుత్వం అమలుచేసిన అత్యవసర పరిస్థితితో పోల్చడం పరిపాటి. కానీ ఆ పోలిక సరైనది కాదు. ఇప్పుడు భారతీయ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ధ్వంసం చేసి, మొత్తం అధికారాన్నం తటిని చేతిలోకి తీసుకోవటానికి అధికార యంత్రాంగం వ్యూహాత్మకంగా ప్రయత్నం చేస్తున్నది.

ఈ మధ్యకాలంలో పార్లమెంటు పరిమితులను కూడా తెలియచేసే అనేక అంశాలు మనం చూశాం. కోవిడ్ -19 లాక్‌డౌన్ విధిస్తున్నప్పుడు కూడా పార్లమెంటు సమావేశమవలేదు. తరువాత సమావేశమైనప్పుడు కూడా ప్రశ్నల సమయాన్ని రద్దు చేశారు. పార్లమెంటును నిర్వీర్యం చేస్తున్న పరిస్థితులలో పాలనను అదుపులో పెట్టడానికి ఇతర సంస్థల పనితీరు మెరుగుపడవలసి ఉన్నది. కాని మనం ఈ మధ్య కాలంలో లోక్‌పాల్ గురించి వినలేదు. జాతీయ మానవ హక్కుల కమిషన్ నిద్రావస్థలో ఉంది. ఏ మాత్రం అవకాశం వచ్చినా పరిశోధనా సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ రాజీ పడిపోయింది. సమాచార కమిషన్ పనిచేస్తునట్టు కనిపించడం లేదు. విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాలు, పౌర సమాజాలను కూడా విచ్ఛిన్నం చేస్తున్నారు. ప్రతిరోజూ విశ్వవిద్యాలయాలపై దాడులు జరుగుతున్నాయి. విద్యార్థులు ఘర్షణలకు పాల్పడుతున్నారని ఆరోపణ చేస్తున్నారు. లేదా ఉపాధ్యాయులు నేరపూరితమైన కుట్రలకు పాల్పడుతున్నారని నిందలు వేస్తున్నారు. భారతదేశ నాల్గవ స్థంభంగా భావిస్తున్న నిష్పక్షపాత ప్రచార మాధ్యమం చాలా కాలం కిందటే మరణశయ్య నెక్కింది.

అన్నిటికంటే న్యాయవ్యవస్థ పరిస్థితి ఆందోళన కలిగిస్తున్నది. న్యాయాన్ని అందించవలసిన ఎన్నో విషయాలు ఈ రోజు న్యాయ వ్యవస్థ ముందున్నాయి. పార్లమెంటు బలహీనపడిన సందర్భంలో కాశ్మీర్‌ని మూడు భాగాలుగా విభజించినప్పుడు, జాతీయ పౌరసత్వ చట్టం చేసినప్పుడు, 2019లో ఈ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలను నేరపూరితమైనవిగా ఆరోపించినప్పుడు, దేశద్రోహ చట్టాన్ని అన్యాయంగా ఉపయోగించినప్పుడు, 1967- నేరపూరిత కార్యకలాపాల (నివారణ) చట్టం (ఉపా) తెచ్చినప్పుడు, ఎన్నికల బాండ్లు విడుదల చేసిన సందర్భంలోను, ఇంకా ఇతర అనేకానేక సందర్భాలలోనూ సుప్రీంకోర్టు న్యాయం అందించడానికి ముందుకు రాలేకపోయింది. సమాజం ఈనాడు యుద్ధంలో ఉండక పోవచ్చు. కానీ కొన్ని తరాలుగా లేనటువంటి అత్యవసర పరిస్థితులలో ఉన్నది. దురదృష్టవశాత్తు ఇవన్నీ ఉపేక్షించబడుతున్నాయి. వీటన్నింటిలో కీలకమైనది సుప్రీం కోర్టుపాత్ర. అది నన్ను ఎక్కువగా బాధిస్తున్నది.

> **"2014లో బిజెపి నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే సుప్రీంకోర్టు పతనం ఆరంభమయిందని నా ఉద్దేశం. ఎన్.డి.ఏ ప్రభుత్వం అంతకు ముందటి తన అవతారలన్నిటి కంటే మరింత మితవాదం వైపు మరలింది. సుప్రీంకోర్టు దిగజారుడు యాదృశ్చికం కాదు. పథకం ప్రకారం పరిపాలనను అంతా రాజ్యం చేతిలోకి తీసుకునేందుకు పన్నిన వ్యూహంలో భాగమే. ఇవన్నీ దాని రాజకీయ లబ్ది కోసం చేసిన పనులే."**



న్యూ ఢిల్లీలోని సుప్రీం కోర్టు భవనం

### సుప్రీం కోర్టు పతనం ఆరంభం

2014లో బిజెపి నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే సుప్రీంకోర్టు పతనం ఆరంభమయిందని నా ఉద్దేశం. ఎన్.డి.ఏ ప్రభుత్వం సైద్ధాంతికంగా మనం అలవాటు పడిన మధ్యేవాదానికి దూరంగా ఉన్నదన్నది ఎవరూ కాదనలేని సత్యం. నిజానికి అంతకుముందటి తన అవతారలన్నిటి కంటే మరింత మితవాదం వైపు మరలింది. సుప్రీంకోర్టు దిగజారుడు యాదృశ్చికం కాదు. పథకం ప్రకారం పరిపాలనను అంతా రాజ్యం చేతిలోకి తీసుకునేందుకు పన్నిన వ్యూహంలో భాగమే. ఇవన్నీ దాని రాజకీయ లబ్ది కోసం చేసిన పనులే.

2015లో జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్‌జెఎసి) చట్టాన్ని బిజెపి ప్రభుత్వం తీసుకురావటంతో వివాదం ప్రారంభమైంది. కమిషన్ రాజ్యాంగ విలువ ప్రశార్ధకమైంది. కోర్టు తన స్వతంత్ర నియామకాల విధానాన్ని కొనసాగిస్తూ చట్టం చెల్లదని కొట్టివేసింది. 2014లో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటయిన మొదట్లో, రెండిటి మధ్య సంబంధాలు బాగుండేవి. కోర్టు స్వతంత్రంగా ఉండి, ధైర్యంగా నిర్ణయాలు చేయగలిగేది. ఈ విషయం, ముఖ్యంగా న్యాయాధికారుల నియామకాలలో తెలియవచ్చింది. కానీ దురదృష్టవశాత్తు ఈ రోజు పరిస్థితి అది కాదు.

ఈరోజు న్యాయ మంత్రిత్వశాఖ హైకోర్టు న్యాయాధిపతుల నియామకాలనూ, మార్పులనూ నిర్ణయిస్తున్నది. ఈమధ్య జరిగిన జస్టిస్ అఖిల్ ఖురేషి, ఎస్.మురళీధరన్, జయంత్ పటేల్ వంటి వారి బదిలీలు ప్రశ్నార్ధకమైనప్పటికీ వాటిని గురించి కోర్టు నోరు విప్పలేదు. జడ్జీల బదిలీలను మౌనంగా అంగీకరించింది. ఎన్.జె.ఏ.సి.

> "వాస్తవం ఏమిటంటే, సుప్రీంకోర్టు న్యాయపరంగా దృఢంగా వ్యవహరించిన శకం ముగిసింది. ఇప్పుడిక మిగిలినదంతా గతంలోని ఘనకీర్తి, పాత జ్ఞాపకాలు మాత్రమే. ఈమధ్యే పుత్తుస్వామి కేసులో జబల్పూర్ ఏ.డి.ఎం. పిశాచిని తాటిచెట్టంత లోతులో పూడ్చి పెట్టారని అన్నారు. కానీ ఆ పిశాచి మళ్లీ లేచి మనలను వెన్నాడుతున్నదని నేననుకుంటున్నాను."

విషయంలో స్వయం ప్రతిపత్తిని రక్షించుకోవడాన్ని గురించి గొప్పగా చెప్పిందంతా గాలికి కొట్టుకుపోయినట్టుంది.

2018లో నలుగురు సుప్రీంకోర్టు జడ్జీలు బయటికి వచ్చి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ఎన్నడూ లేని విధంగా, న్యాయ పరిపాలనలో, యాజమాన్యంలో జరుగుతున్న అవకతవకలపై తమ అసంతృప్తిని ప్రజలకు తెలియచేశారు. ఇదొక ప్రత్యేక సంఘటన మాత్రమే. అప్పుడప్పుడూ కొందరు జడ్జీలు వ్యక్తిగతంగా, కొన్ని సందర్భాలలో తమ భావాలను తెలిపిన ఘటనలు ఉన్నాయి. ఉదాహరణకు వ్యక్తి గోప్యత విషయంలో, జస్టిస్ కేఎస్ పుట్టస్వామి (రిటైర్డ్), వర్సెస్ యూనియన్ అఫ్ ఇండియా లేదా శ్రేయ సింఘాల్ వర్సెస్ యుఒఐ (2015) కేసులలో న్యాయమూర్తులు తమ భావాలు తెలిపడమే కాదు ఆర్టికల్ 19(1)ఏ ని ఉల్లంఘిస్తున్నందుకుగాను సెక్షన్ 66ఏ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి 2000 చట్టాన్ని రద్దు చేశారు. ఇలా ఆర్టికల్ 19(1)ఏ ని ఉల్లంఘిస్తున్నందుకుగాను ఒక చట్టాన్ని రద్దు చేయడం ఇదే మొదటి సారి.

కోర్టులు పాలనాపర వ్యవహారాలలో ప్రభుత్వానికి లోబడి పనిచేయడం గమనంలోకి వస్తున్నాయి. ఈ మధ్య వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన పది తీర్పులలో నాలుగు మాత్రమే హక్కును కోరుకున్న వారికి అనుకూలంగా వచ్చాయి. ఆ నాలుగు కూడా ప్రభుత్వం వాదికి మద్దతు ఇచ్చినవి లేదా వాదికి అనుకూలంగా తీర్పునివ్వడానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేనివి. అందుకు భిన్నంగా ప్రభుత్వం వ్యతిరేకించిన కేసులు ఓడిపోయాయి. ప్రస్తుతం కోర్టు పనితీరిది.

వాక్ స్వాతంత్ర్యం విషయానికి వచ్చేసరికి కోర్టు మరింత కరకుగా వ్యవహరిస్తున్నది. ఇందుకు ప్రశాంత్ భూషణ్ కేసు ఉదాహరణ. కేవలం రెండు ట్వీట్లు చేసినందుకు ప్రశాంత్ భూషణ్‌ను కోర్టు ధిక్కారానికి గాను తీవ్రంగా విమర్శించి ఒక రూపాయి జరిమానా వేసి, ఉదారంగా వ్యవహరించినట్లు ప్రవర్తించింది. ఈ క్రమం అంతటిలో ఒక విషయం స్పష్టంగా తెలుస్తున్నది. కోర్టు ఒక నిరంకుశ సంస్థగా మారిపోయింది.

వాస్తవం ఏమిటంటే, సుప్రీంకోర్టు న్యాయపరంగా దృఢంగా వ్యవహరించిన శకం ముగిసింది. ఇప్పుడిక మిగిలినదంతా గతంలోని ఘనకీర్తి, పాత జ్ఞాపకాలు మాత్రమే. ఈమధ్యే పుత్తుస్వామి కేసులో జబల్పూర్ ఏ.డి.ఎం. పిశాచిని తాటిచెట్టంత లోతులో పూడ్చి పెట్టారని అన్నారు. కానీ ఆ పిశాచి మళ్లీ లేచి మనలను వెన్నాడుతున్నదని నేననుకుంటున్నాను.

**ఉపేక్షించబడిన స్వేచ్ఛ**

మెజారిటీ వాదాన్ని ముందుకుతీసుకు వస్తున్నవారికి వ్యతిరేకంగా కోర్టు మాట్లాడలేక పోతున్నది. ఈ విషయంలో కోర్టు పతనం స్పష్టంగా కనిపిస్తున్నది. మెజారిటీకి వ్యతిరేకంగా అని నేను నొక్కి చెపుతున్నాను. ఎందుకంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలో మైనారిటీల ప్రయోజనాలు కాపాడడంలో కోర్టులు కీలకపాత్ర పోషించాలి. ప్రజాస్వామ్యం మెజారిటీ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడం ద్వారానే చట్టబద్ధత పొందుతుంది. అయితే మైనారిటీ గ్రూపులకి, ముఖ్యంగా జనాదరణకు నోచుకోకుండా తీవ్రమైన వివక్షకు గురవుతూ, చట్టసభలను ప్రభావితం చేయలేని వారికి చట్టాలు ప్రయోజనకరంగా ఉండవు. ఇటువంటి సందర్భాలలో ప్రభుత్వం చేసే చట్టాలను కోర్టులు సమీక్షించి, నిస్సహాయులను రక్షించడం కోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న వాటిని రద్దుచేయాలి.

ఈ మధ్యనే వెలువడిన రెండు తీర్పులు ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఒకటి శబరిమల కేసు. రెండవది అయోధ్య కేసు.

2018లో కేరళలోని శబరిమల గుడిలోకి మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో ప్రగతిశీలమైనది. కానీ కేరళ ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయబోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అక్కడి అయ్యప్ప భక్తుల పక్షాన నిలిచింది. కోర్టు తీర్పు ఆఖరిమాట అయి ఉండవలసింది. కానీ కేంద్ర ప్రభుత్వం అలా భావించలేదు. వెంటనే ఒక రివ్యూ పిటిషన్ దాఖలయింది. అందులోని అంశాలను సమీక్షించడానికి విస్తృత బెంచ్‌ని ఏర్పాటు చేశారు. తీర్పు మీద స్టే ఇవ్వనప్పటికీ తీర్పు 'ఆఖరిది' కాదని కోర్టు చెప్పింది. అందువలన శబరిమల గుడిలోకి భక్తులను అనుమతించడానికి నిరాకరించింది.

దీనితో పెద్ద తేనెతుట్టెను కదిలించినట్టయింది. అంటే కేంద్ర ప్రభుత్వం తలుచుకుంటే ఎటువంటి సమస్య లేకుండా సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేయగల దన్నమాట. పునఃసమీక్ష పేరుతో ఏ తీర్పునయినా తిరిగి విచారణకు తీసుకురాగల దన్నమాట. దీని వల్ల చట్టాలను అమలు చేయటంలో తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయి.

అయోధ్య కేసుతీర్పు విషయంలో కూడా ఇటువంటి పరిస్థితే ఎదురైంది. రాజకీయ ప్రాముఖ్యత గలిగిన అంశంపై తీర్పులో ఎవరి పేరూ లేకుండా, ఏకగ్రీవం అంటూ సుప్రీంకోర్టు అసాధారణ తీర్పును వెలువరించింది. అలాహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన విధంగా శాంతి, భద్రతలను కాపాడడం పేరుతో స్థలాన్ని మూడు ముక్కలు చేయడం 'అసాధ్యం' అని చెప్పింది. అయితే సుప్రీంకోర్టు ఏమైనా న్యాయం చేసిందా? 1948, 1992లలో మెజారిటీ మతస్థులు చట్ట విరుద్ధంగా వ్యవహరించారంటూనే కోర్టు తప్పు చేసినవారిని సత్కరించింది. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే వారికి న్యాయం జరుగుతుందనే భావనను ఇటువంటి తీర్పులు వమ్ముచేస్తాయి.

2018లో యంగ్ లాయర్స్ అసోసియేషన్ వర్సెస్ స్టేట్ అఫ్ కేరళ కేసులోనూ, 2019లో ఎం.సిద్దిఖ్ వర్సెస్ మహంత్ సురేష్ దాస్ కేసులోనూ శిక్ష మినహాయించినట్టే, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసానికి పాల్పడిన కరసేవకులమీద ఉన్న కేసులను తొలగించమని హిందూ మహాసభ ఒత్తిడి చేసింది. కరసేవకులు స్వాతంత్ర సమర యోధులయినట్టు వీరికి ప్రభుత్వం పింఛనులు మంజూరు చేయాలనీ, మసీదు స్థలంలో నిర్మించే గుడిలో వారి పేర్లు రాయాలనీ డిమాండ్ చేసింది. వారిపై ఉన్న నేరాలపై విచారణ కొనసాగుతుంది అని సుప్రీంకోర్టు తీర్పులో చెప్పింది. కానీ

జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అర్ధవంతమైన ఫలితం వస్తుందన్న ఆశ కనిపించడం లేదు.

### రాజ్యాంగపర నిబద్ధత


రాజ్యాంగంలోని 21వ అధికారణానికి కోర్టులు కట్టుబడి ఉండకపోవడం మరింతగా స్పష్టమౌతున్నది. కోవిడ్‌-19 విజృభించిన నేపథ్యంలో ఏర్పడిన ఆరోగ్య సంక్షోభంతో వలస కార్మికుల జీవితాలు తలకిందులయ్యాయి. పనిలేదు, ఆదాయాలు లేవు. మౌలిక జీవితావసరాలు తీరే దారిలేదు. ఇళ్లకుపోయే దారిలేదు. ఈ పరిస్థితికి కారణమైన వారిపై దాఖలు చేస్తున్న పిటిషన్‌లను తీసుకొనే బదులు కోర్టు వాటిని తిరస్కరించింది లేదా వాయిదా వేసింది.

పిటిషన్‌లను తిరస్కరిస్తూ కోర్టు కొన్ని ప్రశ్నార్ధకమైన వ్యాఖ్యలు చేసింది: ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు రెండు పూటలా తిండి పెట్టేందుకు ఏర్పాటు చేసింది. అంతకంటే ఏంచేయగలదు? రైల్వేట్రాక్‌ మీద పడుకున్న వలస కార్మికులు చనిపోకుండా ఎలా ఆపగలం? అని ప్రశ్నించింది.

విధానపర అంశాలు, న్యాయరంగానికి సంబంధం లేని ఆహారభద్రత హక్కు, అనేక పర్యావరణ రక్షణ సమస్యలు తదితర సందర్భాలలో కోర్టులు ఆ అంశాలలో జోక్యం చేసుకొని, విధానాలను రూపొందించి వాటిని అమలుపరచమని ప్రభుత్వాన్ని ఆదేశించిన సందర్భాలున్నాయి. కానీ వలస కార్మికుల సమస్యను ప్రభుత్వమే సక్రమంగా పరిష్కరించగలదన్న విధంగా సుప్రీంకోర్టు వ్యవహరించింది. ఈ సమస్యను సుమోటోగా కూడా చాలా ఆలస్యంగా తీసుకుంది. ఈ విషయంలో కొన్ని హైకోర్టులు ధైర్యంగా, తార్కికంగా సరైన నిర్ణయాలు తీసుకుని, వలస కార్మికుల హక్కులను గురించి ప్రశ్నించాయి. తప్పుడు వార్తల ప్రచారం వలన వలస కార్మికులు తండోపతండాలుగా తరలి వెళుతున్నారన్న అడ్వొకేట్‌ జనరల్‌ తప్పుడు వాదనను సుప్రీంకోర్టు అంగీకరించి, ప్రచార సాధనాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పింది.

ఈ రోజు మన సుప్రీంకోర్టుకు వందల కోట్ల డాలర్ల భారత క్రికెట్‌ యాజమాన్యం లేదా ఉన్నత వర్గ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ఆసక్తి ఉంది గానీ ధనమూ, సమాజంలో పలుకుబడి లేని లక్షలాది మంది వలస కార్మికుల సమస్యలు పరిష్కరించే సమయం లేక పోవటం దురదృష్టకరమైన విషయం.

❝ ఈరోజు ఆధునిక భారతదేశంలో ఎన్నడూ లేని విధంగా అణచివేతకు గురవుతున్న హక్కులలో ప్రధానమైనవి నిరసన తెలిపే హక్కు, వాక్‌ స్వాతంత్ర్యం. వీటిని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం ముందుకుపోతుంటే కోర్టులు మౌనంగా ఉంటున్నాయి, లేదా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నాయి. మనం ఒక ప్రజాస్వామ్య దేశ పౌరులమని గర్వంగా చెప్పుకోవటానికి ఈ హక్కులు ఉండటమే కారణం. ❞




ఢిల్లీలో జరిగిన సిఎఎ వ్యతిరేక ప్రదర్శన: శాంతియుత ప్రదర్శకులపై దాడులు చేసిన సంఘ్‌ పరివార్‌ శక్తులను వదిలిపెట్టి బిజెపి ప్రభుత్వం ప్రదర్శకులపై కేసులు పెట్టింది

### తరుగుతున్న హక్కులు

ఈరోజు ఆధునిక భారతదేశంలో ఎన్నడూ లేని విధంగా అణచివేతకు గురవుతున్న హక్కులలో ప్రధానమైనవి నిరసన తెలిపే హక్కు, వాక్‌ స్వాతంత్ర్యం. వీటిని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం ముందుకుపోతుంటే కోర్టులు మౌనంగా ఉంటున్నాయి, లేదా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నాయి. మనం ఒక ప్రజాస్వామ్య దేశ పౌరులమని గర్వంగా చెప్పుకోవటానికి ఈ హక్కులు ఉండటమే కారణం.

రాజ్యాంగ బద్ధత లేని సిఎఎకి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలను తీసుకుందాం. ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. కానీ స్వల్పమైన అభ్యంతరాలను చూపి, కోర్టు ఈ కేసును తీసుకోడానికే అంగీకరించలేదు. ఇంతలో ప్రభుత్వం ప్రదర్శకుల నోళ్లు మూయించడానికి అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసింది. దీనిని వ్యతిరేకించే వారందరి గొంతులు నొక్కడానికి చేయని ప్రయత్నమే లేదు. న్యాయవ్యవస్థ దీనినంతటిని దూరంగా నిలబడి చూస్తూ ప్రేక్షకపాత్ర వహించడం, ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఉండడం అత్యంత దురదృష్టకరం.

వేరు వేరు రాష్ట్రాలలో వేరు వేరు వ్యూహాలు అమలు చేస్తున్నారు. యుపి ముఖ్యమంత్రి నిరసనకారులపై 'కక్ష తీర్చుకుంటాం,' అన్నారు. 'ఆజాది', 'స్వేచ్ఛ' అని ఉచ్చరించడం దేశద్రోహం అంటున్నారు. శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిని పోలీసులు కొట్టి అరెస్టు చేస్తున్నారు. వారి వాహనాలను ధ్వంసం చేస్తున్నారు. వారి ఇళ్లలోకి కూడా జొరపడుతున్నారు. ముస్లిం యువకులను లక్ష్యంగా పెట్టుకొని, దేశరక్షణ చట్టం, గూండా చట్టాలను ప్రయోగిస్తున్నారు.

అయితే ఈ నేపథ్యంలో ఢిల్లీలో చెలరేగిన ఘర్షణలు అత్యంత కీలకమైనవి. తన విధానాలను వ్యతిరేకిస్తూ హుందాగా నిరసన తెలుపుతున్న వారిని, శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నవారిని, చివరకు ఒక నాటకం ప్రదర్శించిన వారిని కూడా ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్నది. నిరాయుధులైన విద్యార్థులపై పోలీసులపై దాడి చేస్తున్నారు. ఏ చిన్న సాకు దొరికినా అపూర్వానంద్‌, యోగేంద్ర యాదవ్‌ వంటి వారిని కేసులలో ఇరికిస్తున్నారు. వ్యక్తులపై అల్లర్లు చేశారనే

> ఒకవ్యక్తి సరైన విధంగానే సిఎఎకు వ్యతిరేకత వ్యక్తం చేయగానే అతనిని దేశవ్యతిరేకిగా ముద్ర వేస్తున్నారు. ఆ వెంటనే పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. సిఎఎ పూర్తిగా దేశ వ్యతిరేక చట్టం అనేది వారు పట్టించుకోవటం లేదు. ఆందోళన చేసున్నవారు వేర్పాటువాద భావాలను రెచ్చగొడుతున్నారనీ, ముస్లింలు దేశవ్యతిరేక భావాలను పెంచి, దేశాన్ని అస్థిర పరుస్తున్నారనీ, అనువైన సమయంలో సాయుధ తిరుగుబాటు చేస్తారనీ ప్రచారం చేస్తున్నారు.

నేరారోపణలు చేయడం, చట్టవ్యతిరేకంగా గుంపుగూడారని కేసు పెట్టడం, నేరపూరిత కుట్ర, ఎప్పుడో బ్రిటిష్ పాలనలోని దేశద్రోహం కేసు లాంటివి పెట్టడం అనే వ్యూహాన్ని ఢిల్లీలో అనుసరిస్తున్నారు. కొత్తగా సవరణ చేసిన ఉపా చట్టాన్ని వినియోగిస్తున్నారు. ఇందుకు భిన్నంగా ప్రభుత్వంలో ఉన్న బిజెపి నాయకులు బహిరంగంగా రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేసినా ఏ చర్యలు ఉండవు. పైగా ఒక జడ్జి చర్య తీసుకోవటానికి పూనుకోగానే అతనిని ట్రాన్స్‌ఫర్ చేశారు.

ఒకవ్యక్తి సరైన విధంగానే సిఎఎకు వ్యతిరేకత వ్యక్తం చేయగానే అతనిని దేశవ్యతిరేకిగా ముద్ర వేస్తున్నారు. ఆ వెంటనే పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. సిఎఎ పూర్తిగా దేశ వ్యతిరేక చట్టం అనేది వారు పట్టించుకోవటం లేదు. ఆందోళన చేసున్నవారు వేర్పాటువాద భావాలను రెచ్చగొడుతున్నారనీ, ముస్లింలు దేశవ్యతిరేక భావాలను పెంచి, దేశాన్ని అస్థిర పరుస్తున్నారనీ, అనువైన సమయంలో సాయుధ తిరుగుబాటు చేస్తారనీ ప్రచారం చేస్తున్నారు.

ఇదివరకు పోలీసు అధికారిగా పనిచేసిన జూలియన్ రెబిరో 1984లో జరిగిన అల్లర్లలాగే ఢిల్లీ అల్లర్ల విషయంలో నిష్పక్షపాతంగా పరిశోధన జరగలేదని అన్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి చెందిన వారిని శిక్షించకుండా వదిలివేయటం వలన ఈ అల్లర్లు పదే పదే జరుగుతున్నాయి. పోలీసుల పరిశోధనలో కొన్ని ఒప్పుకోళ్ళు మాత్రమే ఉంటాయి గాని ఆధారాలు ఉండవు. ఇది నిష్పక్షపాతమైన విచారణ కాదు. శాంతియుతంగా నిరసనలు తెలియచేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, బహిరంగంగా రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఇచ్చిన వారిని వదిలేయడం వలననే ఢిల్లీలో అల్లర్లు చెలరేగాయి. ఢిల్లీ పోలీసులు పక్షపాతంగానూ, రాజకీయ దురుద్దేశంతోనూ వ్యవహరించారు. పోలీసులే అల్లర్లకు దిగే మెజారిటీ మతస్థులను కాపాడడంతో దోషులు సులువుగా తప్పించుకున్నారు.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి, పోలీసులకు ఇంత ధైర్యం ఎలా వచ్చింది? భారతదేశంలో ఈనాడు న్యాయవ్యవస్థ బలహీనంగా వ్యవహరించటమే అందుకు కారణం. సుప్రీంకోర్టు గనక సమయానికి జోక్యం చేసుకుని ఉంటే ఇదంతా జరిగి ఉండేది కాదు. అందుకు భిన్నంగా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోడానికి నిరాకరించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి తొందరేం లేదన్నట్టు వ్యవహరించింది. వారాల తరబడి కేసును వాయిదాలు వేస్తూ వచ్చింది. కేసు విచారణ జరిగి తీర్పు ఇచ్చిన తరువాత, అప్పీలుకు వెళ్లిన తరువాత కోర్టు మౌనం పాటించింది. అలహాబాద్ హైకోర్టు నిరసనకారుల పోస్టర్లు, హోర్డింగ్లు పెట్టడం చట్టరీత్యా నేరమని, అందువలన వాటిని 24 గంటలలో తీసేయాలని ఆదేశాలు ఇచ్చింది. సుప్రీంకోర్టుకి యూపీ ప్రభుత్వం అప్పీలు చేసుకున్న తర్వాత, సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ అలహాబాద్ హైకోర్టు తీర్పుతో ఏకీభవిస్తున్నట్టు తెలిపింది. కానీ దీనిని పరిష్కారం కోసం త్రిసభ్య బెంచ్‌కి పంపింది. దీనితో హైకోర్టు తీర్పును అమలు చేయవలసిన అవసరం లేకుండా పోయింది.

ఇంతకన్నా ఘోరమైన విషయం 2019 ఏప్రిల్‌లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వర్సెస్ జహూర్ అహ్మద్ షా వతాలి కేసులో 'ఉపా' చట్టానికి కోర్టు ఇచ్చిన వివరణ కింది కోర్టుల తీర్పులను ప్రభావితం చేసింది. ఈ తీర్పు ఒక కొత్త సిద్ధాంతాన్నే తయారు చేసింది. దీని పర్యవసానంగా ఒక నిందితుడు విచారణ జరుగుతున్నంత కాలం ఖైదీగానే ఉండాలి. ఈ తీర్పు నిచ్చిన బెంచ్‌లోని జడ్జీలు ఖన్విల్కర్, రస్తోగిలు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఆరోపణలు అన్నీ తప్పని రుజువు చేసే వరకు వాస్తవాలుగానే పరిగణించాలని చెప్పారు. అప్పటివరకు కోర్టులు ఎఫ్.ఐ.ఆర్.నే సరైనదిగా నమ్ముతాయి. బెయిల్ పొందే సమయంలో సాక్ష్యాలు అవసరం లేదన్న 1872 ఎవిడెన్స్ యాక్ట్‌ను ఇది పక్కన పెడుతుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. వీటి వలన ఉపా చట్టం కింద అరెస్టయిన వారికి బెయిలు కోసం వాదనలు చేయటం ఒక ఫార్సుగా మారింది. ఈ విధమైన రుజువుల ఆటంకాలు పెట్టిన తర్వాత బెయిలు పొందటం అసాధ్యమౌతుంది. ఫలితంగా అరెస్టు చేసిన వారిని నిరవధికంగా జైలులో ఉంచే అవకాశం అధికారులకు వచ్చింది.

దీనిని ప్రభుత్వం, పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పుడిక అసమ్మతివాదులందరూ దేశద్రోహం, గూండా చట్టం, నేరపూరితమైన కుట్ర, ఉపా కింద ఖైదు చేయబడుతున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు వలన హైకోర్టుల చేతులు కూడా కట్టివేయబడ్డాయి. తాముగా కేసుకు సంబంధించిన అంశాలను పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడింది. అంటే అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం లాగే కోర్టుల నుండి సామాన్య పౌరులకు న్యాయం లభించని పరిస్థితి ఏర్పడింది. ఆ కాలంలో జరిగిన విపత్తులు మనకాలంలో జరగకుండా ఉండాలంటే ఈ చట్టాన్ని మార్చటం లేదా నీరుగార్చటం చేయాలి. లేకపోతే వ్యక్తి స్వేచ్ఛ సునాయాసంగా హరించబడుతుంది.

కేవలం ఆలోచననే నేరంగా పరిగణించి, తమ ప్రత్యర్థుల గొంతు నొక్కేందుకు బీమా కొరేగావ్ కేసులో నిందితులను ఉపా చట్టం కింద అరెస్టు చేశారు. వారికి బెయిలు నిరంతరంగా నిరాకరించబడుతున్నది. ఈ కేసులో వరవరరావు, గౌతం నౌలఖల కంప్యూటర్ల నుండి తీసుకొన్న, సంతకం, తేదీ లేని ఒక నోట్ ఆధారంగా, వాటిని నౌలఖ, వరవరరావులకు ఆపాదిస్తూ అరెస్టు చేశారు. ఆ డాక్యుమెంటు ఇప్పటికే ప్రజలందరికీ అందుబాటులో ఉంది. ఆ డాక్యుమెంటు ఆరు ఏళ్ల కిందట ముద్రించబడిన "భారతదేశ విప్లవ వ్యూహం, ఎత్తుగడలు" అన్న పుస్తకంలో ఉన్నది. ఆ డాక్యుమెంట్‌లో దేనిలోనూ సంతకాలు, తేదీలు లేవు. 161వ సెక్షన్ కింద సుధా భరద్వాజ్‌ను ఖైదు చేయడానికి సాక్షుల సాక్ష్యాలు లేవు. కానీ ఉపా కింద అరెస్టు చేసినందు వలన బెయిల్ వచ్చే అవకాశాలు లేవు. సుప్రీంకోర్టు తీర్పువలన కేసులో మంచి చెడులను కోర్టులు పరిశీలించలేవు.

ఇటువంటి అరెస్టులన్నీ ఒకే రకంగా జరుగుతున్నాయి. సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, ప్రజా సంక్షేమం కోరే మేధావులను ముందు మావోయిస్టులుగా ముద్రవేస్తున్నారు.

> “ తన ప్రాథమిక బాధ్యతలను నిర్వహించడంలో సుప్రీం కోర్టు విఫలమై, పతనం చెందింది. కాశ్మీర్‌లో ఇంటర్నెట్ నిలుపు చేసిన విషయంలో సుప్రీంకోర్టు నిజమైన కోర్టు లాగా వ్యవహరించలేదు. పైగా ఏ విధమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇంటర్నెట్ నిలుపుదల కేసు (అనిరుద్ భాషిన్ కేసు)లో దృఢంగానే వ్యవహరించినప్పటికీ చివరికి అమలు విషయాన్ని నిర్ణయించటంలో విఫలమైంది. ”

తరువాత దళితులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తునారు. ఆ తరువాత ఉపా కింద అరెస్టులు చేస్తున్నారు.

సుధా భరద్వాజ్ గత రెండేళ్లగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారు. వరవరరావుకి కోవిడ్ వచ్చినా సరైన వైద్యం చేయించుకోడానికి అనుమతించలేదు. కొత్తగా జరుగుతున్న అరెస్టులను గురించి తరచూ వింటున్నాం. హైకోర్టులు ఏమీ చేయలేకుండా చేతులు ఎలా కట్టేస్తున్నారో నౌలఖ కేసు తెలియజేస్తున్నది. నౌలఖ ఢిల్లీ హైకోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అది విచారణకు వచ్చేలోగా కోర్టుకు సమాచారం ఇవ్వకుండా నౌలఖను ముంబై జైలుకు తరలించారు. ఎందుకిలా జరిగిందని జడ్జి ప్రభుత్వాన్ని అడిగితే సమాధానం లేదు. హైకోర్టుకి సమాధానం ఇచ్చే బదులు సొలిసిటర్ జనరల్ కేసును సుప్రీంకోర్టుకు వేశారు. యథాతథంగా సుప్రీంకోర్టు బెయిలు తిరస్కరించింది. హైకోర్టు విచారణకు ఆ విధంగా ముగింపు పలికారు.

### న్యాయాన్ని త్యజించడం

తన ప్రాథమిక బాధ్యతలను నిర్వహించడంలో సుప్రీంకోర్టు విఫలమై, పతనం చెందింది. కాశ్మీర్‌లో ఇంటర్నెట్ నిలుపు చేసిన విషయంలో సుప్రీంకోర్టు నిజమైన కోర్టు లాగా వ్యవహరించలేదు. పైగా ఏ విధమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇంటర్నెట్ నిలుపుదల కేసు (అనిరుద్ భాషిన్ కేసు)లో దృఢంగానే వ్యవహరించినప్పటికీ చివరికి అమలు విషయాన్ని నిర్ణయించటంలో విఫలమైంది. కమ్యూనికేషన్ సౌకర్యాలను నిలుపుచేయటాన్ని అవసరం, నిష్పత్తి ప్రాతిపదికన అమలు చేయాలని చెప్పినప్పటికీ కాశ్మీర్‌లో కమ్యూనికేషన్ సదుపాయాన్ని రద్దుచేయటంలో దీనిని పాటించేలా చేయటంలో విఫలమైంది. 2020 మేలో తీసుకున్న నిర్ణయంలో నిష్పత్తి, అవసరాలను నిశితంగా పరిశీలన చేయడానికి రాజ్యాంగంలోని 14, 19, 21 అధికరణాలను వర్తింపజేయటానికి బదులుగా, కోర్టు ఈ ప్రక్రియను వదిలివేసి, అనురాధ భాషిన్ వర్సెస్ జమ్మూకాశ్మీర్లోని యూనియన్ ఆఫ్ ఇండియా, 4జి సేవలు కేసులో ప్రభుత్వానికి, కోర్టుకి “సలహాలివ్వడానికి” ప్రభుత్వం నాయకత్వం వహించే ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటుచేసి, చేతులు దులుపుకుంది. ఇది తప్పనిసరిగా తప్పుదోవ పట్టించడంతో పాటు ఈ విధంగా అధికారాలను అప్పగించటం రాజ్యాంగపరంగా కూడా సమ్మతించదగినది కాదు. ప్రభుత్వం తీసుకున్న చర్యలను న్యాయపరంగా సమీక్షించాల్సిన కోర్టు ఆ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వాన్నే తన చర్యలను పునః సమీక్షించుకోవాలని చెప్పటం సరికాదు. అనుకున్నట్టే సమీక్షా కమిటీ వినతిని తిరస్కరించింది. ఫలితంగా కాశ్మీర్ ప్రజలకు సంవత్సరం పాటు 4జి సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ విధంగా ప్రాథమిక హక్కులను నిరోధించే విధంగా 4జి సర్వీసులను నిరోధించటాన్ని విస్మరించటం సరైనదేనా? సీనియర్ లాయర్ అరవింద్ దాటర్ దీనిని న్యాయాన్ని అవుట్ సోర్సింగ్ చేయటం, అంటే న్యాయాన్ని తిరస్కరించటమేనని పేర్కొన్నాడు.

కాశ్మీర్‌కి సంబంధించిన కేసులలో కోర్టు న్యాయాన్ని అందించడంలో తప్పించుకునే ధోరణి కనిపిస్తున్నది. ఇంటర్నెట్‌ను మూసివేయడం వలన కాశ్మీరులో ప్రజారోగ్యం ఎలా దెబ్బతింటున్నాదనే పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు కోర్టు ఆ విషయాన్నీ హైకోర్టులో చూసుకోమని చెప్పింది. 1.3 కోట్ల ప్రజలు ఇంటర్నెట్‌ను మూసివేయడం వలన ఆరోగ్యం, విద్య, వాణిజ్యం, ఆర్థికరంగం నష్టపోతూ ఇబ్బందులు పడుతుననప్పుడు సుప్రీంకోర్టు ఈ సమస్యను ఒక వాస్తవమైన, సరిదిద్దాల్సిన సమస్యగా తీసుకోలేదు.

ఇతరచోట్ల న్యాయ పరిధులలో ఇందుకు పూర్తి భిన్నంగా వ్యక్తి స్వేచ్ఛకు, జాతి రక్షణకు మధ్య వైరుధ్యం ఎలా పరిష్కరించబడిందో దాతర్ మాటల్లో చూద్దాం. లీవెర్సిడీజ్ వర్సెస్ ఆండర్సన్ కేసులో లార్డ్ మెకాలే “దేశం యుద్ధంలో పాల్గొంటున్నంత మాత్రాన చట్టం సరిగ్గా అమలవుతున్నదా? లేదా అని నిఘా పెట్టడంలో కోర్టులు అలసత్వం వహించవలసిన అవసరం లేదు” అన్నారు. సెప్టెంబర్ 11 దాడుల తరువాత అనుమానం కలిగిన పౌరులు


**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**" భారతదేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రమాదం చట్టసభల నుండి లేదా అధికార వ్యవస్థ నుండి వస్తున్నదని భావించటం పరిపాటిగా ఉన్నది. కానీ న్యాయ వ్యవస్థలోని వారు ఇతర విభాగాలకు లొంగిపోతే అది పూర్తిగా భిన్నమైన పరిస్థితి అవుతుంది. 1985లోనే జస్టిస్ వైవి చంద్రచూడ్ ఈనాటి పరిస్థితిని ముందుగా చూడగలిగారు. "న్యాయవ్యవస్థ స్వతంత్రతకు బయటి నుండి కాక అంతర్గతంగానే ఎక్కువ ప్రమాదం వస్తుందని" వ్యాఖ్యానించారు. "**

కానివారిని బ్రిటన్ తీవ్రవాద సంబంధాలు న్నాయంటూ పంపించివేయడమో లేదా బంధించడమో చేస్తుండేది. ఏ వి సెక్రెటరీ అఫ్ స్టేట్ ఫర్ హోం డిపార్ట్‌మెంట్ కేసులో కోర్టు కేసు కొట్టేసింది. వివక్షతో సహా ఏ విషయంలో అయినా జాతిభద్రత అంశం పార్లమెంటుకు, పాలనా యంత్రాంగానికి మధ్య ఉన్న రాజకీయ సమస్యని, వ్యక్తి హక్కులు హరించబడు తున్నాయా లేదా అన్నది కోర్టులు పరిశీలించ వలసి ఉందని తేల్చింది. హందన్ వర్సెస్ రంస్‌ఫీల్డ్ కేసులో గ్వాంటనామో బేలో మిలిటరీ కోడ్, జెనీవా కన్వెన్షన్‌లు అమలవడం లేదని ప్రభుత్వం, మిలిటరీ కమిషన్‌లు నిర్బంధించిన కేసును అమెరికన్ సుప్రీంకోర్టు కొట్టేసింది. హందన్ ఒసామా బిన్ లాడెన్ సహాయకుడు అన్న విషయం కోర్టు పట్టించుకోలేదు. అలాగే ఇరానియన్ బ్యాంకు ఇరాన్ మిస్సైల్ ప్రోగ్రాంకి నిధులు సమకూరుస్తునందని అనుమానంతో బ్రిటిష్ ట్రెజరి ఆ బ్యాంకుతో లావాదేవీలను నిషేధించినపుడు సుప్రీంకోర్టు ఆ ఆదేశాన్ని కొట్టి వేసింది. బ్యాంకు హక్కులు, జాతి ప్రయోజనాల మధ్య సమతుల్యం పాటించబడలేదని పేర్కొంది. భారతదేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా తమ తోటి బ్రిటిష్, అమెరికా న్యాయస్థానాల నుండి ఇటువంటి విషయాలలో కొంత నేర్చుకుని, తమ స్వంత మేధస్సును ఉపయోగించాల్సింది.

### మాస్టర్ ఆఫ్ రోస్టర్ విషయం

న్యాయవ్యవస్థ స్వతంత్ర సంస్థగా ఉండడం లో ఎలా తీవ్రంగా విఫలమవుతున్నదో కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నది. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలనేది కూడా స్పష్టంగా కనిపిస్తున్నది. దీనిని ఎలా చేస్తున్నారో కూడా బహిరంగ రహస్యమే. సుప్రీం కోర్టులో ప్రభుత్వ అనుకూల జడ్జీలను పెంచాల్సిన అవసరం లేదు. ఒకేవిధంగా ఆలోచించే 30 మంది జడ్జీలు దొరకడం కష్టమైనా అసాధ్యం కాదు. అందువలన పారదర్శకత లేని మాస్టర్ ఆఫ్ రోస్టర్ పద్ధతి, తమకు అనుగుణంగా వ్యవహరించే ఒక ప్రధాన న్యాయమూర్తి, నలుగురు 'నమ్మదగిన న్యాయమూర్తులు' ఉంటే స్వతంత్ర న్యాయవ్యవస్థను ధ్వంసం చేయడానికి సరిపోతారు. ఇదంతా ఊహాత్మకమైన విషయం కాదు. ప్రస్తుతం భారతదేశంలో జరుగు తున్నదిదే. నిజంగా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలిగే సమర్ధవంతమైన న్యాయకోవిదులు పక్కకు నెట్టివేయ బడుతున్నారు. ప్రైవేటు తగవులు తీర్చడానికి, పెద్దగా దుష్పరిణామాలు ఉండని కేసులలో తీర్పులు చెప్పడానికి పంపబడుతున్నారు. గత ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులుగా నియమించబడిన వారు 'మాస్టర్ ఆఫ్ రోస్టర్' ద్వారా రాజకీయంగా సున్నితమైన కేసులను, ప్రధానమైన కేసులను ఈమధ్యనే పదవి విరమణ చేసిన అరుణ్ మిశ్రా ఉన్న బెంచ్‌లకు కేటాయించారని న్యాయవ్య వస్థను పరిశీలించేవారు చెబుతున్నారు.

భారతదేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రమాదం చట్టసభల నుండి లేదా అధికార వ్యవస్థ నుండి వస్తున్నదని భావించటం పరిపాటిగా ఉన్నది. కానీ న్యాయ వ్యవస్థలోని వారు ఇతర విభాగాలకు లొంగిపోతే అది పూర్తిగా భిన్నమైన పరిస్థితి అవుతుంది. 1985లోనే జస్టిస్ వైవి చంద్రచూడ్ ఈనాటి పరిస్థితిని ముందుగా చూడగలిగారు. "న్యాయవ్యవస్థ స్వతంత్రతకు బయటి నుండి కాక అంతర్గతంగానే ఎక్కువ ప్రమాదం వస్తుందని" వ్యాఖ్యానించారు.

### ప్రజాతంత్ర వ్యవస్థలు ఎలా పతనమౌతాయి?

స్టీవెన్ లెవిట్‌స్కీ, డేనియల్ జిబ్లాట్ 'ప్రజాతంత్ర వ్యవస్థలు ఎలా పతనమౌతాయి" అన్న తమ పుస్తకంలో "ఎక్కువశాతం ప్రజాతంత్ర వ్యవస్థలు పతనమవడానికి కారణం సైనికులో, సైన్యాధికారులో కాదు. ఎన్నుకున్న ప్రభుత్వాలే" అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నుకున్న నాయకులే ప్రజాతంత్ర వ్యవస్థను కూలదోయడాన్ని గురించి వారు అనేక ఉదాహరణలను చెప్పారు. ఈ కూలదోయడం కూడా రాజ్యాంగం ఆమోదించిన బ్యాలెట్ ద్వారా ఎన్నికైనవారు, శాసన మండలి, న్యాయవ్యవస్థ ఆమోదంతో జరిగినవే. కూలదోస్తున్నంతసేపూ ప్రజాతంత్ర వ్యవస్థ సక్రమంగా నడుస్తున్నట్టే నమ్మిస్తారు. స్టీవెన్ లెవిట్‌స్కీ, డేనియల్ జిబ్లాట్ లు ఇటువంటి పరిస్థితులలో వృద్ధి చెందిన నాయకులను "ఎన్నికయిన నియంతలు" అంటారు. వీరు సంస్థలన్నిటినీ తమ రాజకీయ ఆయుధాలుగా మార్చుకుంటారు. ప్రచార సాధనాలు, ప్రైవేటురంగం నోరు మూయిస్తారు. ప్రతిపక్షం కంటే తమ రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా అన్ని సూత్రాలను తిరగ రాయిస్తారు. ఇటువంటి పరిస్థితులలో కూడా విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. కానీ పాలించే శక్తులను ప్రశ్నించిన వారందరు అన్నిరకాల కష్టాలలో మునిగిపోతారు, దేశద్రోహం నేరం మోపబడుతుంది, పన్నులు ఎగ్గొట్టారని అంటారు, ఇలాంటివే ఎన్నోరకాల వేధింపులు ఎదుర్కోవలసి వస్తుంది. ఈ విధంగా "ప్రజాస్వామ్య వ్యవస్థలోని సంస్థలనే ... ప్రజాస్వామ్యాన్ని అంతం చేయడానికి ఉపయోగిస్తారు".


నిష్కర్షగా చెప్పాలంటే ఈరోజు భారతదేశంలో జరుగుతున్నదిదే. ఇటువంటి దుర్భర పరిస్థితులలో కూడా దీనినంతటిని మార్చగలిగే శక్తి ఉన్నది ఒక్క న్యాయవ్యవస్థకే. దురదృష్టవశాత్తు అదే దారి తప్పినట్టు కనిపిస్తున్నది. న్యాయవ్యవస్థ ఎమర్జెన్సీ కాలంలో ఇలాగే దారి తప్పి, తిరిగి కాలక్రమంలో స్వతంత్రతని సాధించుకుంది. ఇప్పుడు కూడా రాజ్యాంగానికి, చట్టాలకు కట్టుబడి ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎందరో ఉ న్నారు. వారు ఈనాటి పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తారని ఆశిస్తాను. ఇప్పుడు అవసరం కూడా అదే. 70 సంవత్సరాల కిందటే రాజ్యాంగ శాసనసభలో నెహ్రూ, "మనకు అత్యంత నిజాయితీ" గల న్యాయమూర్తులు కావాలని "వారు ప్రభుత్వ పాలనా వ్యవస్థకి, తమ విధి నిర్వహణలో ఎంతటి గొప్పవారు అడ్డొచ్చిన సరే వారికి కూడా ఎదురు నిలవగలగాలని" అన్నారు. భారతదేశంలో అటువంటి జడ్జీలు తిరిగి రావడం మనం చూస్తామని నేను ఆశిస్తున్నాను.

**(అనువాదం: కె ఉషారాణి)**

# వేదకాలం-తొలి దశ

## (క్రీ.పూ. 1500 - 1000 సం॥)

ఎంవిఎస్ శర్మ



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాశక్తి సంపాదకులు

వేదాలను శృతములు అని అంటారు. అంటే నోటిమాట ద్వారా చెప్పినదానిని విని, నేర్చుకుని, యథాతథంగా తిరిగి ఇంకొకరికి నేర్పడం. వినడం ద్వారా నేర్చుకున్నవే తప్ప లిఖితపూర్వకంగా కాదు. ఆ తర్వాత చాలా వందల సంవత్సరాల తర్వాత క్రీ.శ. 10వ శతాబ్దం నాటికి వాటిని క్రోడీకరించి రాత రూపంలోకి తెచ్చారు. అంతవరకూ, తరతరాలుగా ఇలా విని నేర్చుకుని కొనసాగించడం ద్వారా వేదాలు ఉనికిలో కొనసాగాయి. ఇప్పటికీ నోటిమాట ద్వారానే వేదాలను నేర్పుతారు. వేదాలను ఒక వ్యక్తిగానీ, కొందరు సమకాలీనులైన వ్యక్తులు గానీ రచించలేదు. కొన్ని వందల సంవత్సరాల కాలంలో అనేకులు తమ అనుభూతులను, అనుభవాలను, తమకు బోధపడిన ఈ ప్రకృతి స్వరూపాన్ని వ్యక్తం చేసిన సాహిత్య రూపాలే వేదాలు. ఎలా రూపొందినా, వేదాలు ఆనాటి పరిస్థితులగురించి మనం తెలుసుకోడానికి ఉపయోగపడే అమూల్యమైన ఆధారాలుగా ఉన్నాయన్నది మనం గమనించాలి. క్రీ.పూ. 1500–1000 సంవత్సరాల మధ్య కాలంలో ఋగ్వేద సాహిత్యం రూపొందింది. ఋగ్వేదంలో ఉపయోగించిన భాష సంస్కృతం. ఐతే ఈ సంస్కృతభాషకు ఇప్పుడు ఉపయోగించే భాషతో పోల్చి చూస్తే చాలా తేడా ఉంటుంది. ఆధునిక సంస్కృత భాషా పండితులకు సైతం ఋగ్వేద భాషను సక్రమంగా వివరించడం కష్టసాధ్యం.

ఋగ్వేద ఆర్యులు ఇక్కడివారేననీ, అందుకే భారతదేశాన్ని ఆర్యావర్తము అని అంటారనీ ఆర్ఎస్ఎస్ వాదిస్తుంది. కాని ఋగ్వేద ఆర్యులు వాడిన భాషను చారిత్రికంగా పరిశీలిస్తే ఈ వాదన చెల్లదని తేలిపోతుంది. గత వ్యాసాలలో ప్రస్తావించినట్టు సంస్కృతం ఇండో–యూరపియన్ భాషా కుటుంబానికి చెందినది. అందులో ఇండో–ఇరానియన్ ఉప కుటుంబానికి చెందిన భాష సంస్కృతం. ఇండో–యూరపియన్ భాషలు అటు అట్లాంటిక్ మహా సముద్రం నుండి ఇటు బంగాళాఖాతం దాకా ఉన్నప్రాంతంలోని ప్రజలు మాట్లాడతారు. అందుచేత ఋగ్వేద ఆర్యుల పుట్టు పూర్వోత్తరాలు నిర్ధారించడానికి ఒక శాస్త్రీయమైన ప్రాతిపదిక అవసరం. ఋగ్వేద భాష ఇరాన్‌కు చెందిన అవేస్త అనే రచనలోని భాషకు దగ్గరగా ఉంది. ఇటు ఋగ్వేదంలోనూ, అటు అవేస్తలోనూ గుర్రానికి సంబంధించిన ప్రస్తావనలు ఉన్నాయి. ఆర్యులతోబాటే గుర్రాలు మన ఉపఖండంలో ప్రవేశించాయన్నది చారిత్రికంగా స్పష్టం అయింది. కనుక గుర్రంతో ముడిపడివున్న సంస్కృతులను పరిశీలించితే ఆర్యులు అనబడే కొన్ని తెగలకు చెందిన ప్రజలు మన ఉపఖండంలోకి ఎప్పుడు, ఎక్కడనుంచి వచ్చారన్నది తేల్చడానికి వీలవుతుంది.

క్రీ.పూ.1800–1400 మధ్యకాలంలో స్వాత్ ప్రాంతం (పాకిస్తాన్‌కు వాయువ్య ప్రాంతంలో ఉన్న భాగం)లో నెలకొన్న ఘలిగాయ్ సంస్కృతిలో అప్పటి ప్రజలు గుర్రాన్ని మచ్చిక చేసి ఉపయోగించిన ఆధారాలు లభించాయి. ఆ తర్వాత బెలూచిస్తాన్ ప్రాంతంలోని పిరాక్ వద్ద లభించిన అవశేషాలలో గుర్రానికి సంబంధించిన ఆధారాలు దొరికాయి. అవి క్రీ.పూ. 1600–1400 నాటివి. ఈ ప్రాంతాలు సింధునదికి పశ్చిమాన ఉన్నవి. అందుచేత ఆర్యులు భారత ఉపఖండంలోకి క్రీ.పూ. 1800–1400 మధ్య కాలంలో ఇరాన్ వైపునుండి ప్రవేశించారని ఆధునిక చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు. లభిస్తున్న పురావస్తు అవశాషాలను బట్టి చూస్తే భారీ సంఖ్యలో ఆర్యులు ప్రవేశించారని నిర్ధారించడానికి గానీ, అప్పటికే ఇక్కడ నివసిస్తున్న స్థానికులను (సింధు ప్రాంత ప్రజలను) వెళ్ళగొట్టి ఆ ప్రాంతాలను ఆక్రమించుకున్నారని గానీ చెప్పలేము. ఆ పురావస్తు అవశేషాలలో భారీస్థాయిలో గానీ, గణనీయమైన మోతాదులో గానీ ఆర్యులకూ, స్థానికులకూ మధ్య ఘర్షణలు జరిగి, విధ్వంసం జరిగిన దాఖలాలేమీ లేవు. వెలుపలినుండి వచ్చిన ఆర్య తెగలు ఇక్కడి స్థానిక తెగలతో కలిసిపోయినట్టు భావించాలి. గుర్రాలను ఉపయోగించి రథాలపై ప్రయాణం చేయగలిగిన వారి సామర్ధ్యంతో వారు ఒక పరిమిత ప్రాంతంలోనే దిగబడిపోకుండా విస్తరించగలిగారు. సింధునదిని దాటి ఈవలవైపుకు వచ్చి పంజాబ్ మీదుగా ఆగ్నేయ దిశగా వారి విస్తరణ జరిగింది. ఇదంతా దీర్ఘకాలంలో సంభవించిన పరిణామం. (చూ. ఋగ్వేద ఆర్యులు సంచరించిన ప్రాంతం మ్యాప్ 1.1)

ఋగ్వేద ఆర్యులు సంచరించిన ప్రాంతాలను గుర్తించడానికి చరిత్రకారులకు తోడ్పడిన మరో ఆధారం ఆ ఋగ్వేద మంత్రాలలో ప్రస్తావించిన నదుల పేర్లు. అందులో ప్రత్యేకించి నదులను ప్రస్తుతిస్తూ 10వ మండలంలో కొన్ని నదులను పేర్కొన్నారు. ఈ నదులలో కొన్ని అవేస్తలో కూడా ప్రస్తావనకు వచ్చాయి. సరయు (హరొయ్‌వా) సరస్వతి (హరక్వతి) సప్త సింధు (హప్త హెందు) నదులు అలా ప్రస్తావనకు వచ్చినవే. (బ్రాకెట్‌లలో ఇచ్చిన పేర్లు అవేస్తలో వచ్చిన ప్రస్తావనలు) సింధునదికి ఉపనదులైన ఝీలం నదిని ఋగ్వేదంలో వితస్త అని, చీనాబ్‌ను అశిక్ని అని, రావి నదిని యాయవతి అని, బియాస్ నదిని విపాశ్ అని సట్లెజ్ నదిని శుతుద్రి అని పేర్కొన్నారు. ఇందులో కాశ్మీర్ ప్రాంతపు నదులు కూడా ప్రస్తావనకు రావడం బట్టి కాశ్మీర్ లోయలో కూడా ఋగ్వేద ఆర్యులు సంచరించారని చెప్పవచ్చు. ఐతే గంగా మైదానానికి సంబంధించి కేవలం గంగ, యమున నదుల పేర్లు మాత్రమే వచ్చాయి. అంటే ఋగ్వేద కాలంలో వారి విస్తరణ గంగా

**" ఆదిమ దశను దాటి వ్యవసాయం, పశుపోషణ ప్రధాన వ్యాపకంగా ఉన్న సమాజం ఋగ్వేద కాలం. పశువుల మందల రూపంలో ప్రధానంగా 'మిగులు'ను చేజిక్కించుకునే వీలుంది. వ్యవసాయంలోని మిగులును నిలవ చేసుకోడానికి కూడా పశువుల మందలు ఒక రూపంగా ఉండేవి. ఈ మిగులును చేజిక్కించుకున్న తరగతులు పాలకులు, పూజారులు. తర్వాత కాలంలో వీళ్ళే క్షత్రియులు, బ్రాహ్మణులుగా రూపాంతరం చెందారు. తక్కిన ప్రజలను విశులు అని ప్రస్తావించారు. "**

మైదానంలో తూర్పు వైపు పెద్దగా జరగలేదని భావించాలి. సముద్రం ప్రస్తావన వచ్చింది. బహుశా అది అరేబియన్ సముద్రం అయివుండాలి.

నదుల పేర్లు వచ్చినట్టే పలు తెగల పేర్లు కూడా వచ్చాయి. ఆ మేరకు ప్రాంతాల పేర్లు ప్రస్తావనకు రాలేదు. కుభ (కాబూల్) సువాస్తు (స్వాత్) క్రుము (ఖుర్రం) గోమతి (గోమల్) గాంధార (వాయువ్య పంజాబ్) అలా ప్రస్తావనకు వచ్చిన ప్రాంతాలు.

మొత్తంగా చూస్తే ఋగ్వేద ఆర్యులు ఆఫ్ఘనిస్తాన్ వద్ద హిందూకుష్ పర్వతశ్రేణి నుండి ఇటు గంగా-యమున వరకు (పశ్చిమ ఉత్తర ప్రదేశ్), ఉత్తరాన కాశ్మీర్ నుండి సింధునది అరేబియన్ సముద్రంలో కలిసే చోటు వరకు విస్తరించారు.

### ఋగ్వేదకాలం నాటి ఆర్థిక వ్యవస్థ

ఋగ్వేదంలో వ్యవసాయానికి సంబంధించిన ప్రస్తావనలు చాలా ఉన్నాయి. పొలం (క్షేత్రం), దున్నడం (కృషి) నాగలి (లాంగల) మడి (ఫాల) నాగటి చాలు (శిర) వంటివి వాటిలో కొన్ని. రాతిచక్రంతో రూపొందించిన కప్పీలను ఉపయోగించి మోటబావులనుండి ఎడ్లతో నీరు తోడించిన పద్ధతిని అమలు చేసినట్టు దాఖలాలున్నాయి. సింధు నాగరికత కాలంలో ఎడ్లను బళ్ళు లాగడానికి, పొలం దున్నడానికి ఉపయోగించారు తప్ప నీరు తోడేందుకు ఉపయోగించలేదు. ఈ పద్ధతిద్వారా పొలాలకు నీటిని అందించడం వలన కేవలం నదీతీరాల, కాల్వల వెంబడి పరిమితమై సాగిన వ్యవసాయం ఇప్పుడు ఇంకా విస్తృతంగా, భూగర్భ జలాలున్న ప్రాంతాలకు సైతం విస్తరించింది.

ఋగ్వేదంలో గానీ, అవేస్తలో గానీ యవ ధాన్యం ప్రస్తావన ఉంది తప్ప గోధుమ ప్రస్తావన లేదు. ఐతే ఇరాన్‌కు తూర్పున, ఆఫ్ఘనిస్తాన్ పరిసరాల్లో పంటలు సాగు చేసిన కాలంలో గోధుమ సాగు ప్రారంభం అయివుండాలి. ఇక క్రీ.పూ.1800 నాటికే స్వాత్ లోయ, ఉత్తర బెలూచిస్తాన్ ప్రాంతం, హరప్పా ప్రాంతంలో వరి సాగు ఉండేది. ఆ వరి సాగు ఋగ్వేద కాలంలో కొనసాగింది. పత్తిసాగు కూడా సింధు నాగరికత కాలంలో సాగింది. దానినీ తర్వాత ఋగ్వేద కాలంలో కొనసాగించివుండాలి. ఐతే దాని ప్రస్తావన మాత్రం ఋగ్వేదంలో లేదు.

ఋగ్వేద కాలంలో ప్రధానమైన వ్యాపకం పశుపోషణ. ఐతే దాని అర్థం వ్యవసాయం ప్రాధాన్యతను తక్కువచేయడం కాదు. ఋగ్వేద సూక్తాలలో ఎక్కువగా సంపదను గుర్రాలు, ఒంటెలు, గొర్రెలు, ఆవులు- వీటి రూపంలో ప్రస్తావించారు. బహుశా వ్యవసాయంలో వీటి వినియోగం చాలా అవసరం గనుకనే పశువులను ముఖ్యమైన సంపదగా భావించివుండాలి. కేవలం పశు సంపదను మాత్రమే కలిగివున్నవారు కూడా వాటిని వ్యవసాయంలో వాడుకోడానికి అనుమతించి అందుకు బదులు ధాన్యాన్ని వసూలుచేసివుండాలి. విస్తారమైన అడవుల గురించి, తరచూ సంభవించే దావాగ్నుల గురించి ఋగ్వేదంలో పలు ప్రస్తావనలున్నాయి.

సింధు నాగరికత కాలంలో బండ్లకు ఉపయోగించిన చక్రాలు ఒకే గుండ్రపు కర్రతో చేసేవారు. ఋగ్వేద కాలంనాటికి ఆకులతో (స్పోక్స్) తో చేసిన చక్రాలను వాడడం అందులో అభివృద్ధిని సూచిస్తుంది. రథాలను లాగడానికి ఎడ్లను, గుర్రాలను, ఒంటెలను ఉపయోగించారు. గేదె (బర్రె-మహిషం) ప్రస్తావన ఉంది. ఐతే అది అప్పటికి ఇంకా మచ్చిక కాకపోయివుండాలి.

ముడిలోహాలను కరిగించి వివిధ ఆకారాలలో పోతపోసి ఉపయోగించే కర్మకారులు ఉండేవారు. బంగారం, వెండి, రాగి లోహాల ప్రస్తావన ఉంది. కంచు ప్రస్తావన కూడా ఉంది. ఐతే ఋగ్వేద కాలం నాటికి ఇంకా ఇనుము వాడకం తెలియదనే చెప్పాలి. ఉన్నితో వస్త్రాలు నేయడం గురించిన ప్రస్తావనలున్నాయి కాని నూలు గురించి ఋగ్వేదంలో ఎక్కడా పేర్కొనలేదు. వడ్రంగం ప్రస్తావన ఉంది. ఐతే కుమ్మరివృత్తి గురించి ఎక్కడా పేర్కొనలేదు.

బార్టరు పద్ధతిన వస్తుమార్పిడి ఉండేది. దానితో బాటు బంగారం ఒక మారక సాధనంగా కూడా ఉండేది. బంగారు నాణేలను నిష్కములు అనేవారు. వణిజుడు అని వ్యాపారులను గురించి ప్రస్తావించారు. దీనినుండే హిందీలో బనియా అన్న పదం, బంజారా అన్న పదం పుట్టాయి. బంజారాలు తొలుత సంచార వ్యాపారులు గా ఉండేవారు. సముద్ర ప్రయాణం, సముద్ర మార్గాన వ్యాపారం అన్నవి దాదాపు లేవు. పట్టణాలు అభివృద్ధి చెందలేదు. ఋగ్వేద కాలం ప్రధానంగా గ్రామాలుగా ప్రజలు జీవించిన కాలం.

### సామాజిక, పాలనా వ్యవస్థ


ఆదిమ దశను దాటి వ్యవసాయం, పశు పోషణ ప్రధాన వ్యాపకంగా ఉన్న సమాజం ఋగ్వేద కాలం. పశువుల మందల రూపంలో ప్రధానంగా 'మిగులు'ను చేజిక్కించుకునే వీలుంది. వ్యవసాయంలోని మిగులును నిలవ చేసుకోడానికి కూడా పశువుల మందలు ఒక రూపంగా ఉండేవి. ఈ మిగులును చేజిక్కించుకున్న తరగతులు పాలకులు, పూజారులు. తర్వాత కాలంలో వీళ్ళే క్షత్రియులు, బ్రాహ్మణులుగా రూపాంతరం చెందారు. తక్కిన ప్రజలను విశులు అని ప్రస్తావించారు. ఋగ్వేద సూక్తాలు ప్రధానంగా పూజారులు రచించినవి అవడం చేత వారి సూక్తాలలో మొదటి ప్రాధాన్యత బ్రాహ్మణులకు, ఆ తర్వాత క్షత్రియులకు, ఆ తర్వాత పశు సంపదకు, ప్రజలకు ఇచ్చారు.

సమాజంలో ప్రజలు తెగలుగా విభజించబడివుండేవారు. తెగలను "జన" అని సంబోధించారు. ఋగ్వేదంలో దాదాపు ముప్పై దాకా తెగల పేర్లు ఉన్నాయి. తెగ ఉమ్మడి మూల పురుషుడి పేర పిలవబడేది. ఉదాహరణకు భరత అనే తెగకు భరతుడు మూలపురుషుడు. ఐతే వివాహాలు ఆ తెగలోని ప్రజలమధ్యనే జరిగేవి అనడానికి లేదు. ఋగ్వేద సమాజం పురుషాధిపత్య సమాజం. కుటుంబ పెద్దను గృహపతి అని, భార్యను పత్ని అని, ఇతర భార్యలుంటే వారిని సపత్నులని (ఇదే సవతి అయింది) అన్నారు. ఎక్కువమంది కొడుకులుండడం గొప్పగా భావించేవారు. ఆడపిల్లలకు ఆస్తిలో వాటా లేదు. బాల్య వివాహాలు జరిగిన దాఖలాలు లేవు. భర్తను కోల్పోయిన స్త్రీఅతని సోదరునికి భార్యగా ఉండేది.

తెగకు నాయకుడు రాజు. పెద్ద పెద్ద భవంతులలో రాజులు ఉండేవారు. భారీగా వారు కానుకల రూపంలో బంగారాన్ని, పశువులను, రధాలను కలిగివుండేవారు. వారిదగ్గరనుండి పూజారులు దానాల రూపంలో స్వీకరించేవారు. తెగ నాయకత్వం వంశపారంపర్యంగా కొనసాగేది.

భూభాగంపై ఆధిపత్యం కోసం సాగే యుద్ధాలలో సంపన్నులు రధాలలో ఉండి యుద్ధం చేస్తే సామాన్యులు నేలపై నిలిచి

**"సమాజంలో ప్రజలు తెగలుగా విభజించబడివుండేవారు. తెగలను "జన" అని సంబోధించారు. ఋగ్వేదంలో ముప్పైదాకా తెగల పేర్లు ఉన్నాయి. తెగ ఉమ్మడి మూల పురుషుడి పేర పిలవబడేది. ఉదాహరణకు భరత అనే తెగకు భరతుడు మూలపురుషుడు. ఐతే వివాహాలు ఆ తెగలోని ప్రజలమధ్యనే జరిగేవి అనడానికి లేదు. ఋగ్వేద సమాజం పురుషాధిపత్య సమాజం. కుటుంబ పెద్దను గృహపతి అని, భార్యను పత్ని అని, ఇతర భార్యలుంటే వారిని సపత్నులని (ఇదే సవతి అయింది) అన్నారు."**




పోరాడేవారు. విల్లంబులు, ఈటెలు, కత్తులు ఆయుధాలుగా ఉపయోగించేవారు. గొడ్డలి కూడా ఆయుధంగా ఉపయోగపడేది. కంచుతో చేసిన ఆయుధాల ప్రస్తావన ఉంది కాని వాటిని సంపన్నులు మాత్రమే కలిగివుండేవారు.

యుద్ధాలలో ఓడిన వారినుండి, ప్రజల నుండి రాజులు నిర్బంధంగా వసూలు చేయడానిని 'బలి' అన్నారు. ఇదొక రకమైన పన్ను వంటిది. ధాన్యం, పశువులు, బంగారం రూపాల్లో దీనిని వసూలు చేసేవారు. ఇది కాక యుద్ధాల్లో అవతలి తెగలనుండి కొల్లగొట్టి సంపదను కాజేయడం కూడా ఉండేది. ఇటువంటి దాడుల్లో ప్రధానంగా నష్టపోయేది సామాన్య ప్రజలేనని వేరే చెప్పనవసరం లేదు.

(సశేషం)

విశ్లేషణ

# అమెరికా యుద్ధవ్యూహంలో పావుగా భారత్


రచయిత 'మార్క్సిస్టు' సంపాదకులు

ఎస్. వెంకట్రావు

చైనా దుందుడుకు తనాన్ని ఎదుర్కోవాలంటే అమెరికా పంచన చేరడం మినహా భారత్‌కు మరో మార్గం లేదని మన దేశంలోని కార్పొరేట్ మీడియా ఈమధ్య ప్రతిరోజూ ఊదర గొడుతున్నది. ఈ లక్ష్యంతోనే అమెరికాతో కలిసి మన దేశం సైనిక విన్యాసాలు చేస్తున్నదనీ, అమెరికా నుండి భారీగా ఆయుధాలు, సైనిక సామగ్రి దిగుమతి చేసుకుంటున్నదనీ ప్రచారం చేస్తున్నది. అన్నిటికీ మించి అమెరికాతో మన దేశం కుదుర్చుకున్న సైనిక ఒప్పందాలను సమర్ధించుకోడానికి కూడా చైనాతో మనకున్న సరిహద్దు సమస్యను పెద్దఎత్తున ఉపయోగించుకుంటున్నది.

2017లో డోక్లామ్ వద్ద రెండు దేశాలకు మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనతో ప్రారంభమైన చైనా వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం ఈ ఏడాది జూన్ 15న లడఖ్ వద్ద జరిగిన ఘర్షణలో ఇరువైపులా సైనికులు చనిపోవడంతో మరింత తీవ్రతరమైంది. భారత్–చైనాల మధ్య చరిత్ర వదిలిపెట్టిన సరిహద్దు సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం కుదుర్చుకోవడమే రెండు దేశాల ప్రజలకు ప్రయోజనకరమన్న వాస్తవాన్ని మన పాలక వర్గాలు వెనక్కు నెట్టి చైనాపై వ్యూహాత్మకంగా పైచేయి సాధించాలంటే అమెరికాతో మన దేశం సైనికంగా చేయి కలపాలన్న వాదన ముందుకు తెస్తున్నారు.

లోతుగా పరిశీలిస్తే మన పాలకవర్గాలు చేస్తున్న వాదనలు అమెరికా వ్యూహకర్తల అమ్ముల పొదినుండి వస్తున్నట్లు కనిపిస్తుంది. భారత్–చైనాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తడానికి ముందు నుండే, ఆ ఉద్రిక్తతలతో ఏ మాత్రమూ సంబంధం లేకుండానే మన దేశాన్ని అమెరికా యుద్ధ వ్యూహంలో ఇరికించి చైనాకు వ్యతిరేకంగా నిలిపే ప్రయత్నాలు జరిగుతూ వచ్చాయన్న విషయం మనకు బోధపడుతుంది.

### భారత్‌ను పావుగా మార్చుకోడానికి అమెరికా ప్రయత్నాలు

“2020వ సంవత్సరంలో చైనా ప్రమాదాన్ని ఎదుర్కోడానికి అమెరికా సైన్యానికి సహకరించ గలిగే మిత్రుడు మనకు కావాలి. చైనాను నిలువరించే శక్తిగా భారత్ ఉపయోగపడగలదన్న దాంట్లో మనకు సందేహం అక్కరలేదు”.... పద్దెనిమిదేళ్ల క్రితం, 2002లో అమెరికా రక్షణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఒక అధ్యయన నివేదిక పై విషయం చెప్పింది. “భారత్–అమెరికా సైనిక సంబంధాలు: ఆశలు, అవగాహనలు” అన్న పేరుతో అమెరికా సైనిక వ్యూహకర్తలు రూపొందించిన నివేదిక అది. అంటే 2020 సంవత్సరానికి సంబంధించిన ఈ అంచనాలను 2002లోనే అమెరికా రూపొందించిందన్న మాట. జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే 2020 లక్ష్యాన్ని అమెరికా అనుకున్నట్లే సాధించినట్లు చెప్పవచ్చు. అయితే ఇదంతా ఒక్క రోజులో లేక ఒక్క సంవత్సరంలో జరగలేదు. దీని గురించి ఇంకా లోతుగా అర్థం చేసుకోవాలంటే అమెరికా ఇటీవల రూపొందించిన మరో మూడు వ్యూహపత్రాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. అవి 1. (అమెరికా) జాతీయ భద్రతా వ్యూహం (2017), 2. ఇండో–పసిఫిక్ వ్యూహం నివేదిక: సంసిద్ధత, భాగస్వామ్యాలు, ప్రాంతీయ కూటమి ఏర్పాటు(2019), 3. చైనా ప్రజా రిపబ్లిక్ విషయంలో అమెరికా వ్యూహాత్మక వైఖరి (2020). ఈ మూడు పత్రాల్లోనూ, అంతకు ముందు అమెరికా విడుదల చేసిన అనేక వ్యూహపత్రాల్లోనూ భారత దేశాన్ని తన సామ్రాజ్యవాద యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా ఎలా మార్చుకోవాలో అది చర్చిస్తూ వచ్చింది. దానికి అనుగుణంగానే అది పనిచేస్తూ వచ్చింది. ఫలితం ఏమంటే ఒక నాడు అలీనోద్యమానికి నాయకత్వం వహించిన భారత దేశం క్రమంగా నేడు తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని విడనాడి అమెరికా ఉపగ్రహంగా మారిపోవడానికి సిద్ధమైంది.

భారత్ విషయంలో అమెరికా వ్యూహాత్మక ప్రయత్నాలు ఫలించడానికి రెండు విషయాలు తోడ్పడ్డాయి. మొదటిది, 1990 తరువాత ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనిక మీద జరిగిన మార్పులు. రెండవది, భారత పాలక వర్గాల్లో వచ్చిన మార్పు.

### 1990 తరువాత వచ్చిన మార్పులు

1990లో సోషలిస్ట సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తరువాత సామ్రాజ్యవాదాన్ని ఎదిరించే శక్తులు బలహీనపడిపోయాయి. చైనాతో సహా మిగిలిన సోషలిస్టు దేశాలు, ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్టు పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయి. సోషలిజం, కమ్యూనిజం సిద్ధాంతాలను అప్రదిష్టపాలు చేసేందుకు విషప్రచారం ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో అమెరికన్ సామ్రాజ్యవదుల నాయకత్వంలో ఏర్పడిన ఏకధృవ ప్రపంచాన్ని సుస్థిరం చేసుకోవాలని అమెరికా వ్యూహకర్తలు ప్రణాళికలు రూపొందించారు. ప్రపంచలో ఎక్కడా అమెరికాను సవాలు చేసే శక్తి తలెత్తకుండా చేయాలన్నది ఈ వ్యూహం ముఖ్యోద్దేశం. 1992లో అమెరికా రక్షణ శాఖ “రక్షణ ప్రణాళిక మార్గదర్శకం' అన్న పేరుతో రూపొందించిన వ్యూహపత్రం ఇలా పేర్కొన్నది: “మన మొట్టమొదటి లక్ష్యం మాజీ సోవియట్‌కు చెందిన భూభాగంలోగానీ, మరెక్కడన్నా గానీ అమెరికాకు సోవియట్ వంటి కొత్త ప్రత్యర్థి తలెత్తకుండా చేయడం. కొత్త ప్రాంతీయ రక్షణ వ్యూహపు ప్రధాన కర్తవ్యం అదే. ఇది జరగాలంటే మనం భూగోళం మీద ఎక్కడా కొత్త ప్రాంతీయ శక్తిని ఎదగకుండా చేయాలి.


అలా చేయకపోతే ఈ ప్రాంతీయ శక్తి తరువాత తన వనరులను సమీకరించుకుని ప్రపంచ శక్తిగా ఎదుగుతుంది. పశ్చిమ ఐరోపా, తూర్పు ఆసియా, మాజీ సోవియట్ యూనియన్ ప్రాంతం, నైరుతి ఆసియా ప్రాంతాల్లో ఇటువంటి శక్తి ఎదగకుండా కేంద్రీకరించాలి.”

అయితే అమెరికా లక్ష్యం నెరవేరలేదు. ప్రపంచం 21వ శతాబ్దంలోకి ప్రవేశించడం తోనే అంతర్జాతీయంగా అనేక ప్రాంతాల్లో అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తులు ముందుకు వచ్చాయి. లాటిన్ అమెరికాలోని అనేక దేశాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా వంటి వర్ధమాన దేశాల ప్రాభవం పెరిగింది. అవన్నీ కలిసి బ్రిక్స్ దేశాల కూటమిని ఏర్పాటు చేసుకున్నాయి. చైనా, రష్యా, కొన్ని మధ్య ఆసియా దేశాలతో 'షాంఘై సహకార సంస్థ' ఏర్పడింది. ప్రపంచీకరణ పేరుతో అమలవుతున్న నయా–ఉదారవాద ప్రపంచాన్ని నియంత్రించడం సామ్రాజ్యవాద దేశాల కూటమి అయిన జి7 కు సాధ్యం కాకపోవడంతో బ్రిక్స్ దేశాలతోపాటు మరి కొన్ని దేశాలను కలుపుకుని జి20 ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అయితే 2008 తరువాత సంక్షోభంలో కూరుకుపోయిన నయా–ఉదారవాద ప్రపంచ వ్యవస్థను నిలబెట్టడం దానికి కూడా సాధ్యం కావడం లేదు. ఆ విధంగా ఏకధృవ ప్రపంచం అంతమై క్రమంగా బహుళధృవ ప్రపంచం వైపు ప్రపంచ రాజకీయాలు పయనించాయి. అయితే ఈ పరిణామక్రమాన్ని అమెరికా అంత తేలికగా అంగీకరించలేదు. తన మాట వినని అనేక దేశాల మీద యుద్ధాలు చేసింది. బాల్కన్‌తో ప్రారంభించి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై ప్రత్యక్ష దాడులకు దిగింది. లాటిన్ అమెరికా, ఉత్తరాఫ్రికా–పశ్చిమాసియా, పూర్వపు సోవియట్ రిపబ్లిక్‌లలో అంతర్యుద్ధాలను ప్రోత్సహించి ప్రభుత్వాను మార్చడానికి పూనుకున్నది. అయినా ప్రపంచ గమనం ముందుకేగానీ అమెరికా కోరుకున్నట్లు, బలప్రయోగంతో ప్రయత్నించినట్లు వెనక్కు మళ్లలేదు.

ఈ మొత్తం కాలంలో సోషలిస్టు చైనా అత్యంత బలమైన ఆర్థిక, సాంకేతిక, సైనిక శక్తిగా ముందుకు రావడం, సామ్రాజ్యవాద సంస్థలైన ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, డబ్ల్యుటివోల ప్రజావ్యతిరేక షరతుల చెరలో మగ్గుతున్న అనేక పేద దేశాలకు 'బెల్ట్ అండ్ రోడ్' పథకం ఆధారంగా ఆపన్న హస్తం

> **“మన మొట్టమొదటి లక్ష్యం మాజీ సోవియట్‌కు చెందిన భూభాగంలోగానీ, మరెక్కడన్నా గానీ అమెరికాకు సోవియట్ వంటి కొత్త ప్రత్యర్థి తలెత్తకుండా చేయడం. కొత్త ప్రాంతీయ రక్షణ వ్యూహపు ప్రధాన కర్తవ్యం అదే. ఇది జరగాలంటే మనం భూగోళం మీద ఎక్కడా కొత్త ప్రాంతీయ శక్తిని ఎదగకుండా చేయాలి. అలా చేయకపోతే ఈ ప్రాంతీయ శక్తి తరువాత తన వనరులను సమీకరించుకుని ప్రపంచ శక్తిగా ఎదుగుతుంది...”**

**చైనాకు వ్యతిరేకంగా అమెరికా సైనిక చక్రబంధం**




అందించడం చెప్పుకోదగ్గ పరిణామం. అందువల్ల చైనాను నిలువరించడం అనేది క్రమంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రధాన లక్ష్యంగా మారింది. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది, చైనా.. అమెరికా ఆర్థిక, సాంకేతిక సహకారం తీసుకుని క్రమంగా తన ఆధిపత్యానికే ఎసరుపెట్టే స్థాయికి ఎదుగుతుండడం. రెండవది, ఏ సోషలిజం అయితే అంతమై పోయిందని సామ్రాజ్యవదం ప్రచారం చేసిందో ఆ సోషలిజాన్ని చైనా నిలబెట్టడమే కాకుండా 140 కోట్ల ప్రజలు నివసిస్తున్న భూభాగాన్ని అన్ని విధాలా ఆధునిక సోషలిస్టు దేశంగా అభివృద్ధి పరుస్తూ శరవేగంగా ముందుకు పోవడం. ఈ విషయంలో అమెరికా ఎంతగా ఆందోళన చెందుతున్నదో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి అయిన మైక్ పాంపియో ఇటీవల చేసిన ఒక ప్రకటన మనకు చెబుతుంది: “చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం మార్క్సిస్టు–లెనినిస్టు ప్రభుత్వం అన్న విషయాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి” అని ఈ ఏడాది జులై 23న పాంపియో ఒక ప్రసంగంలో పేర్కొన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ ఆ సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మే వ్యక్తి అని చెబుతూ పెట్టుబడిదారీ దేశాలు (ఆయన దృష్టిలో ప్రజాస్వామ్య దేశాలు) ఏకమై చైనాను నిలువరించాలని చెప్పారు. “మనం ఒక కఠినమైన నిజాన్ని అంగీకరించాలి. రానున్న దశాబ్దాలపాటు ఈ నిజమే మనల్ని నడిపించాలి. అదేమంటే, మనకు స్వేచ్ఛాయుతమైన 21వ శతాబ్దం కావాలిగానీ సి జిన్‌పింగ్ కలలుగంటున్న చైనా శతాబ్దం కాదు. పాత పద్ధతుల్లో చైనాతో కలిసి పనిచేయడం వల్ల మన లక్ష్యం నెరవేరదు” అని పాంపియో చెప్పిన మాటలు పరిశీలిస్తే సోషలిజం పురోగమనం పట్ల సామ్రాజ్యవాదులు ఎంతగా బెంబేలెత్తుతున్నారో అర్థమవుతుంది. ఇటీవలి కాలంలో ట్రంప్, పాంపియో ఇతర అమెరికా నేతలు కమ్యూనిజానికీ, సోషలిజానికీ వ్యతిరేకంగా చేస్తున్న దుష్ప్రచారం కూడా ఈ విషయాన్నే తెలియజేస్తోంది.

### 1960 దశకం నుండే ప్రయత్నాలు

నిజానికి చైనాతో 1960వ దశకంలో అమెరికా సంబంధాలు పెట్టుకోవడం వెనుక కూడా ఆ దేశంలో సోషలిజాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా ఉండింది. ఆ విషయాన్ని అమెరికా నాయకులు ఏనాడూ దాచుకోలేదు కూడా. చైనాతో సంబంధాల పునరుద్ధరించు

**“ అమెరికాతో భారత వ్యూహాత్మక భాగ స్వామ్య ఒప్పందాల చరిత్రను పరిశీలిస్తే చైనా-భారత్ సరిహద్దు ఘర్షణలతో సంబంధం లేకుండానే ఒప్పందాలు, అవగాహనలు కుదిరా యన్న విషయం బోధపడుతుంది. అయితే ఇప్పుడు చైనాతో వచ్చిన సమస్యలను, అమెరికాతో సైనిక భాగస్వామ్యాన్ని సమర్థించుకోడానికి మన ప్రభుత్వం, పాలక వర్గాలు ఉపయోగించుకుంటున్నాయి. ”**

కుంటూ నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ ఈ విధంగా చెప్పాడు: “దీర్ఘకాలిక దృష్టితో చూసినప్పుడు మనం చైనాను ప్రపంచ దేశాల నుండి విడిగా ఉంచడం మంచిది కాదు... చైనా మారనంత కాలం ప్రపంచం క్షేమంగా ఉండదు. అందువల్ల పరిణామాలను మనకు అనుగుణంగా మలుచుకోవడమే మన కర్తవ్యం. (చైనాను) మార్చడమే మన లక్ష్యం.” 50 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటనను గురించి మైక్ పాంపియో ఇటీవల తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ “చైనా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో మౌలిక మార్పులు తేగలమన్న లక్ష్యం తోనే అమెరికా నాడు చైనా ప్రజా రిపబ్లిక్కుతో సంబంధాలు పెట్టుకుంది....40 ఏళ్లకు పైగా సంవత్సరాలు గడిచిన తరువాత చూస్తే చైనాలో ఆర్థిక, రాజకీయ సంస్కరణలను నియంత్రించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సంకల్పాన్ని మనం తక్కువ అంచనా వేశామని అర్థమవుతుంది” అని చెప్పారు. చైనాతో సంబంధాలు పెట్టుకుని దాన్ని సోషలిస్టు మార్గం నుండి తప్పించి పెట్టుబడిదారీ దేశంగా మార్చడం ద్వారా అమెరికా ఆధిపత్యాన్ని నిలుపుకోవాలన్న కలలు నెరవేరలేదన్న దుగ్ధ పాంపియో మాటల్లో కనిపిస్తోంది.

వాస్తవంగానే అమెరికా అనుకున్నదొకటి అయినది మరొకటి అన్నట్లు చైనా ఈ కాలంలో ఆర్థిక, సాంకేతిక రంగాల్లో శీఘ్రగతిన అభివృద్ధి చెందుతూ అమెరికాకు సవాలుగా మారింది. 2020 నాటికి దేశంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించి ఒక మాదిరి అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాల స్థాయికి చైనాను తీసుకుపోవాలన్న లక్ష్యాన్ని పాలక చైనా కమ్యూనిస్టు పార్టీ పరిపూర్తి చేయగలిగింది. ఇక ఇప్పుడు 2025 నాటికి దేశంలోని పరిశ్రమలను పూర్తిగా ఆధునీకరించాలనీ, ప్రపంచ సరఫరా చైన్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనీ 14వ పంచవర్ష ప్రణాళికలో చైనా పార్టీ నిర్దేశించింది. అంతేకాకుండా 1949లో చైనా విముక్తి పొంది



అమెరికా రక్షణ మంత్రి మైక్ పాంపియో

100 ఏళ్లు పూర్తయ్యే నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన ఆధునిక సోషలిస్టు దేశంగా రూపొందించాలని కమ్యూనిస్టు పార్టీ లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా కృషి చేస్తున్నది. చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు వ్యవస్థను బలపరచడం ద్వారా చైనా ఒక ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ ఇటీవల పేర్కొంటూ “పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం తప్పదు, సోషలిజం విజయం సాధించడం తప్పదు” అని పేర్కొన్నారు.

ఆ విధంగా చైనా ఎదగడం అంటే ప్రపంచంలో తన సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సవాలు చేసే శక్తి ఆవిర్భవించడమేనని అమెరికా భావిస్తున్నది. అందువల్లనే చైనాతో ఆర్థిక, వాణిజ్య సంబంధాల ద్వారా దాన్ని నిలువరించలేమని భావించిన అమెరికా ఇప్పుడు దాన్ని అన్ని విధాలా ఒంటరి చేసి ఓడించడానికి వ్యూహం సిద్ధం చేస్తున్నది. అమెరికాలో ఏ ప్రభుత్వం ఉన్నా సామ్రాజ్యవాద ప్రయోజనాలను రక్షించడమే కర్తవ్యంగా పనిచేస్తుంది కాబట్టి ప్రభుత్వాలు మారినా దాని చైనా వ్యతిరేక విధానం మాత్రం మారే అవకాశం లేదు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ట్రంప్ అధికారం కోల్పోయి డెమోక్రటిక్ పార్టీకి చెందిన బైడెన్ అధికారంలోకి వచ్చినా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండదు. నిజానికి బరాక్ ఒబామా నేతృత్వంలో డెమొక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ‘చైనాను నివులవరించే’ (చైనా పైవోట్) వ్యూహాన్ని అమెరికా ఖరారు చేసింది. ఈ వ్యూహంలో భారత దేశాన్ని క్రమంగా ఇరికిస్తూ వచ్చింది.

**భారత పాలక వర్గాల వైఖరిలో మార్పు**

1990వ దశకం ప్రారంభంలో సోవియట్ విచ్ఛిన్నమై, సోషలిజానికి ఎదురుదెబ్బ తగలడం, అమెరికా నాయకత్వంలో ఏకధ్రువ ప్రపంచం ఏర్పడ్డంతో భారత పాలక వర్గాల వైఖరిలో కూడా మార్పు వచ్చింది. అప్పటివరకు రాజ్యం ఆధ్వర్యంలో జరిగిన పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణాన్ని వదిలిపెట్టి నయా-ఉదారవాద ప్రపంచీకరణ విధానాలను చేపట్టాయి. దాంతోపాటే దేశంలో మితవాద హిందూత్వ శక్తులు పెరుగుతూ వచ్చాయి. ఈ పూర్వ రంగంలో భారత పాలక వర్గాలు తమ ప్రయోజనాలు నెరవేర్చుకోడానికి అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పరచుకోవడం అవసరమని భావించాయి. ఆ విధంగా అవి అమెరికాతో ఆర్థిక, సైనిక, వ్యూహాత్మక రంగాల్లో గాఢమైన సంబంధాలు పెట్టుకోడానికి సిద్ధపడ్డాయి. పివి నరసింహారావు ప్రభుత్వం దగ్గరినుండి వచ్చిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలన్నీ అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం అనే పాలక వర్గాల విధానాన్నే అనుసరిస్తూ వచ్చాయి. వీటిలో కూడా బిజెపి అధికారంలో ఉన్నప్పుడు అమెరికా ప్రయోజనాలు నెరవేర్చడానికి మరింత మొగ్గుచూపుతూ వచ్చింది. నరేంద్ర మోడీ హయాంలో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత పరాకాష్టకు చేరుకున్నది.

అమెరికాతో భారత సైనిక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మన దేశంలోని బడా బూర్జువా వర్గం, సైనిక వ్యూహకర్తలూ, కార్పొరేట్ మీడియా, ఇతర ఉన్నత వర్గాలు నేడు సంతోషంగా ఆహ్వానిస్తున్నాయి. గతంలో మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కోరుకున్న వర్గాలు ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంపై కొంత వ్యతిరేకంగా ఉండేవి. కానీ నేడు చైనాతో ప్రతిష్టంభన ఏర్పడిన తరువాత అవి కూడా మరోదారిలేక మోడీ విధానాలకు తలొగ్గు

తున్నాయి.

**చైనాతో ఘర్షణకు ముందే సైనిక ఒప్పందాలు**

అమెరికాతో భారత వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాల చరిత్రను పరిశీలిస్తే చైనా–భారత్ సరిహద్దు ఘర్షణలతో సంబంధం లేకుండానే ఒప్పందాలు, అవగాహనలు కుదిరాయన్న విషయం బోధపడుతుంది. అయితే ఇప్పుడు చైనాతో వచ్చిన సమస్యలను, అమెరికాతో సైనిక భాగస్వామ్యాన్ని సమర్థించుకోడానికి మన ప్రభుత్వం, పాలక వర్గాలు ఉపయోగించుకుంటున్నాయి.

అమెరికాతో మన దేశాన్ని సైనికంగా బంధించే నాలుగు ఒప్పందాలు బిజెపి ప్రభుత్వాల హయాంలోనేకుదిరాయి. ఒకటి, వాజ్‌పేయి ప్రభుత్వ హయాలంలో మూడు నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో కుదిరాయి. వాటిలో మొదటిది, 'జనరల్ సెక్యూరిటీ ఆఫ్ మిలటరీ ఇన్ఫర్మేషన్ అగ్రిమెంట్' (గ్సోమియా)పై 2002లో వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో సంతకాలు జరిగాయి. రెండో ఒప్పందం 'లాజిస్టిక్స్ ఎక్సేంజ్ మెమోరాండం అగ్రిమెంట్ (లెమోవా)' చైనాతో డోక్లామ్ ప్రతిష్టంభనకు ముందే కుదిరింది. డోక్లామ్ ప్రతిష్టంభన 2017లో జరిగింది కానీ భారత–అమెరికాల మధ్య లెమోవా ఒప్పందంపై 2016లోనే సంతకాలు జరిగాయి. ఆ తరువాత 'కమ్యూనికేషన్స్ కంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్ (కోమ్‌కాసా)' 2018లో జరిగింది. అమెరికాతో భారత సైనిక భాగస్వామ్యానికి పై మూడు ఒప్పందాలు పునాది వేయగా వాటిపైన పూర్తిస్థాయి సైనిక భాగస్వామ్యాన్ని కల్పించే 'బేసిక్ ఎక్సేంజ్ అండ్ కో–ఆపరేషన్ అగ్రిమెంట్ (బెకా)పై సంతకాలు చైనాతో సైనికఘర్షణలు జరిగిన తరువాత జరిగాయి. కానీ వాస్తవానికి ఈ ఒప్పందానికీ చైనాతో సరిహద్దు ఘర్షణలకు కూడా సంబంధం లేదు. ఎందుకంటే ఈ ఒప్పందం 2020లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దేశ పర్యటనకు వచ్చేనాటికే ఖరారై ఉంది. "బెకాతో సహా సైనిక సహకార ఒప్పందా లన్నిటినీ అనుకున్న దానికన్నా ముందుగానే పూర్తిచేయడానికి (ఇరుదేశాల) నాయకులు ఎదురుచూస్తున్నారు" అని ట్రంప్, మోడీ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ మొత్తం చరిత్రను పరిశీలిస్తే భారత పాలకులు అమెరికా యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వాములుగా మారడానికి సిద్ధపడిన తరువాత చైనాతో సరిహద్దు ప్రతిష్టంభనలు ఏర్పడ్డాయే గానీ ఇంకో విధంగా జరగలేదని అర్థమవుతుంది. నిజానికి 2005లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న 'రక్షణ ఒప్పందాల చట్రం' ఆధారంగానే తరువాతి కాలంలో అమెరికాతో సైనిక ఒప్పందాలన్నీ కుదిరాయి. నాటి రక్షణమంత్రి ప్రణబ్ ముఖర్జీ అమెరికా వెళ్లి వచ్చాక ఈ 'రక్షణ ఒప్పందాల చట్రం' రూపొందించబడింది. పదేళ్ల పాటు ఉండే ఈ ఒప్పందాన్ని 2015లో నరేంద్ర మోడీ ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ చట్రం కింద అమెరికాతో సైనికంగా జతకట్టినందుకు ప్రతిఫలంగా భారత్–అమెరికా పౌర అణు ఒప్పందం కుదిరింది.

> అమెరికా యుద్ధ వ్యూహంలో చిక్కుకోవడం అంటే మన దేశ రక్షణ వ్యవస్థలపై అమెరికా అదుపు సాధించడమే. మన దేశం ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల మన రక్షణ రంగం ఆనుపానులన్నిటినీ అమెరికా చేజిక్కించుకునే అవకాశం ఏర్పడుతోంది. మన రక్షణ వ్యవస్థలన్నిటినీ అమెరికా భవిష్యత్ యుద్ధాల్లో వినియోగించుకోడానికి తెరిచి ఉంచాల్సి వస్తుంది.



అమెరికా ప్రజలతో సహా ప్రపంచమంతా ఏవగించుకున్న డొనాల్డ్ ట్రంప్‌ను నరేంద్ర మోడీ ఒక్కరే కౌగలించుకున్నారు

ఆర్ఎస్ఎస్–బిజెపిలు సామ్రాజ్యవాదుల సేవలో సదా ముందుంటాయని నాటి స్వాతంత్ర పోరాటం నుండి నేటి వరకు రుజువవుతూనే ఉంది. అమెరికాతో ప్రధానమైన సైనిక భాగస్వామ్య ఒప్పందాలన్నీ బిజెపి ప్రభుత్వాల హయాంలోనే కుదిరాయన్న విషయం దీన్ని మరింత బలపరుస్తోంది. వీటితోపాటు 2015లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత్ సందర్శించినప్పుడు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆయనతో కలిసి "ఆసియా పసిఫిక్, హిందూమహా సముంద్ర సంయుక్త విజన్' ఒప్పందంపై సంతకాలు చేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక అమెరికాకు చెందిన ఇండో–పసిఫిక్ వ్యూహంలో భారత దేశం పూర్తి భాగస్వామిగా మారింది. అలాగే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌లతో కూడిన 'క్వాడ్' కూటమిని పూర్తిస్థాయి సైనిక కూటమిగా మెరుగుపరిచారు. ఈ కూటమిని ఆసియా – పసిఫిక్‌లో అమెరికా నాయకత్వంలోని 'నాటో' కూటమిగా పేర్కొంటున్నారు.

**భారత ప్రజల ప్రయోజనాలకు నష్టం**

భారత్–చైనాల మధ్య చరిత్ర ఒదిలిపెట్టిన సరిహద్దు సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనీ, ఈ లోగా రెండు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, స్నేహ, సహకార సంబంధాలను పెంపొందించుకోవాలనీ రెండు దేశాలూ 1980వ దశకంలో తీసుకున్న నిర్ణయం

> **"అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాక భారత దేశం విదేశీ విధానంలో స్వతంత్రత కోల్పోతోంది. ఇరాన్ విషయంలో గానీ, ఇతర దేశాలతోగానీ మన సంబంధాలు అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయించబడుతున్నాయి. అమెరికాతో అణుఒప్పందాన్ని కుదుర్చుకున్నందున మన దేశం ఇరాన్ నుండి చౌకగా లభించే సహజ వాయువును, ఇరాన్‌తో కుదుర్చుకున్న అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ఒదులుకోవాల్సివచ్చింది."**

వల్ల ఇరు దేశాల ప్రజలకు ఎంతో మేలు జరిగింది. రెండు దేశాల మధ్య వాణిజ్యం 300 కోట్ల డాలర్ల నుండి దాదాపు 10,000 కోట్ల డాలర్లకు పెరిగింది. 1000కి పైగా చైనా కంపెనీలు భారత దేశంలో పారిశ్రామిక పార్కులు, ఇ-కామర్స్, ఇతర రంగాల్లో 800 కోట్ల డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టగా భారత కంపెనీలు చైనాలో 100 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయి. ప్రపంచ జనాభాలో మూడో వంతుకుపైగా, ప్రపంచ జిడిపిలో 20 శాతం పైగా ఉన్న రెండు ఇరుగు పొరుగు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడితే రెండు దేశాల ప్రజలూ లాభం పొందుతారు. కానీ తన సైనిక వ్యూహంలో భారత దేశాన్ని పావుగా వాడుకోదలుచుకున్న అమెరికా ఈ రెండు దేశాల మధ్య సంబంధాల వృద్ధికి అడ్డుగా నిలుస్తోంది.

అమెరికా యుద్ధ వ్యూహంలో చిక్కుకోవడం అంటే మన దేశ రక్షణ వ్యవస్థలపై అమెరికా అదుపు సాధించడమే. మన దేశం ఇటీవల అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల మన రక్షణ రంగం ఆనుపానులన్నిటినీ అమెరికా చేజిక్కించుకునే అవకాశం ఏర్పడుతోంది. మన రక్షణ వ్యవస్థలన్నిటినీ అమెరికా భవిష్యత్ యుద్ధాల్లో వినియోగించుకోడానికి తెరిచి ఉంచాల్సి వస్తుంది. ఉదాహరణకు 'లెమోవా' ఒప్పందం ప్రకారం అమెరికా, భారత సైన్యం ఒకదాని స్థావరాలను, సరఫరాలను, సేవలను మరొకటి ఉపయోగించుకుంటాయి. కానీ ఆచరణలో అమెరికా సైనిక దళాలకు భారత స్థావరాలు అవసరమవుతాయిగానీ, భారత్ అమెరికా స్థావరాలను ఉపయోగించుకునే అవకాశం చాలా తక్కువ. ఈ ఒప్పందం కింద మన దేశ నౌకలు అమెరికా నౌకలకు సరఫరాలు అందిస్తున్నాయి. అండమాన్ దీవుల్లోని మన స్థావరాల్లో అమెరికా యుద్ధ విమానాలు ఇంధనం నింపుకుని వెళుతున్నాయి.

**అమెరికా ఆయుధ కొనుగోలుదారుగా భారత్**

అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల మన దేశం ఆ దేశానికి పెద్ద ఆయుధ కొనుగోలు దారుగా మారిపోతున్నది. చైనాతో సరిహద్దు సమస్యలను ఉపయోగించుకుని అమెరికా మన దేశానికి అత్యంత ఆధునిక ఆయుధాలు పంపుతున్నది. చైనాకు ధీటుగా ఇటువంటి ఆయుధాలు సంపాదిస్తున్నందుకు మోడీ ప్రభుత్వాన్ని కార్పొరేట్ మీడియా ఆకాశానికి ఎత్తుతున్నది. కానీ దీనివల్ల మన రక్షణ వ్యవస్థ అమెరికా చేతిలో బంధీ అవుతుందన్న నిపుణుల హెచ్చరికలను అవి పట్టించుకోవడం లేదు. ఉదాహరణకు ఇటీవలి వరకు మన దేశం ప్రధానంగా రష్యా, ఇతర యూరప్ దేశాల నుండి ఆయుధాలు దిగుమతి చేసుకునేది. కానీ ఇప్పుడు అమెరికా నుండి ఆయుధాల దిగుమతులు 1800 కోట్ల డాలర్లకు (సుమారు 1.26 లక్షల కోట్ల డాలర్లకు) పెరిగాయి. ఇప్పుడు ఇతర దేశాల నుండి ముఖ్యంగా రష్యా నుండి మన ఆయుధాల దిగుమతులకు అమెరికా అడ్డుచెప్పే పరిస్థితులుఏర్పడ్డాయి. అమెరికానుండి దిగుమతి చేసుకునే ఆధునిక ఆయుధాలకు అమెరికా నుండే విడి బాగాలు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. గనుక మన రక్షణ వ్యవస్థలు భవిష్యత్తులో అమెరికా చెప్పుచేతుల్లోకి పోయే ప్రమాదం, దాని వల్ల ఇప్పటివరకు మిత్రులుగా ఉన్న రష్యా వంటి దేశాలతో సంబంధాలు మరింత దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**స్వతంత్ర విదేశాంగ విధానానికి తిలోదకాలు**

అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నాక భారత దేశం విదేశీ విధానంలో స్వతంత్రత కోల్పోతోంది. ఇరాన్ విషయంలో గానీ, ఇతర దేశాలతోగానీ మన సంబంధాలు అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయించబడుతున్నాయి. అమెరికాతో అణుఒప్పందాన్ని కుదుర్చు కున్నందున మన దేశం ఇరాన్ నుండి చౌకగా లభించే సహజవాయువును, ఇరాన్‌తో కుదుర్చుకున్న అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ఒదులుకో వాల్సివచ్చింది. మన విదేశీ విధానం అమెరికా - భారత్ వ్యూహాత్మక చట్రంలో బంధీగా మారిపోవడం వల్ల మన ఇరుగుపొరుగు దేశాలతో కూడా మన సంబంధాలు దెబ్బతింటున్నాయి. భవిష్యత్తులో మరింతగా దెబ్బతినే అవకాశం ఉంది. సంబంధాలు మెరుగుపచురుకోవాలన్నా అమెరికాతో ఒప్పందాలు అడ్డంకిగా మారుతాయి.

మొత్తం మీద చూసినప్పుడు పొరుగు దేశమైన చైనాతో వచ్చిన సమస్యల వల్ల మన దేశం అమెరికా యుద్ధ వ్యూహంలోకి వెళ్లాల్సి వస్తోందని పాలక వర్గాలు చేస్తున్న ప్రచారం తప్పు. అమెరికా యుద్ధ వ్యూహంలోకి మన దేశాన్ని నడిపించడానికి సిద్ధపడ్డ పాలక వర్గాలు ఆ విధానాలను సమర్థించుకోడానికి ఇరుగు పొరుగులతో వచ్చే సమస్యలను ఉపయోగించు కుంటున్నాయి. మనపూర్వీకులు అశేష త్యాగాలతో సంపాదించుకున్న స్వాతంత్ర్యాన్ని తిరిగి సామ్రాజ్యవాదుల ముందు తాకట్టుపెట్టే విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది. ❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం, డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# సంక్షోభాన్ని తీవ్రంచేసే విద్యుత్ బిల్లు





**తేజ్‌పాల్ కనిట్కర్, సుధా మహాలింగం, ఆర్.శ్రీకాంత్**

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, బెంగళూరు**

విద్యుత్ రంగంలో ప్రతిపాదించిన విద్యుత్ (సవరణ) బిల్లు 2020 సబ్సిడీలను తగ్గించి ప్రత్యేకించి పంపిణీ రంగంలో ప్రైవేటీకరణకు బాటలు వేస్తున్నది. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన సమయంలో ఆర్థిక ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకోకుండా ఈ కీలక రంగంలో నిర్మాణాత్మక మార్పులు చేపట్టింది. ప్రతిపాదించిన సవరణలు ప్రజావ్యతిరేకమైనవే కాక, ఈ రంగంలోని దీర్ఘకాలిక సంక్షోభాన్ని తగ్గించకపోగా మరింతగా పెంచడానికి కారణమవుతాయి. కేంద్ర ప్రభుత్వం ఈ సవరణలను నిలిపివేసి మరింత శాస్త్రీయ పద్ధతితో ఆలోచించి విద్యుత్ రంగంలో సవరణలు తీసుకు రావాల్సి ఉంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న విద్యుత్ (సవరణ) బిల్లు 2020 పార్లమెంటులో ఆమోదించటం కోసం 2014 నుంచి ప్రయత్నం జరుగుతూనే ఉంది. ఈ బిల్లుకు సంబంధించి విభిన్న అంశాలను 2014 నుంచి ప్రచారం పెట్టారు. తాజాగా కోవిడ్-19 ప్రబలి ఆర్థిక కుంగుబాటుతో సతమతమవుతూ, జాతీయ స్థాయిలో లాక్‌డౌన్ విధించిన సమయంలో తాజాగా మళ్ళీ ప్రచారంలో పెట్టారు. సబ్సిడీలను తగ్గించి విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడం, ప్రత్యేకించి సరఫరా రంగాన్ని ప్రైవేటు పరం చేయడంఈ బిల్లు మూల ఉద్దేశం. ఉద్యోగాలు, వేతనాలు, ఉత్పాదక సామర్థ్యం తగ్గి, ఆర్థికరంగంలో డిమాండ్, సరఫరా సమస్యలను పరిష్కరించటం ప్రధానాంశాలుగా ఉన్న సమయంలో ఈ చర్యలకు పాల్పడుతున్నారు. కీలకమైన విద్యుత్ రంగంలో వ్యవస్థాగత సంస్కరణలను చేపట్టడం ద్వారా కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మరిన్ని మార్పులకు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీసే చర్యను ఇపుడు తీసుకోవటం ఏ తర్కానికీ అందటం లేదు.

**విద్యుత్ రంగ సంస్కరణల చరిత్ర**

విద్యుత్ రంగంలో 1991 నుంచి అమలవుతున్న వ్యవస్థాగత సంస్కరణలను క్రోడీకరించి 2003లో నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్.డి.ఎ) ప్రభుత్వం విద్యుత్ చట్టాన్ని తీసుకువచ్చింది. గతంలో విద్యుత్ రంగంలో మౌలిక సదుపాయాలు, వాటి విస్తరణ రాష్ట్ర విద్యుత్ బోర్డుల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ అంగాలుగా పనిచేసేవి. కనుక వాటి ఎదుగుదల, బరువు బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలు చూసేవి. బోర్డుల రూపురేఖలు, విధానపరమైన అంశాలపై తగిన బాధ్యత వహిస్తూ రాష్ట్రాల మధ్య సహజ వనరుల పంపిణీ బాధ్యతను కేంద్రం చూసేది. 1990లలో వచ్చిన వ్యవస్థాగత మార్పుల కారణంగా విద్యుత్ బోర్డులు "విడివడిపోయి" ఉత్పత్తి, సరఫరా, పంపిణీ కంపెనీలుగా రూపాంతరం చెందాయి. విద్యుదుత్పత్తి రంగంలో ప్రైవేటీకరణను ప్రోత్సహించేందుకు వీలుగా అనుమతులిచ్చారు. విద్యుత్ పంపిణీ రంగంలో కూడా ప్రైవేటు కంపెనీలకు ప్రవేశం కల్పించారు.

ప్రభుత్వ విధానాల వలన గ్యారంటీగా లాభాలు వస్తాయని విద్యుదుత్పత్తి రంగంలో కొన్ని ప్రైవేటు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ విధానా లలోని లోపాల కారణంగా నిరర్థక ఆస్తులు తలనొప్పిగా పరిణమించాయి. దాంతో మార్కెట్‌పై ఆధారపడటం నుండి వెనుతిరిగి ప్రణాళికా బద్ధమైన అభివృద్ధిని గురించి పునరాలోచన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై చర్చించే ముందు 2003 విద్యుత్ చట్ట సవరణలోని మూడు ప్రధాన అంశాల గురించి చర్చించాల్సి ఉంది. మొట్టమొదటగా విద్యుత్ పంపిణీలో మరింతగా ప్రైవేటీకరణను ప్రోత్సహించి సబ్‌లైసెన్సులు, ఫ్రాంచైజ్‌లు ప్రవేశపెట్టడాన్ని గురించి చర్చించాలి. రెండో అంశం క్రాస్ సబ్సిడీలను తొలగించి, వాటిస్థానంలో ప్రత్యక్షంగా నగదు బదిలీ చేసే మార్పుల గురించి చర్చించాలి. మూడో అంశం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్ రంగం మొత్తాన్ని కేంద్రీకృతం చేసి రాజ్యాంగంలోని మూలసూత్రాలకు భిన్నంగా వ్యవహరించే ధోరణిపై చర్చించాలి.

**డిస్కాంలపై ఆర్థిక వత్తిడి ఎందుకు?**

కొత్త బిల్లులోని ప్రధాన ప్రతిపాదనల్లో ఒకటి ఒక ప్రాంత పరిధిలో విద్యుత్ పంపిణీకి లైసెన్సు "సబ్-లైసెన్సుల జారీ" లేదా ఫ్రాంచైజీల ద్వారా విద్యుత్ పంపిణీ (ఎక్కువ సందర్భాలలో ప్రస్తుతం రాష్ట్ర యాజమాన్యంలోని డిస్కంల పరిధిలో) చేయటం. ఈ పంపిణీ నమూనా చాలా పాతది. గతంలో వివిధ ప్రాంతాలలో ప్రయత్నించి చూసింది. వాటి వల్ల మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఈ ప్రతిపాదిత సబ్-లైసెన్సు నమూనాలో ఎలాంటి కొత్తదనం లేకపోగా డిస్కంల పరిధిలో అధిక లాభాలు వచ్చే క్లస్టర్లు సబ్-లైసెన్సుల ద్వారా ఇతరులకు అప్పగించడమవుతుంది. వేరే విధంగా చెప్పాలంటే పంపిణీ వ్యాపారంలో ఎంపిక చేసిన సెగ్మెంట్లలో మార్కెట్లను ప్రవేశపెట్టడమే. ఇప్పటికి చాలా యేళ్ళుగా నయా ఉదారవాద తెలివితేటలతో సాగిస్తున్న ప్రచారం వాస్తవ విద్యుత్ సరఫరాను వైర్ల వ్యాపారంతో వేరు చేయడం. ఈ నమూనాలో డిస్కంల పని వైర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణకు పరిమితం చేసి విద్యుత్ సరఫరాను విడిగా ఉండే సరఫరాదారులు నిర్వహిస్తారు (ప్రైవేటు ఆధ్వర్యంలో సాగుతుంది). 2014లో ప్రపంచ బ్యాంకు తన నివేదికలో ఈ అంశాలను ప్రతిపాదిస్తే విద్యుత్ విధానంపై పనిచేస్తున్న అనేక స్వతంత్ర సంస్థలు ఎలాంటి ఆలోచన లేకుండా సమర్థించాయి. పలు రాష్ట్రాలు, డిస్కంల నుంచి వ్యక్తమైన వ్యతిరేకత కేవలం ఆ ప్రతిపాదనలో పదాల మార్పు మినహా మౌలికంగా ఎలాంటి మార్పూ చేయలేదు.

కేంద్ర ప్రభుత్వం రెండు అంశాల ఆధారంగా ప్రైవేటు లైసెన్సులు ఇచ్చేందుకు ప్రతిపాదించినట్టు కనిపిస్తున్నది. మొదటిది ప్రస్తుతం డిస్కంలు అనుసరిస్తున్న విధానాల కారణంగా చాలా ఎక్కువ అవుతున్న విద్యుత్

> **“ ప్రభుత్వ అంచనాల ప్రకారం విద్యుత్ రంగ వృద్ధి ఊహించిన దానికంటే నెమ్మదిగా ఉంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) ప్రచురించిన 19వ ఎలక్ట్రికల్ పవర్ సర్వే లో సవరించిన డిమాండ్ అంచనాలు మునుపటి అంచనాల కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ఎక్కువగా దీర్ఘకాలిక పిపిఎలకు బదులుగా విద్యుత్ మార్కెట్లలో గాలివాటు ఆదాయాలు వస్తాయని బ్యాంకులలో రుణాలు తీసుకున్న విద్యుత్ ఉత్పత్తిదారులు తమ అప్పులను తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ”**

సేకరణ వ్యయం ఈ పద్ధతి వల్ల తగ్గుతుంది. రెండో అంశం నిర్వహణ వ్యయం తగ్గుతుంది. మొదటి అంశం అంచనాకు సంబంధించి రాష్ట్రాల యాజమాన్యంలోని డిస్కంలు ప్రస్తుతం తాము అనుసరిస్తున్న అశాస్త్రీయమైన నిర్వహణ పద్ధతుల కారణంగా తీవ్రమైన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా విద్యుత్ సేకరణ వ్యయం చాలా ఎక్కువ అవుతున్నది. అందువల్ల ప్రభుత్వం పంపిణీకి సబ్ లైసెన్సులు ప్రవేశపెట్టడం వల్ల వ్యయ భారాన్ని తగ్గించు కోవచ్చు. ఫలితంగా సమర్థతను కూడా పెంచవచ్చు. ఈ సమస్యకు ఇలాంటి పరిష్కారం సూచించినందున మూడు కారణాలను చర్చించాల్సి వచ్చింది.

**తప్పుడు లెక్కలతో అంచనాలు**

ప్రస్తుతం డిస్కంలు విద్యుత్ సేకరణకు దీర్ఘకాల విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పిపిఎలు) పద్ధతిని అనుసరిస్తున్నాయి. బొగ్గు ఆధారిత ప్లాంట్ల విషయంలో యూనిట్ ప్రాతిపదికన రెగ్యులేటర్ అమోదించిన మేరకు ధర నిర్ణయం జరుగుతుంది (అది దీర్ఘకాలమైనా లేదా స్వల్పకాలమైనా). షెడ్యూలు ప్రకారం ఫిక్సెడ్ ఛార్జీలు చెల్లిస్తాయి. గత కొన్నేళ్లుగా బొగ్గు ధరల్లో చెప్పుకోదగ్గ పెరుగుదల కనిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోని ప్రభుత్వరంగ విభాగాల్లో దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం బొగ్గులో 94 శాతం ఉత్పత్తి అవుతున్నది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛమైన శక్తి పేరిట బొగ్గు సెస్ (కార్బన్ పన్నుగా చెప్పవచ్చు) విధిస్తున్నది. 2010 జూన్‌లో దేశంలోని అన్ని బొగ్గు గనులు/ దిగుమతి చేసుకునే బొగ్గుపై టన్నుకు 50 రూపాయల పన్ను విధిస్తే మూడుసార్లలో అది రెట్టింపు కాగా, ఆ ధర 2016 మార్చి 1 నాటికి టన్నుకు 400కు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఈ పన్ను కారణంగా విద్యుత్ చట్టం (సిఈఆర్‌సి-2018) కింద పిపిఎలలో చేరుతున్న కేంద్ర విద్యుత్ ఉత్పత్తిదారులకు “మారిన చట్టాన్ని” అమలుచేయాల్సి ఉంటుందని కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఈఆర్‌సి) స్పష్టం చేసింది. అందువల్ల అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు తదనుగుణంగా తమ టారిఫ్‌లను పెంచడంతో ఆ భారం వినియోగదారులపై పడింది. వీటికి తోడుగా బొగ్గు రవాణాకు అయ్యే ఖర్చులు కూడా పెరగడంతో ధరల్లో వ్యత్యాసం బాగా పెరిగింది. 2009-10 నుంచి 2016-17 మధ్యకాలంలో సగటు బొగ్గు (పన్నులు, సెస్‌లతో కలిపి) రవాణా ఖర్చు, పన్నులు, రవాణాపై డ్యూటీ మూడు రెట్లు, నిర్దిష్టంగా 82, 60, 340 శాతం చొప్పున పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం, (కోల్ ఇండియా, ఇండియన్ రైల్వేలు), ఆర్థిక మంత్రిత్వ శాఖలు బొగ్గును, విద్యుత్ రంగాన్ని బంగారు గుడ్లు పెట్టే బాతులా చూడడమే ఈ విపరీతమైన పెరుగుదలకు ప్రధాన కారణం. ఈ అన్ని రకాల ధరల పెరుగుదలను డిస్కంల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న పరిమితులతో (రెగ్యులేటర్ ద్వారా) తుదిగా వినియోగదారుని టారిఫ్ నిర్ణయమవుతుంది.

థర్మల్ విద్యుత్ ఉత్పాదన ధరల పెరగడంతో పాటు నిర్ణీత ధరల(ఫిక్స్‌కాస్ట్స్)తో డిస్కంలు నేడు ఇబ్బంది పడుతున్నాయి. కొత్తగా 92 జిడబ్ల్యు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గత ఐదు సంవత్సరాలుగా విద్యుత్ రంగానికి జోడించడం జరిగింది (సిఈఎ 2020). కొత్తగా పెట్టిన ప్లాంట్లకు ఫిక్స్‌కాస్ట్స్ పాతవాటితో పోలిస్తే ఎక్కువే కాక వీటి కోసం చేసిన రుణం తిరిగి చెల్లించాల్సి ఉంది. ఈ కొత్త థర్మల్ ప్లాంట్ల స్థాపన జరిగే సమయానికి గ్రిడ్‌కు పునర్వినియోగ విద్యుత్ (ఆర్ఈ) సరఫరా పెరగడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ లక్ష్యాల కారణంగా ఆర్ఈ వనరుల అవసరాలు సరఫరా వ్యత్యాసంలో తేడా కూడా ఇబ్బందికి కారణమైంది. దీనిపై అనంతరం చర్చిద్దాం.

కోవిడ్-19 మహమ్మారి భారతీయ తీరాలకు రాకముందే మొత్తం ఆర్థికాభివృద్ధి, డిమాండ్ మందగించే వాతావరణంలో కొత్త తరం సాంకేతికత వచ్చిందని నొక్కి చెప్పడం ముఖ్యం. ప్రభుత్వ అంచనాల ప్రకారం విద్యుత్ రంగ వృద్ధి ఊహించిన దానికంటే నెమ్మదిగా ఉంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సిఇఎ) ప్రచురించిన 19 వ ఎలక్ట్రికల్ పవర్ సర్వే (ఇపిఎస్) లో సవరించిన డిమాండ్ అంచనాలు 18 వ ఇపిఎస్ (సిఇఎ 2019, 2020) నుండి మునుపటి అంచనాల కంటే చాలా తక్కువగా ఉన్నాయి. ఎక్కువగా దీర్ఘకాలిక పిపిఎలకు బదులుగా విద్యుత్ మార్కెట్లలో గాలివాటు ఆదాయాలు వస్తాయని బ్యాంకులలో రుణాలు తీసుకున్న విద్యుత్ ఉత్పత్తిదారులు(స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులు లేదా ఐపిపిలు), తమ అప్పులను తిరిగి చెల్లించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊహించిన విధంగా డిమాండ్ పెరుగుదల లేకపోయినప్పటికీ - వాటిలో కొన్నింటి నుండి చాలా తక్కువ విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారు - విద్యుత్ ప్లాంట్లకు (వారు పిపిఎలతో సంతకం చేసిన వాటికి) స్థిర ఛార్జీలు చెల్లించాల్సి రావటంతో డిస్కంలు సమస్యలలో కూరుకుపోయాయి. తప్పుడు డిమాండ్ అంచనాలతో సిఇఎ విద్యుత్ అవసరాలను పెంచి చూపటం, ఐపిపిలు, పిపిఎలు లేకుండానే గాలివాటు లాభాల కోసం తమ విద్యుత్‌ను మార్కెట్లలో అమ్మడం కోసం సిద్ధమైన ఐపిపిలు ఇందుకు కారణం. దీనికి డిస్కంలను నిందించటం సరికాదు. కాని ఈ తప్పుడు విధానాలకు కారణాలను డిస్కంలపై నెట్టివేస్తూ, ప్రస్తుత సవరణలతో వారిని మరింత శిక్షించటం అన్యాయం.

విద్యుత్ డిమాండ్‌ను ఖచ్చితంగా అంచనా వేయలేకపోవడానికి డిస్కంలు బాధ్యత వహించాల్సివస్తే, 7 శాతం జిడిపి వృద్ధిని అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం, విద్యుత్ డిమాండ్‌ను ఎక్కువగా అంచనా వేసి సిఇఎ, విద్యుత్ మార్కెట్లలో గాలివాటు లాభాల కోసం ఐపిపిలు, కేంద్ర నియంత్రణలో ఉన్న విద్యుత్ ఫైనాన్స్ సంస్థలు, పిపిఎల హామీ లేకుండా ఐపిపిలకు రుణాలు ఇచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రధాన నిందితులు. కాని వారి తప్పులకు రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలోని డిస్కంలను బలిపశువులుగా చేస్తున్నారు.

**‘తప్పక కొనాల్సిన’ పునరుత్పాదక విద్యుత్**

తప్పుగా లెక్కించిన డిమాండ్ పెరుగుదల సమస్యలలో ఒకటి మాత్రమే. మరో ముఖ్య కారణం ఏమిటంటే గత కొన్నేళ్లుగా గ్రిడ్‌లోకి సౌర విద్యుత్ రాక గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదల కొత్తగా స్థాపించిన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యాన్ని

> తప్పుగా లెక్కించిన డిమాండ్ పెరుగుదల సమస్యలలో ఒకటి మాత్రమే. మరో ముఖ్య కారణం ఏమిటంటే గత కొన్నేళ్లుగా గ్రిడ్‌లోకి సౌర విద్యుత్ రాక గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదల కొత్తగా స్థాపించిన థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని, కేంద్రం నిర్ణయించు కున్న ఆర్ఈ లక్ష్యాల పరుగు ఆధారంగానే తప్ప, శాస్త్రీయమైన అధ్యయనం చేసి ఎంత విద్యుత్ అవసరమవుతుందన్న ప్రాతిపదికపై మాత్రం కాదు.

పరిగణనలోకి తీసుకుని, కేంద్రం నిర్ణయించుకున్న ఆర్ఈ లక్ష్యాల పరుగు ఆధారంగానే తప్ప, శాస్త్రీయమైన అధ్యయనం చేసి ఎంత విద్యుత్ అవసరమవుతుందన్న ప్రాతిపదికపై మాత్రం కాదు. ఆర్ఈ సాంకేతిక పరిజ్ఞానం కొన్నేళ్ల క్రితం వరకు కొత్తది, వ్యయంతో కూడుకున్నది. ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా దానిని గ్రిడ్‌లో కలిపారు. అదేసమయంలో కొత్త ప్లాంట్ల కోసం పెట్టే వ్యయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం సౌరశక్తిని ఉత్పత్తి చేసే సాంకేతిక పరిజ్ఞానం ఖరీదైనది. ఆ సమయంలో ఆ విద్యుత్‌ను గ్రిడ్‌లోకి తీసుకురావడానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అవసరమయ్యాయి. ప్రస్తుతం ఈ సాంకేతిక పరిజ్ఞానం ఖర్చు తగ్గినప్పటికీ ఒప్పందం ప్రకారం ఈ ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిందే. ఉదాహరణకు, సౌర, పవన శక్తి విభాగాలు కేంద్ర ప్రభుత్వ గ్రిడ్ కోడ్ ప్రకారం "తప్పక అమలు చేయవలసిన" జాబితాలో ఉన్నాయి. ఇది అన్ని రాష్ట్రాలకు తప్పనిసరి, అనగా సౌర, పవన విద్యుత్‌ను ఖర్చుతో నిమిత్తం లేకుండా డిస్కంలు స్వీకరించాలి.

అందువల్ల కేంద్ర ప్రభుత్వం సిఈఆర్‌సి ద్వారా రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు చేయాలన్న ఆదేశంతో సౌర, పవన విద్యుత్తులకు ఆయా గ్రిడ్లలో అధిక వాటాను తప్పనిసరి చేశారు. ఇది డిస్కంల విద్యుత్ సేకరణ ఖర్చులు అధికం కావటానికి దారితీసింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని డిస్కంలపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఎందుకంటే వాటికి అందుబాటులో ఉన్న సహజ వనరుల కారణంగా ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించడంలో పాటు ప్రోత్సాహకాలను ఇవ్వడంలో ముందంజలో ఉన్నాయి. ఉదాహ రణకు తమిళనాడు మొత్తం విద్యుత్‌లో 15 నుంచి 30 శాతం విద్యుత్ ఆ నెలలోని పరిస్థితిని బట్టి సౌర, పవన విద్యుత్ సరఫరా చేస్తున్నది. తమిళనాడులో పవన విద్యుత్ ఉత్పత్తి చౌకగా ఉండగా, సౌర విద్యుత్ సగటు ధర 6 రు. కంటే ఎక్కువ. అంటే ఇది రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే థర్మల్ విద్యుత్ సగటు ధర కంటే 50 శాతం ఎక్కువ. కొత్త సోలార్ ప్లాంట్లు సాపేక్షంగా చౌకగా ఉన్నప్పటికీ, డిస్కంలు ఇప్పటికీ 2016 కి ముందు ఆర్ఈ ఉత్పత్తిదారులతో చేసుకున్న ఒప్పందాలతో అధిక-ధరలు చెల్లిస్తున్నాయి. దీని అర్థం ఒకవైపు ఉత్పత్తి దారులకు నెమ్మదిగా ఖర్చు రికవరీ అవుతున్నది. . (కనీసం దీర్ఘకాలిక పిపిఎలు ఉనికిలో లేని సందర్భాల్లో) తక్కువ-ధరలో విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ డిస్కంలు విద్యుత్ సేకరణ కోసం అధిక మొత్తం ఖర్చు చేయాల్సి వస్తున్నది.

మళ్ళీ పెరిగిన సిఈఏ డిమాండ్ అంచనాలు థర్మల్, పునరుత్పాదక ఉత్పత్తిదారులతో డిస్కంలు దీర్ఘకాలిక పిపిఎలు చేసుకోవటానికి దారితీసింది. తక్కువ డిమాండ్ పెరుగుదల నేపథ్యంలో పాత ఆర్ఈ కాంట్రాక్టుల కింద అధిక విద్యుత్ కొనుగోలు ఖర్చులు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి దారులకు (పిపిఎలతో) స్థిర వ్యయ పరిహారం చెల్లించటానికి (ఫిక్స్‌కాస్ట్సు) కేవలం రెండు కేంద్ర ఏజెన్సీల విధానాలు మాత్రమే కారణం. కాని ఇప్పుడు అందుకు డిస్కంలను జవాబుదారీగా చేస్తున్నారు.

ఆర్ఈ ప్లాంట్లకు ఇచ్చే ధరలలో మార్పు లేదా ప్రస్తుత థర్మల్ విద్యుత్ ప్లాంట్ల అస్థిర వ్యయాన్ని తగ్గిస్తే తప్ప భవిష్యత్తులో అధిక ధరలతో విద్యుత్‌ను సేకరించటం కొనసాగుతుంది, దీనికి బొగ్గు వ్యయం తగ్గించటం చేయాలి. 2020 విద్యుత్ (సవరణ) బిల్లుతో లేదా లేకుండా ఈ రెండూ కూడా భవిష్యత్తులో ఉండవు. ఈ కొత్త పంపిణీ సబ్ లైసెన్సుదారులకు డిస్కంలకు ఇవ్వని ప్రత్యేక రాయితీలు ఇవ్వకపోతే వీరు డిస్కంల కన్నా అదనంగా ఎలా సంపాదించగలరు? ఉదాహరణకు పంపిణీ సబ్ లైసెన్సుదారుడు డిస్కం కట్టుబడి ఉన్న పాత కాంట్రాక్టులు, పాత పునరుత్పాదక ప్లాంట్ల నుండి అధిక ధర ఒప్పందాలను వదిలివేసి, కొత్తగా తక్కువ - ధరకు ఉత్పత్తి అవుతున్న సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తేనే అతని పరిస్థితి డిస్కంలకు భిన్నంగా ఉంటుంది.

### వ్యయాన్ని తగ్గించటం

విద్యుత్ పంపిణీలో ప్రైవేట్ సబ్-లైసెన్స్‌దారులను ప్రోత్సహించడానికి రెండవ మార్గం వ్యయాన్ని తగ్గించడం, అంటే మొత్తం సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించడం. ఇది సాధ్యం చేసేందుకు రెండు అంశాలు అవసరం. మొదటిది బిల్లింగ్ వసూళ్ల సామర్థ్యంలో మెరుగుదల, రెండవది ట్రాన్స్‌ఫార్మర్లు, తక్కువ-వోల్టేజ్ ద్వారా పంపిణీ మార్గాల వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలి.

నవంబర్ 2015 లో కేంద్ర ప్రభుత్వం ఉజ్వల్ డిస్కం అస్యూరెన్స్ యోజన (యుడిఎవై) ను ప్రవేశపెట్టింది, ప్రధానంగా డిస్కంలు వారి మొత్తం సాంకేతిక, వాణిజ్య (ఎటి అండ్ సి) నష్టాలను తగ్గించడానికి సరఫరా సగటు వ్యయం (ఎసిఎస్) సగటు వచ్చిన రాబడి (ఎఆర్ఆర్) మధ్య అంతరాన్ని తగ్గించడానికి వీలు కల్పించింది. ఎంఒపి (2020) ప్రకారం మొత్తం ఎటి అండ్ సి నష్టం, ఎసిఎస్-ఎఆర్ఆర్ వ్యత్యాసం 26 యుడిఎవై రాష్ట్రాలకు ఏడు కేంద్రపాలిత ప్రాంతాలకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో 23.96 శాతం. యూనిట్‌కు 48 పైసలు, ఇది వరుసగా 2019-20 ఆర్థిక సంవత్సరంలో యూనిట్ 27 పైసలకు 18.19 శాతంకు తగ్గింది. మూడేళ్ల కాలంలో ఎటి అండ్ సి నష్టాలు29 శాతం, ఎసిఎస్-ఎఆర్ఆర్ అంతరం 44 శాతం చెప్పుకోదగ్గ అభివృద్ధి (2016-17 నుంచి 2019-20) కనిపించింది. భారతదేశంలో చాలా డిస్కంలు తమ కార్యాచరణ పనితీరును ఎలా మెరుగుపరుచుకున్నాయో ఇది సూచిస్తుంది, అయితే 30 సెప్టెంబర్ 2015 (ఎంఒపి 2019) నాటికి 16 రాష్ట్ర ప్రభుత్వాల డిస్కంల అప్పుల్లో 75 శాతం కూడా తీసుకుంది. 2.08 లక్షల కోట్లకు పైగా అప్పులు తీసుకున్న ఈ 16 రాష్ట్రాలు, ఈ డిస్కంలకు వారి వడ్డీ ఖర్చులను తగ్గించడానికి, క్రెడిట్ రేటింగ్‌ను మెరుగు పరచడానికి తోడ్పడ్డాయనడంలో సందేహం లేదు. అందువల్ల అటువంటి కీలకమైన రంగంలో ప్రైవేటీకరణ మాత్రమే విజయ వంతమవుతుందనే మొదటి వాదన అబద్ధం.

డిస్కంల ప్రైవేటీకరణ, కొత్త ప్రైవేట్ విద్యుత్ పంపిణీదారులను ఫ్రాంఛైజీల రూపంలో ప్రవేశపెట్టడానికి గతంలో ప్రయత్నం జరిగినప్పటికీ విజయవంతం కాలేదు. డిస్కంలను రాష్ట్ర విద్యుత్ బోర్డుల నుండి వేరుచేసి, కంపెనీలుగా

> **“ ఒడిశా, ఢిల్లీ, ముంబాయి మినహా మరే ఇతర రాష్ట్రం విద్యుత్ వినియోగాన్ని ప్రైవేటీకరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 1996లో తెలుగు దేశం ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రైవేటీకరిం చడానికి చేసిన ప్రయత్నాలు పెద్దఎత్తున నిరసనలకు గురయ్యాయి. చివరికి ఆ పార్టీకి తదుపరి ఎన్నికల్లో (2004) చుక్కెదురయింది. ముంబైలో వ్యవసాయ వినియోగం లేదు. కానీ అక్కడ సుంకాల నిరంతర పెరుగుదలకు వ్యతిరేకంగా తరచూ నిరసనలు వ్యక్తం కావడంతో పంపిణీ సమస్యాత్మకంగా మారింది. ”**

ఏర్పాటుచేశారు. చాలా రాష్ట్రాల్లో వాటిని మరింత చిన్నవిగా, ప్రైవేటీకరణను సులభతరం చేయడానికి వీలుగా మార్చారు. అయినప్పటికీ ప్రైవేట్ పంపిణీ దారులు వినియోగదారులు అధికంగా ఉండే పట్టణాలపై మాత్రమే ఆసక్తి చూపారు. వీటిలో కూడా కొన్ని ప్రాంతాలలో బిల్లింగ్ సామర్థ్యంలో మెరుగుదల ఉండే కొన్ని ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అయినా ఫ్రాంఛైజీలకు లాభాల మార్జిన్లు అనివార్యంగా చాలా తక్కువ కావడం తో మౌలిక సదుపాయాలపై పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడానికి ఇష్ట పడలేదు.

### ప్రైవేటీకరణ, పంపిణీ ఫ్రాంఛైజీలతో సమస్యలు

ఒడిశా, ఢిల్లీ, ముంబాయి మినహా మరే ఇతర రాష్ట్రం విద్యుత్ వినియోగాన్ని ప్రైవేటీకరించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 1996 లో అప్పటికి అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ (తెలుగు దేశం) ఈ రంగాన్ని ప్రైవేటీకరిం చడానికి చేసిన ప్రయత్నాలు విస్తృత నిరసనలకు గురయ్యాయి, చివరికి ఆ పార్టీకి తదుపరి ఎన్నికల్లో (2004) చుక్కెదురయింది. ముంబై ఒక ద్వీప నగరం. వ్యవసాయ వినియోగం లేదు. చాలా సులువుగా నిర్వహించ వచ్చు. కానీ అక్కడ సుంకాల నిరంతర పెరుగుదలకు వ్యతిరేకంగా తరచూ నిరసనలు వ్యక్తం కావడంతో పంపిణీ సమస్యాత్మకంగా మారింది. ఒడిశాలో అనేక సంవత్సరాలు ఈ రంగాన్ని నిర్వహించడానికి విఫల ప్రయత్నాలు సాగాయి. ప్రైవేట్ నిర్వహణలో మూడు విఫల ప్రయత్నాల తరువాత విద్యుత్ పంపిణీ తిరిగి రాష్ట్రం చేతుల్లోకి వచ్చింది. విభిన్న వినియోగదా రులతో, ఎక్కువగా గ్రామీణ, చిన్న పారిశ్రామిక వినియోగదారులు నివసించే ప్రాంతంలో ఈ ప్రయోగం ఘోరమైన వైఫల్యమని ఒడిశా అనుభవం నిరూపించింది. ఢిల్లీలో ప్రైవేటీకరణ గురించి పన్ను చెల్లింపు దారుల వద్ద ఉదారంగా ప్రచారం చేసినప్పటికీ తొలుత వారు ప్రతిపా దించినదాని కన్నా చాలా ఎక్కువ ఛార్జీలు వసూలు చేశారు. వీటన్నింటికీ తోడు వ్యవసా యేతర వినియోగదారుల ప్రయోజనం, విద్యుత్ సేకరణ ఖర్చులను తగ్గించడంలో ప్రైవేటీకరణ పాక్షికంగా మాత్రమే విజయవంతమైంది. కాని ఆ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయడంలో విఫలమైంది.

ప్రైవేటీకరణ పని చేయకపోవడంతో పంపిణీ ఫ్రాంఛైజీల నమూనా ప్రవేశపెట్టారు. ఇక్కడ ప్రభుత్వం నడిపే యుటిలిటీస్ నెట్‌వర్క్ ఒక విభాగాన్ని ఇప్పుడు ప్రతిపాదించినట్లుగానే ప్రైవేట్ కంపెనీలకు లేదా ఇతర ఏజెన్సీలకు సబ్ కాంట్రాక్ట్ చేస్తుంది. ఈ సబ్ కాంట్రాక్టర్లు ఈ ప్రాంతాలలో నష్టాలను తగ్గించి బిల్లు వసూళ్ళను మెరుగుపరుస్తారని భావించినప్పటికీ ఆచరణలో పంపిణీ విభాగాలు ఆ పని చేయలేకపోయాయి. ఏదేమైనా చాలా సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన ఈ నమూనా వ్యవసాయ వినియోగం తక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమయింది. ఉదాహరణకు భివాండి, ఆగ్రా, అహ్మదాబాద్‌లకు మాత్రమే పరిమితం. ఈ ప్రాంతాలలో కూడా ఈ నమూనా రేఖామాత్ర అనుభవాన్ని కలిగి ఉంది. ఫ్రాంఛైజీలచే కొన్ని బిల్లింగ్, సేకరణ సామర్థ్యాలను పరిష్కరించగలిగినప్పటికీ, సాంకేతిక నష్టాలను తగ్గించడానికి గణనీయమైన పెట్టుబడి అవసరమవుతుందని పంపిణీ ఫ్రాంఛైజీల అనుభవం తెలుపుతున్నది. ఇది వినియోగదారులకు అందించే సామర్థ్యం లేకుండా ఫ్రాంఛైజీకి ఎటువంటి ప్రోత్సాహాన్ని పొందలేదు. గ్రామీణ ఫ్రాంఛైజీలను ప్రోత్సహించే గొప్ప ప్రణాళికలు కొన్ని సంవత్సరాల క్రితం వేగంగా నిశ్శబ్దంగా ముగిశాయి. ఎందుకంటే అధికసంఖ్యలో ఉన్న నిరుపేద జనాభా పూర్తిస్థాయిలో విద్యుత్ వ్యయాన్ని భరించలేని స్థితి వల్ల ప్రైవేటు కంపెనీలు వారికి విద్యుత్ సరఫరా చేసినా లాభాలు రావు.

అందువల్లవిద్యుత్ సరఫరాను ఫ్రాంఛైజీలకు ఇవ్వడానికి పట్టణ సముదాయాలను మాత్రమే ఎంచుకోవడం వల్ల కూడా ఈ నమూనా పనిచేయలేదు. భారతదేశంలోనే విద్యుత్ వినియోగ పరిస్థితి ఏమిటంటే, చాలామంది వినియోగదారులు ఇప్పటికీ పూర్తి విద్యుత్ ఖర్చును చెల్లించలేరు. చిన్న, మధ్య తరహా ఉత్పాదక యూనిట్లకు, ముఖ్యంగా సాధారణ రంగంలో విద్యుత్తు వినియోగ వ్యయం గణనీయమైన నిష్పత్తిని కలిగి ఉంది. విద్యుత్ చట్టం 2003 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓపెన్ యాక్సెస్ (మార్కెట్‌లో కొనుగోలు) విధానాల వల్ల పెద్ద వినియోగదారులు గ్రిడ్ నుండి నిష్క్రమించారు, చౌకైన విద్యుత్ సరఫరా కోసం వారి స్వంత ఏర్పాట్లు చేసుకున్నారు. అయినప్పటికీ పంపిణీ సంస్థలకు విద్యుత్తు కోసం చెల్లించగల వినియోగదారులు ఉన్నారు. అంటే విద్యుత్ సరఫరా వ్యాపారం లాభాలను ఆర్జించకపోయి నప్పటికీ ఆర్థికంగా కొనసాగించే వీలుంది. అటువంటి పరిస్థితిలో లైన్ నష్టాలను మెరుగుపరచడానికి పెట్టుబడి పెట్టటడం రాబడికి హామీ లేని ఖరీదైన ప్రతిపాదన అవుతుంది.

ప్రైవేటీకరణ వల్ల సామర్థ్యాన్ని మెరుగు పరుచుకుని ఖర్చులను తగ్గించుకోవడ మనేది వేర్వేరు పంపిణీదారుల మధ్య పోటీ ఉంటే సాధ్యపడుతుందనే వాదన వారికి ధరలు తగ్గించడానికి తగిన ప్రోత్సాహకాలున్నప్పుడు కుదురుతుంది. వైర్ల గుత్తాధిపత్యం ఉన్న వ్యాపారం కోసం ఇలా ప్రారంభించడం కష్టమైన ప్రతిపాదన. గతంలో ప్రైవేట్ సబ్–లైసెన్స్‌లను ఫ్రాంఛైజీల రూపంలో ప్రవేశపెట్టే ప్రయత్నం చాలా సందర్భాలలో విఫలమైంది. అందుకు ఖర్చులను తగ్గించడంలో అసమర్థత లేదా ఖర్చు తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయలేకపోవడం కారణం. ప్రతిపాదిత సవరణతో వినియోగదారులు చెల్లించగలిగే ప్రాంతాలలో, అంటే నగరాల్లో, లేదా పేద వినియోగదారులు కనిష్టంగా ఉన్న నగరాల్లోని ప్రాంతాలలో మాత్రమే వ్యాపారులు ఆసక్తి చూపడంతో చరిత్ర కూడా పునరావృతమవుతుందని ఊహించడం సహేతుకమైనది. దీని అర్థం డిస్కంలు మరోసారి పేద వినియోగదారులకు మాత్రమే సేవ చేయటానికి మిగిలి పోతాయి.

డిస్కంల ప్రస్తుత ఆర్థిక సంక్షోభాలకు ప్రధాన కారణాలలో ఒకటి ఇప్పటికే ఈ రంగంలో చేసిన మార్పులు. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పంపిణీ విధానం కూడా విచ్ఛిన్నం అయింది. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల నుండి వచ్చే నష్టాలను పూడ్చడానికి రాష్ట్రంలోని

అభివృద్ధి చెందిన ప్రాంతాల నుండి వచ్చే ఆదాయంపై ఆధారపడలేకపోయారు. కొత్త విధానం సమస్యను మరింత పెంచుతుంది.

**సుంకాల హేతుబద్ధీకరణ'**

సాధారణంగా అధిక సుంకాలను చెల్లించే సామర్థ్యం గల వినియోగదారులకు అంటే పెద్ద పారిశ్రామిక వాణిజ్య వినియోగదారుల నుంచి వసూలు చేయడం ద్వారా చిన్న, మధ్యతరహా రైతులు, పేద పట్టణ, గ్రామీణ గృహ వినియోగదారులు కొంతవరకు గృహ–ఆధారిత లేదా చిన్న సంస్థల వంటి పూర్తి విద్యుత్ ఖర్చును చెల్లించలేని పెద్ద సంఖ్యలో ఉన్న వినియోగదారులకు డిస్కంలు విద్యుత్ సరఫరా చేస్తాయి. పేద వినియోగదారులకు క్రాస్ సబ్సిడీ ఇవ్వడానికి ఆ ఆదాయాన్ని వినియోగిస్తారు.

ఏదేమైనా క్రాస్ సబ్సిడీ ఇవ్వగల రాష్ట్రాల సామర్థ్యాన్ని కేంద్రం కొన్నేళ్లుగా తగ్గించింది. 2003 విద్యుత్ చట్టం "క్రాస్ సబ్సిడీని తొలగించడం" ను తప్పనిసరి చేసింది, తరువాత దీనిని "క్రాస్ సబ్సిడీలో ప్రగతిశీల తగ్గింపు" కు సవరించారు. కొత్త విద్యుత్ (సవరణ) బిల్లు 2020 భారతదేశంలోని వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే అవి ప్రమాదకరమైనవి. క్రాస్–సబ్సిడీలను అనుమతించ కుండా ఆ విభాగానికి అయ్యే ఖర్చు ఆధారంగా ఎస్ఈఆర్‌సిలు నిర్ణయించే సుంకాలను వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట వర్గాల వినియోగదారులకు సబ్సిడీ ఇవ్వాలనుకుంటే డిబిటి (ప్రత్యక్ష ప్రయోజన బదిలీ) విధానం ద్వారా సబ్సిడీ మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేయాలి.

ఈ ప్రతిపాదనలు అత్యంత సమస్యాత్మకమైనవి. గ్రామీణ వినియోగదారుల కోసం సరఫరా చేసే విద్యుత్ పంపిణీ లైన్లు, విఫలమయ్యే వివిధ ట్రాన్స్‌ఫార్మర్లు వారికి నిర్ణయించిన అధిక సుంకాలపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. పారిశ్రామిక వినియోగదారులు హైటెన్షన్, ఎక్స్‌ట్రా హైటెన్షన్ లైన్లను ఉపయోగించడం వల్ల వారు చెల్లించే సుంకాలు చౌకగా ఉంటాయి. గ్రామీణ వినియోగదారులకు విద్యుత్ ఒక ప్రాథమిక అవసరమే తప్ప విలాసవంతమైనది కాదు. కనుక ఖర్చుతో సంబంధం లేకుండా దీనిని వారికి అందుబాటులో ఉండే ధరలో సరఫరా చేయాల్సి ఉంటుంది.

రాష్ట్ర అస్థిరమైన ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రాలు నేరుగా సబ్సిడీ ఇస్తాయని ఆశించడం వాస్తవంగా అసాధ్యం. ఒక వైపు జీఎస్టీ అమలుతో రాష్ట్రాల ఆదాయ మార్గాలు పిండి వేయడంతో రాష్ట్రాలు

> **"ప్రైవేటీకరణ వల్ల సామర్థ్యాన్ని మెరుగు పరుచుకుని ఖర్చులను తగ్గించుకోవడ మనేది వేర్వేరు పంపిణీదారుల మధ్య పోటీ ఉంటే సాధ్యపడుతుందనే వాదన వారికి ధరలు తగ్గించడానికి తగిన ప్రోత్సాహకాలున్నప్పుడు కుదురుతుంది. వైర్ల గుత్తాధిపత్యం ఉన్న వ్యాపారం కోసం ఇలా ప్రారంభించడం కష్టమైన ప్రతిపాదన. గతంలో ప్రైవేట్ సబ్-లైసెన్స్‌లను ఫ్రాంచైజీల రూపంలో ప్రవేశపెట్టే ప్రయత్నం చాలా సందర్భాలలో విఫలమైంది."**

నిధుల కోసం కేంద్రంపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అయినప్పటికీ ఇవి సమయానికి విడుదల కావు. మరోవైపు, పేద వినియోగదారులు–నివాస, వ్యవసాయ, ఇతర వర్గాల వినియోగదారులు (ప్రజారోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు వంటి సౌకర్యాల ప్రొవైడర్లు కూడా)–చాలా రాష్ట్రాల్లో గణనీయమైన నిష్పత్తిలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ కోసం అధిక ఖర్చులు భరించగలిగే శక్తి లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ, క్రాస్ సబ్సిడీలను రెండింటినీ ప్రత్యక్షంగా చెల్లించటం ఆచరణ సాధ్యం కాదు.

గృహాలకు ఈ ప్రాథమిక అవసరాన్ని అందించలేకపోవడం వల్ల రాష్ట్రస్థాయి ప్రతినిధులు భారీమూల్యం చెల్లించాల్సి వుంటుంది. ఈ సమస్యకు కారణమైన కేంద్ర ప్రభుత్వం జరిగే పరిణామాలకు ఎలాంటి బాధ్యత వహించదు.

అంతేకాకుండా డిబిటి పథకం విజయవంతమైనట్టు ఎక్కడా నిరూపితం కాలేదు. డేటా–కొరత ఉన్న పరిస్థితులలో సమర్థంగా, సకాలంలో ప్రయోజనం కలిగించే రీతిలో పనిచేయడం సమస్యాత్మకం అవుతుంది. నగదు కొరతతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో నగదు బదిలీలు చేస్తాయని అనుకోలేం. కాబట్టి డిస్కంలు (ఖచ్చితంగా ప్రైవేట్ సబ్–లైసెన్స్‌దారులు) సమయానికి బిల్లులు చెల్లించలేని వినియోగదారులకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తాయి లేదా రాజకీయ కారణాల వల్ల అలా చేయలేకపోతే, వినియోగానికి అనుగుణంగా వసూలు చేయలేని సమస్య ఏ సందర్భంలోనూ పరిష్కారం కాదు. రాష్ట్రం నుండి సబ్సిడీలు సకాలంలో పంపిణీ చేయడాన్ని రాష్ట్ర డిస్కంలు నిర్ధారించలేకపోతే, వ్యక్తిగత వినియోగదారులు ఏ విధంగా ఇవ్వగలరు? ముంబాయ్‌లో అధిక ఆదాయాలు లభించే ప్రాంతాల్లో సుంకం పెంపు నిరసనలకు దారితీస్తే, దేశవ్యాప్తంగా అలాగే ఎందుకు జరగదు? అద్దె ప్రాంగణంలో నివసించే గృహాల వారిది అదనపు సమస్య. మీటర్లు వేరేవారి పేర్లతో ఉండడం సమస్యను మరింత పెంచుతుంది. సైద్ధాంతికంగా సబ్సిడీని వ్యతిరేకిస్తున్న పాత విధానాలు కొత్త రూపంలో మరో సారి విద్యుత్ రంగంలోని పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉంది.

**విద్యుత్ రంగంలో రాష్ట్ర–కేంద్రం సంబంధాలు**

ఈ కొత్త బిల్లులో మరో ప్రధాన అంశం ఏమిటంటే, ఇంతకుముందు ప్రయత్నించిన దానికంటే ఎక్కువ దూకుడుగా విద్యుత్ రంగంపై నియంత్రణను కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తుంది. రాష్ట్రాలపై కేంద్ర విధానాల ద్వారా కొన్నేళ్లుగా ఇదే మోతాదులో జరుగుతోంది, కాని బిల్లులో ప్రతిపాదించిన సవరణలు రాజ్యాంగంలోని నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రాల అధికార పరిధిలోకి కేంద్రం చొరబడడాన్ని సూచిస్తుంది.

మొదట ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వం నియంత్రించే కేంద్ర ఎంపిక కమిటీ రాష్ట్ర ప్రభుత్వాల నుండి చైర్‌పర్సన్ ఎస్ఈఆర్‌సిల సభ్యుల నియామక అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. సిఇఆర్‌సి, అప్పిలేట్ ట్రిబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఎపిటిఈఎల్) ప్రతిపాదిత కాంట్రాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీకి ఉమ్మడి ఎంపిక కమిటీ ఉంటుంది. దీనిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించిన జడ్జీ చైర్‌పర్సన్‌గా, ఇద్దరు భారత ప్రభుత్వ కార్యదర్శులు, వీరిలో ఒకరు కన్వీనర్‌గా, రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు రాష్ట్రాల నుంచి అక్షరక్రమంలో ఒక్కొక్క యేడాదికి నియమితులవుతారు (అంటే తొలుత ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్). ఈ అమరికతో చాలా సమస్యలు ఉన్నాయి. అదే కమిటీ విద్యుత్ రంగంలోని అన్ని నియంత్రణ సంస్థల అధ్యక్షులు, సభ్యులను ఎన్నుకొంటుంది. భారత అధికార వ్యవస్థ గురించి తెలిసిన వారికి,

> **"ఈ కొత్త బిల్లులో మరో ప్రధాన అంశం ఏమిటంటే, ఇంతకుముందు ప్రయత్నించిన దానికంటే ఎక్కువ దూకుడుగా విద్యుత్ రంగంపై నియంత్రణను కేంద్రీకరించ డానికి ప్రయత్ని స్తుంది. రాష్ట్రాలపై కేంద్ర విధానాల ద్వారా కొన్నేళ్లుగా ఇదే మోతాదులో జరుగుతోంది, కాని బిల్లులో ప్రతిపాదించిన సవరణలు రాజ్యాంగం లోని నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రాల అధికార పరిధిలోకి కేంద్రం చొరబడడాన్ని సూచిస్తుంది."**

భారత ప్రభుత్వానికి ఇద్దరు చీఫ్ సెక్రటరీలు, ఇద్దరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల మధ్య టై ఏర్పడితే వారిలో చీఫ్ సెక్రటరీలు జూనియర్లయితే ఎవరిమాట చెల్లుబాటవుతుందో స్పష్టంగా తెలుసు. అందువల్ల వాస్తవంగా కేంద్రం రాష్ట్రాల రెగ్యులేటరీ నియామకాలను నియంత్రిస్తుంది, వాటి నిర్ణయాలను కూడా నియంత్రించగలదు. నియంత్రణ వ్యవస్థ స్వతంత్ర పనితీరును ఇది పూర్తిగా దెబ్బ తీస్తుంది. రెగ్యులేటరీ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేయాలంటే బలమైన, నిష్పాక్షికమైన ఎంపిక అవసరం.

రెండవది ఈ బిల్లు సుంకం పిటిషన్‌ను ఆమోదించడానికి రాష్ట్ర నియంత్రణ వ్యవస్థకు కాలపరిమితిని నిర్దేశిస్తుంది. సుంకం రివిజన్ పిటిషన్ అందుకున్న 60 రోజులలోపు సుంకాలను పరిష్కరించడంలో ఎస్ఈఆర్‌సి విఫలమైతే, పిటిషన్‌లో కోరిన రివిజన్ ఆమోదించబడినట్లుగా పరిగణించబడుతుంది. సుంకాలను నిర్ణయించడానికి రాష్ట్ర కమిషన్లకు పత్రాల సేకరణ యుటిలిటీల ద్వారా ఆర్థిక వాదనలను ధృవీకరించడం, పబ్లిక్ కన్సల్టేషన్‌తో సహా తగిన విధానాలను అనుసరించడం వంటి కఠినమైన ప్రక్రియతో పాటు అందుకు అవసరమైన సమయానికి ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకుంటే ఇది క్రూరమైన ప్రతిపాదన. రాష్ట్రస్థాయిలో నియంత్రణ వ్యవస్థ మూలాలను దెబ్బతీస్తుంది.

మూడవది ప్రతిపాదించిన సవరణలు విద్యుత్‌కు అవసరమైన మొత్తాన్ని రాష్ట్రాలు ముందుగా చెల్లించకుంటే వాటికి సరఫరాను నిలిపివేసే అధికారం ప్రాంతీయ డిస్పాచ్ కేంద్రాలకు (ప్రాంతీయ ఎల్‌డిసి) కట్టబెట్టారు. దీనర్థం ఏమిటంటే డిస్కంలు చెల్లింపులకు సంబంధించిన ఏర్పాటులో విఫలమైతే కేంద్ర ఎల్‌డిసి తనకున్న అధికారంతో రాష్ట్ర ఎల్‌డిసిలను ఆదేశించి వాటికి పంపాల్సిన విద్యుత్‌ను నిరాకరించే అవకాశం ఉంది. ఇది ఇప్పటికే డిస్కంల చేతులు విరిచేస్తున్న ప్రైవేటు రంగాన్ని, వారి అనుచరగణాన్ని ప్రోత్సహిం చడానికేనని స్పష్టమవుతున్నది. "తప్పక నడపాల్సిన" పునరుత్పాదక విద్యుత్ కేంద్రాలు, థర్మల్ విద్యుత్ మధ్య ఊగిసలాడుతున్న డిస్కంలను మరింత ఇరకాటంలో పెట్టవచ్చు. జనరేటర్లు డిస్కంలు పునరుత్పాదక విద్యుత్‌ను తీసుకోకపోతే జరిమానాలు కట్టాల్సివస్తుంది. తీసుకుంటే క్యాచ్-22 పరిస్థితిలో చిక్కుకొని ఆర్థిక విధ్వంసాన్ని ఎదుర్కొంటాయి.

నాల్గవది, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలపై తీర్పు చెప్పే రాష్ట్ర కమిషన్ల అధికారాన్ని ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అథారిటీ అని పిలిచే కొత్త రెగ్యులేటరీ అథారిటీకి అప్పగించాలని ప్రతిపాదించారు. దీని సభ్యులు, ఛైర్‌పర్సన్‌ను పైన పేర్కొన్న అదే కమిటీ ఎంపిక చేస్తుంది. అధిక ధర గల సౌర పిపిఎలపై పునర్నిర్ణయం చేయాలని ఆలోచించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రయత్నం లేదా ఒక విదేశీ ప్రభుత్వ నిర్ణయం వల్ల బొగ్గు సేకరణ ఖర్చులు పెరిగినప్పుడు వాటికి పరిహార సుంకాన్ని ఇవ్వాలనే సిఈఆర్‌సి ఉత్తర్వులను 2017లో రద్దు చేసిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను పక్కన పెట్టటానికి ఈ నిర్ణయం చేసి ఉండవచ్చు. కారణం ఎవరైనప్పటికీ జరుగుతున్న వాటికి వారు బాధ్యులు కాకపోయినప్పటికీ ఇది రాష్ట్ర ప్రభుత్వాలను మరింత గట్టిగా బిగించి అప్పుల సుడిగుం డంలోకి నెడుతుంది.

కేంద్ర ప్రభుత్వం పిపిఎల పేరుతో థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ధరల భారాన్ని రాష్ట్రాలపై మోపి, అంచనాల కంటే తక్కువ డిమాండ్, (సిఈఎ) వ్యయభరితమైన పునరుత్పాదక కాంట్రాక్టుల నడుమ తప్పక అమలుచేయాల్సిన ఆదేశాల పేరిట ఇప్పుడు పటిష్టమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది. అన్యాయమైన ఒప్పందాలను అమలు చేయలేదని కఠినంగా అపరాధ రుసుం విధించడమంటే సమస్యలతో అలమటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలను మరింతగా నిర్వీర్యం చేయడమే అవుతుంది.

### ముగింపు

గత 20 సంవత్సరాలుగా విద్యుత్ ప్రణాళిక, విద్యుత్ రంగ ఫైనాన్సింగ్, జాతీయ సుంకం విధానం సమానమైన జాతీయ ఆర్ఈ విధానాన్ని అభివృద్ధి చేయలేని కేంద్ర ప్రభుత్వం అసమర్థత స్పష్టంగా తెలుస్తున్నది. ప్రతిపాదిత సవరణలు దశాబ్దాల తరబడి తాము చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకోవడానికి, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పంపిణీ సంస్థల చేతకానితనం పేరుతో విద్యుత్ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను, థర్మల్, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిదారులను కాపాడే ప్రయత్నం చేస్తున్నది. ప్రతిపాదిత బిల్లులో అధికారాలను కేంద్రీకరించి, తమ అధీనంలోని సంస్థలు చేసిన, చేస్తున్న తప్పులకు రాష్ట్ర ప్రభుత్వాల ఆధర్వం లోని డిస్కంలపై అపరాధ రుసుం విధించేదుకు సాగిస్తున్న ప్రయత్నం ఇది. అవాస్తవికంగా ప్రతిష్టాత్మకమైన పునరుత్పాదక లక్ష్యాలతో కొత్త రెగ్యులేటరీ వ్యవస్థను రూపొందించి మొత్తం భారం రాష్ట్రాలపై మోపి వాటిని క్రమశిక్షణలో పెట్టే పేరిట కేవలం అంతర్జాతీయ సమాజాన్ని ప్రసన్నం చేసుకోవటానికి ఉద్దేశించినది.

అందువల్ల 2020 కొత్త విద్యుత్ (సవరణ) బిల్లులో ప్రతిపాదిత సవరణలు పూర్తిగా ప్రజా వ్యతిరేకమైనవి మాత్రమే కాదు, ఈ రంగంలో సంక్షోభాలను నివారించకపోగా దాని క్షీణతను మరింత వేగవంతం చేస్తాయి. పర్యావరణ మార్పులు, విద్యుదుత్పత్తి విధానాలు, వేగవంతమైన ఆర్థిక మార్పుల యుగంలో ఈ రంగం ఉత్పత్తి, ప్రసార, పంపిణీ విభాగాల మధ్య మంచి సమన్వయం అవసరం. ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లో బలమైన ప్రణాళికతో పాటు విస్తరణకు హామీ ఇచ్చే రీతిలో ప్రభుత్వ జోక్యం, అన్ని స్థాయిల్లోని వినియోగదారులకు నమ్మకమైన, భరించగలిగే ధరలకు విద్యుత్తును అందించడం లక్ష్యం కావాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రమేయం లేకుండా ఇదిసాధ్యం కాదు.

కోవిడ్-19 మహమ్మారి కారణంగా దీర్ఘకాలంగా పరిష్కరించని సమస్యల వల్ల విద్యుత్ రంగంతో పాటు ఆర్థిక వ్యవస్థ తక్షణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ప్రభుత్వం చేష్టలుడిగి ఏ చట్టాలు చేయకుండా చూస్తున్నది. ప్రత్యేకించి రాష్ట్రాలన్నీ కోవిడ్-19ను ఎదుర్కొనే పోరాటంలో మునిగిపోయి ఉన్నాయి. ఈ సంక్షోభం నుంచి మనం తక్షణం బయటపడేందుకు విస్తృతమైన సంప్రదింపులు, మరింత శాస్త్రీయమైన అవగాహన, పరిమితమైన సైద్ధాంతిక వైఖరి ఎంతో అవసరం.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# అమెరికా ఎన్నికలు: బైడెన్‌వీ అవే విధానాలు



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

ఎ. కోటిరెడ్డి

అమెరికా అధ్యక్ష ఎన్నికలు పూర్తయాయి. ఎన్నికల క్రమం పూర్తయి తాను ఓడిపోయానని తెలిసిన తర్వాత 15 రోజుల పాటు తన మద్దతుదారులను రెచ్చగొట్టి ఘర్షణలను ప్రోత్సహించటం, న్యాయస్థానాలను ఆశ్రయించటం చేసిన తర్వాత ఎట్టకేలకు ట్రంప్ తన ఓటమిని అంగీకరించి, అధికార మార్పిడి క్రమానికి అంగీకారం తెలిపాడు. కోవిడ్‌ను నియంత్రించటం, ఆర్థికవృద్ధిని సాధించటంలో విఫలమై, తన రాజకీయ ప్రయోజనాల కోసం జాతి విద్వేషాలను పెంచుతున్న ట్రంప్ ఓటమిని అమెరికా ప్రజలు పెద్ద ఉపశమనంగా భావిస్తున్నారు. కాని బైడెన్ విజయం అమెరికాను అభివృద్ధికరమైన బాటలో నడుపుతుందని వారు భావించటం లేదు. మాటలు, విధానాలలో చిన్న వ్యత్యాసాలు మినహా రిపబ్లికన్‌లు, డెమొక్రాట్లు ఉభయులూ అమెరికాలోని బహుళజాతి సంస్థలు, బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేసేవారే. కరోనా వైరస్‌ను నివారించటంలో ట్రంప్ వైఫల్యం వలన ప్రపంచంలో అత్యధిక కేసులు, మరణాలు నమోదైన దేశంగా అమెరికా నిలిచింది. అయినప్పటికీ జాతి విద్వేషాలను, మహిళలను అణచివేసే భావాలను రెచ్చగొట్టి, ప్రజలలో పెరుగుతున్న ఆగ్రహాన్ని తెలివిగా ఉపయోగించుకోవటం వలననే ట్రంప్ ఎన్నికలలో గట్టిపోటి ఇవ్వగలిగారు.

అధికారాన్ని స్వీకరించనున్న బైడెన్ తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. తన మంత్రివర్గ, సిబ్బందిలో కొందరిని ఇప్పటికే నియమించాడు. ఒబామా హయాంలో డిప్యూటి విదేశాంగ మంత్రిగా పనిచేసిన బ్లింకెన్‌ను విదేశాంగ మంత్రిగా నియమించుకున్నారు. విదేశాంగశాఖ మాజి కార్యదర్శి జాన్ కెర్రిని పర్యావరణ రాయబారిగా నియమించారు. అలెజాండ్రో మయోర్కోను హోంలాండ్ సెక్యూరిటి కార్యదర్శిగా నియమించారు. ఈ బాధ్యతలలోకి వచ్చిన మొదటి లాటిన్ వలసదారు అలెజాండ్రో. ట్రంప్ విధానాల కారణంగా అమెరికా, మెక్సికో సరిహద్దుల్లో ఏర్పడిన సంక్షోభం కారణంగా ఈ నియామకం ముఖ్యమైనది. సిఐఎ మాజి డిప్యూటి డైరెక్టర్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్‌గా పనిచేసిన ఆవ్రిల్ హేన్స్‌ను నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించారు. జాతీయభద్రతా సలహాదారుగా జాక్ సల్లివాన్‌ను, ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారిగా లిండా థామస్ గ్రీన్‌ఫీల్డ్‌ను నియమించారు.

వివిధ జాతులు, దేశాల నుండి అమెరికా వెళ్ళిన ప్రజలు ట్రంప్ పాలించిన నాలుగు సంవత్సరాలు గోడలు, దాడులు, నిషేధాల మధ్య బతికామని భావిస్తున్నారు. తాను అధికారంలోకి రాగానే ట్రంప్ ముస్లింలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తానని, ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా దేశంలోకి వచ్చిన బాలలు, యువత తదితరులను దేశంలోనే ఉండడానికి అనుమతిస్తామని బైడెన్ ప్రకటించారు. అయితే ఆయన చెప్పినప్పటికీ అన్ని అంశాలు సక్రమంగా అమలయే అవకాశాలు లేవని, అందుకోసం బైడెన్ ప్రభుత్వంపై వత్తిడిని కొనసాగించాల్సి ఉంటుందని ఇబ్బందులకు గురైన ప్రజలు భావిస్తున్నారు. ప్రధానంగా బలహీన వర్గాలకు చెందినవారు, జాతి, లింగపరమైన మైనారిటీలు, కార్మికసంఘాలు, ఇతర ప్రజాసంఘాలతో బాటు ఉదారవాదులు, ఆయుధ ఉత్పత్తిదారులలో కొంతభాగం డెమొక్రటిక్ పార్టి పునాదిగా ఉన్నారు. మద్దతుదారులలో ఎక్కువ భాగం సామాన్య ప్రజలు, అణచివేతకు గురేవారే ఉన్నప్పటికీ కార్పొరేట్ల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ఆ పార్టీ విధానాలు ఉంటాయి.

కోవిడ్ మహమ్మారిని అరికట్టలేకపోవటం, అక్రమంగా వివిధ దేశాలపై ఆంక్షలు విధించటానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో ఒత్తిడి తీసుకురావటానికి అవకాశం ఉంది. ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు తదితర సంస్థల ద్వారా పాల్పడుతున్న నేరాలను నిరోధించటం కోసం కృషి చేయటం ద్వారా అమెరికా పాల్పడుతున్న కొన్ని నేరాలకు అడ్డుకట్ట వేయటానికి ప్రయత్నం చేయవచ్చు. కాని ఈ అంశాలకు సంబంధించి భ్రమలకు గురికా కుండా ఉండాలి. అమెరికా లేదా మరే ప్రజా స్వామిక ప్రభుత్వమైనా తనంతట తానుగా అణచివేయబడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించదు. అందుకోసం పోరాటాలు చేయటం అవసరం.

**విధానాలు మారే అవకాశం లేదు**

రెండు ప్రమాదకర శక్తుల మధ్య తక్కువ ప్రమాదం కలిగించేదానిని ఎంచుకోవటం లాంటిది బైడెన్ విజయం. బైడెన్, కమలా హారిస్‌ల చరిత్ర చూస్తే వారు అభ్యుదయ విధానాలు అనుసరిస్తారని ఆశించటానికి అవకాశం లేదు. ఇరాక్‌పై యుద్ధానికి బుష్‌ను బైడెన్ ప్రోత్సహించారు. బుష్ కాలంలో ఉపాధ్యక్షునిగా ఉన్న డిక్‌చెని ఇపుడు బైడెన్–హారిస్‌లను సంప్రదిస్తున్నారు. ఇది అతి తీవ్రమైన విషయం. బైడెన్, కమలా హారిస్‌లు డెమొక్రాటిక్ పార్టీలోని అత్యంత మితవాద, యుద్ధోన్మాదులతో కలిసి వ్యవహరిస్తున్నారు. అందువలన పోరాటాలు లేకుండా కార్మికులు, పేదలు ఏమీ పొందటానికి అవకాశం లేదు. సెనెట్‌లో రిపబ్లికన్‌లకు మెజారిటీ ఉండటం ఆయన మితవాద విధానాలను అనుసరించటానికి సాకుగా ఉపయోగపడతాయి. సెనెట్‌లో మెజారిటీ కోల్పోవటానికి మీరే కారణమని తమ పార్టీలోని వామపక్ష వర్గానికి చెందిన వారిని బైడెన్ అనుయాయులు నిందించటం ప్రారంభించారు.

ట్రంప్ ఓడిపోవటంతో అంతర్జాతీయ సమాజం కూడా ఒకసారి నిట్టూర్పువిడిచింది. అమెరికా గ్రేట్ ఎగైన్ పేరుతో ట్రంప్ సాంప్రదాయకంగా ఉన్న మిత్రులను దూరం చేసుకున్నాడు. ఇరాన్, వెనిజులాలపై యుద్ధం చేస్తానని బెదిరించాడు. ఇయు నుండి బయటికి రమ్మని బ్రిటన్‌ను బహిరంగంగానే

> "ప్రపంచంలో కోవిడ్ మహమ్మారి విలయం సృష్టిస్తూ, అమెరికాలో అత్యధికంగా కేసులు నమోదౌతున్న సమయంలో అమెరికా డబ్ల్యుహెచ్ఒ నుండి ఉపసంహరించుకుంది. డబ్ల్యుహెచ్ఒలోకి అమెరికా తిరిగి రావాలని ఆ సంస్థ ప్రతినిధి కోరాడు. కోవిడ్‌ను అరికట్టటం పెద్ద సవాలుగా ఉందని, తాము తిరిగి డబ్ల్యుహెచ్ఒలో చేరతామని, సంస్థకు ఉదారంగా నిధులిస్తామని బైడెన్ ప్రకటించాడు."

ప్రోత్సహించారు. టిపిపి లాంటి అనేక అంతర్జాతీయ ఒప్పందాల నుండి వైదొలిగాడు. ట్రంప్ అమెరికా ఫస్ట్ నినాదం ప్రధానమైనదని బైడెన్ ఇప్పటికే ప్రకటించాడు. ట్రంప్ విధానాలను జర్మని ఛాన్సలర్ మెర్కెల్, ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్‌లు విమర్శించారు. మధ్యాసియాలోని అత్యంత నిరంకుశమైన ప్రభుత్వాలే ట్రంప్‌కు అతి సన్నిహితంగా ఉన్నాయి. పారిస్ పర్యావరణ ఒప్పందంలో తిరిగి భాగస్వాములం అవుతామని బైడెన్ ప్రకటించారు. మధ్యంతర స్థాయి అణ్వాయుధ ఒప్పందం నుండి కూడా ట్రంప్ వైదొలిగారు. అణ్వాయుధ ఒప్పందాలను రద్దుచేసుకోవటమే కాక, మిగిలిన ఒక్క ఒప్పందాన్ని కూడా రద్దు చేస్తానని ట్రంప్ ప్రకటించగా, దీనిని మరో ఐదు సంవత్సరాలు పొడిగిస్తామని బైడెన్ ప్రకటించారు. ఈ మధ్య అమెరికా విడుదల చేసిన పత్రాలలో చైనా, రష్యాలను వ్యూహాత్మక శత్రువులుగా పేర్కొన్నారు. చైనా శాంతియుతంగా అభివృద్ధి చెందటాన్ని ప్రోత్సహిస్తానని ఒబామా ప్రభుత్వం చెప్పింది. ఉమ్మడి ప్రయోజనాలున్న విషయాలలో రష్యాతో మరింత సన్నిహితత్వాన్ని కొనసాగించటానికి తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు.

అయినప్పటికీ ఒబామా పాలన చివరి కాలంలో రష్యాతో సంబంధాలు దిగజారాయి. ఉక్రెయిన్‌లో ప్రభుత్వాన్ని మార్చటానికి అమెరికా నిర్వహించిన పాత్ర రెండు దేశాల మధ్య సంబంధాల క్షీణతకు దారితీసింది. ఎటువంటి సాక్ష్యాలు లేనప్పటికీ అమెరికా ఎన్నికలలో రష్యా జోక్యం చేసుకున్నదని, 2020లో జరిగే ఎన్నికలలో కూడా జోక్యం చేసుకుంటుందని ప్రచారం చేస్తూనే ఉన్నారు. ట్రంప్ పాలనలో సంబంధాలు క్షీణిస్తున్నప్పటికీ రష్యాతో మెతకగా వ్యవహరిస్తున్నాడని డెమోక్రాట్లు ట్రంప్‌పై ఆరోపణలు చేశారు. ట్రంప్ ఉక్రెయిన్‌కు ఆయుధాలు పంపించారు. పోలాండ్‌లో ఉన్న సైన్యాన్ని పెంచాడు. జర్మనీకి గ్యాస్‌ను సరఫరా చేయటానికి రష్యా కంపెని రోస్‌నెఫ్ట్ నిర్మిస్తున్న 10 బిలియన్ డాలర్ల పైప్‌లైన్ ప్రాజెక్టుపై ఆంక్షలు విధించారు. రష్యా సరిహద్దులకు సమీపంలో అమెరికా బి 52 యుద్ధ విమానాలు తరచుగా చక్కర్లు కొడుతున్నాయి. ట్రంప్ నాటో దేశాలపై ఒత్తిడి తీసుకురాలేదు. దాని అవసరం లేదని, కాలం తీరిపోయినదని ప్రకటించారు. సోవియట్ బ్లాక్ దేశాలతో పోరాడటానికి ఏర్పాటుచేసిన నాటో కూటమిని డెమోక్రాట్లు బలపరుస్తున్నారు.

ప్రపంచంలో కోవిడ్ మహమ్మారి విలయం సృష్టిస్తూ, అమెరికాలో అత్యధికంగా కేసులు నమోదౌతున్న సమయంలో అమెరికా డబ్ల్యుహెచ్ఒ నుండి ఉపసంహరించుకుంది. డబ్ల్యుహెచ్ఒలోకి అమెరికా తిరిగి రావాలని ఆ సంస్థ ప్రతినిధి కోరారు. కోవిడ్‌ను అరికట్టటం పెద్ద సవాలుగా ఉందని, తాము తిరిగి డబ్ల్యుహెచ్ఒలో చేరతామని, సంస్థకు ఉదారంగా నిధులిస్తామని బైడెన్ ప్రకటించారు. రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ అమెరికా యునెస్కో, యునైటెడ్ నేషన్స్ హై కమిషన్ ఫర్ రెఫ్యూజీస్, యుఎన్‌హెచ్‌సిఆర్ ల నుండి బయటికి వచ్చింది. ఈ విధానాలను కూడా బైడెన్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంటుందని భావిస్తున్నారు. ముస్లింలు వలస రావటంపై విధించిన నిషేధాన్ని తొలగిస్తానని, మెక్సికో గోడ నిర్మాణానికి నిధులను నిలిపివేస్తానని బైడెన్ ప్రకటించారు.

బైడెన్ ప్రభుత్వం అమెరికా విదేశాంగ విధానంలోని మౌలిక అంశాలకు కట్టుబడి ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే తమదేశం అంతర్జాతీయ వ్యవహారాలలో తన ఆధిపత్యస్థాయిని కోల్పోతున్నదని, మరెంతో కాలం అది ఒక ప్రత్యేక దేశంగా ఉండలేదనే వాస్తవాన్ని అమెరికా రాజకీయ, సైనిక నాయకత్వం గుర్తించి, దానికి అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయటానికి ప్రయత్నించినా ఆ దేశం తట్టుకొని నిలబడింది. ప్రపంచ బలాబాలాలను మార్చటంలో రష్యా, చైనాలు విజయం సాధించాయి. గత 50 సంవత్సరాలుగా జరిగిన యుద్ధాలలో బాల్కన్స్, మొదటి గల్ఫ్ యుద్ధంలో మాత్రమే అమెరికా విజయం సాధించింది. కొద్ది సమయంలోనే సైన్యాన్ని ప్రపంచంలోని ఏ భాగంలోనైనా దించటానికి అవకాశాలు ఉన్నప్పటికీ అమెరికా విజయం సాధిస్తుందనే గ్యారంటీ లేదు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను బైడెన్ సమర్ధిస్తారు. గల్ఫ్, బాల్కన్ యుద్ధాలను బైడెన్ బలపరిచారు. ఇరాక్‌పై యుద్ధానికి విచారిస్తున్నానని చెబుతున్నప్పటికీ విదేశాంగశాఖలో ఆయన నియమించుకున్న సలహాదారులందరూ ఆ యుద్ధాన్ని బలపరిచిన వారే. ఒబామా కాలంలో లిబియా, సిరియా, ఎమెన్, సోమాలియాలలో జోక్యం చేసుకున్నారు. బైడెన్ ప్రభుత్వం ఒబామా ప్రభుత్వ పునరుద్ధరణేనని కొందరు చెబుతున్నారు. ఒబామా కాలంలోనే ఆఫ్ఘనిస్థాన్‌లో సైన్యాన్ని పెంచటంతో పాటు పౌరులను లక్ష్యంగా చేసుకొని డ్రోన్ దాడులు జరిగాయి. ఒబామా ఆఫ్ఘనిస్థాన్‌లో సైన్యాన్ని 8,600 లకు తగ్గించాడు. ట్రంప్ దానిని అలాగే కొనసాగించారు. బైడెన్ సైన్యాన్ని పెంచి, పునరుజ్జీవం పొందిన తాలిబన్‌లను ఎదుర్కొనే ప్రయత్నం చేయకపోవచ్చు. తాలిబన్‌లకు ట్రంప్ ఇచ్చినంత ప్రాధాన్యతను బైడెన్ ఇవ్వక పోవచ్చునని అక్కడి ప్రభుత్వం భావిస్తున్నది. అమెరికాతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడకుండా తాలిబన్‌లు ప్రభుత్వాన్ని లక్ష్యంగా పెట్టుకొని తమ దాడులను కొనసాగిస్తున్నారు.

**భారత్‌తో సంబంధాలకు ప్రాధాన్యం**

ప్రపంచంలో కొద్దిమంది నాయకుల వలెనే ట్రంప్‌తో తాను ప్రత్యేక సంబంధాలను ఏర్పాటు చేసుకున్నట్లు మోడి ప్రకటించారు. ట్రంప్ మళ్ళీ అధికారంలోకి రావాలని కోరుకున్నారు. అధికారంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు రెండవసారి ఎన్నిక కాకపోవటం 50 సంవత్సరాల కాలంలో ఇది మొదటిసారి. ట్రంప్ రెండవసారి ఎన్నికవటం కోసం మోడి రెండు భారీ సభలను నిర్వహించారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విభజన వాద విధానాలను ట్రంప్ బలపరిచారు. ట్రంప్ మైనారిటీలపై అనుసరిస్తున్న, సమాజాన్ని చీల్చే తరహాలోనే ఈ విధానాలూ ఉన్నాయి. చైనాపై ఆర్థిక, సైనిక వ్యతిరేకతను తీవ్రం చేసిన తర్వాత మోడి ప్రభుత్వం తనకు బాగా ఉపయోగపడు

తుందని ట్రంప్ భావించాడు. ఒబామా కాలంలోనే చైనాకు వ్యతిరేకంగా సైనిక కూటమిని ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకున్నారు. సరిహద్దు సమస్య విషయంలో అన్ని విధాలైన సహకారాన్ని అందజేస్తానని ట్రంప్ వలెనే బైడెన్ కూడా ప్రకటించాడు. ఆనాడు విదేశాంగ వ్యవహారాల శాఖలో ఉన్న బైడెన్ భారతదేశంతో అణు ఒప్పందం చేయించటంలో ముఖ్యపాత్ర నిర్వహించాడు. భారతదేశం అమెరికాతో సైనిక సంబంధాలను పెంచుకొంటూ, ఒప్పందాలను చేసుకొంటూ, క్వాడ్ ఒప్పందంలో కూడా భాగస్వామి అయింది.

> "ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ ప్రజలపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో ఆ దేశంతో అణు ఒప్పందాన్ని పునరుద్ధరించటం అంత తేలిక కాదు. ఇరాన్‌పై తీవ్రమైన ఆంక్షలను విధించటంతో పాటు ట్రంప్ ఆదేశాలతో ఆ దేశ సైనిక జనరల్ ఖాసిం సోలేమనిని హత్య చేయటం దీనిని మరింత కష్టం చేస్తుంది. అప్పుడు విదేశీ పర్యటనలో ఉన్న బైడెన్ సోలెమని హత్యను ఖండించలేదు. అమెరికా-ఇరాన్ అణు ఒప్పందానికి రూపకల్పన చేయటంలో బైడెన్ ముఖ్యమైన పాత్ర నిర్వహించారు."

భారత్‌తో సంబంధాలు పటిష్టం చేసుకోవటం ముఖ్యమని బైడెన్ విదేశీ వ్యవహారాల సలహాదారులు చెబుతున్నారు. వలసలు, వాణిజ్యంపై భారత్‌తో ఏర్పడిన విభేదాలను త్వరగా పరిష్కరించుకుంటామని చెప్పారు. ట్రంప్ వలెనే బైడెన్ కూడా రక్షణవాద విధానాలనే అనుసరించే క్రమంలో ఉన్నారు. భారతదేశంలో పౌరహక్కులు, మానవ హక్కులను హరించటం తదితర అంశాలలో అమెరికా కొంత సానుకూలంగా వ్యవహరించ వచ్చు. కాశ్మీర్‌లో పౌరహక్కులను హరించటాన్ని కమలా హారిస్ వ్యతిరేకించారు. సహనం, బహుళత్వం, భిన్నత్వాలను కాపాడుకోవాలని చెప్పింది. ఎన్ఆర్‌సి, సిఎఎలను బైడెన్ విమర్శించాడు. తన అధ్యక్షకాలం మొదటి సంత్సరంలోనే ప్రజాస్వామ్య దేశాల సమావేశం జరుపుతానని, మానవహక్కులను మరింత విస్తరింపజేయటమే దీని లక్ష్యంగా ఉంటుందని ప్రకటించారు.

### రష్యా, చైనాలను విమర్శిస్తున్న బైడెన్

ఎన్నికల ప్రచారంలో బైడెన్ రష్యా, చైనాలు రెండింటినీ విమర్శించారు. అమెరికా ఎన్నికలలో జోక్యం చేసుకొంటున్నందుకు మూల్యం చెల్లించాల్సి వుంటుందని చెప్పారు. చైనాపట్ల మెతకగా వ్యవహరిస్తున్నాడన్న దానిని తిప్పికొట్టటం కోసం బైడెన్ చైనాపై తీవ్ర విమర్శలు చేశాడు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను దోపిడి దొంగ అన్నాడు. చైనా తమ సూపర్ పవర్ స్థానానికి ఎసరుపెట్టే విధంగా ఎదుగుతుందన్న భావం అమెరికన్లలో ఉంది. చైనా శాంతియుతంగా అభివృద్ధి చెందటానికి ఉన్న అవకాశాలన్నింటికీ విఘాతం కలిగించాలని అమెరికా భావిస్తున్నది. చైనాతో ట్రంప్ అనుసరించిన వ్యాపార విధానాలు అమెరికా రైతుల, పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలను దెబ్బతీస్తాయని పేర్కొన్నాడు. వాణిజ్యం, మానవహక్కులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, దక్షిణ చైనా సముద్రంలో నౌకాయానానికి సంబంధించి చైనాతో కఠినంగా వ్యవహరిస్తానని ప్రకటించాడు. చైనా వ్యతిరేక సంఘటనను నిర్మించటానికి ట్రంప్ తగిన ప్రయత్నం చేయలేదని విమర్శించాడు. ఆసియా ప్రాధాన్యత విధానాన్ని ఒబామా రూపొందించి, చైనాకు వ్యతిరేకంగా అన్ని శక్తులను ఐక్యం చేయటానికి ప్రయత్నం చేశారు. ఈ సంవత్సరం ప్రారంభం నుండి చైనాకు వ్యతిరేకంగా ట్రంప్ ప్రారంభించిన ప్రచ్ఛన్నయుద్ధం విధానాన్ని బైడెన్ కొనసాగిస్తాడు. చైనా గూఢచర్యం, హ్యాకింగ్ చర్యలు అమెరికా భద్రతకు, మేధోసంపత్తి హక్కులు, ఆర్థికాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయని ఎఫ్‌బిఐ డైరెక్టర్ పేర్కొన్నారు.

### అమెరికా ఇరాన్ అణు ఒప్పందం

ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ ప్రజలపై తీవ్రమైన ఒత్తిడిని తీసుకొచ్చింది. ఈ పూర్వరంగంలో ఆ దేశంతో అణు ఒప్పందాన్ని పునరుద్ధరించటం అంత తేలిక కాదు. ఇరాన్‌పై తీవ్రమైన ఆంక్షలను విధించటంతో పాటు ట్రంప్ ఆదేశాలతో ఆ దేశ సైనిక జనరల్ ఖాసిం సోలేమనిని హత్య చేయటం దీనిని మరింత కష్టం చేస్తుంది. అపుడు విదేశీ పర్యటనలో ఉన్న బైడెన్ సోలెమని హత్యను ఖండించలేదు. అమెరికా-ఇరాన్ అణు ఒప్పందానికి రూపకల్పన చేయటంలో బైడెన్ ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. ట్రంప్ ఇరాన్ విధానం విఫలమైందని ప్రకటించారు. ఇరాన్ సహకరించటానికి అంగీకరిస్తే ఈ ఒప్పందంలో అమెరికా తిరిగి భాగస్వామి అవుతుందని ప్రకటించారు. ఒప్పందంలోని అంశాలను అమలుచేయటం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండటం ఆధారంగా తాము చర్చలకు రావటం ఆధారపడి ఉంటుందని ఇరాన్ పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ఎవరనేది ముఖ్యం కాదని, వారు మారటంతో తమ విధానం మారదని స్పష్టం చేసింది. ఒప్పందంలో భాగస్వాములైన మూడు యూరోపియన్ దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలు అమెరికాను ఒప్పందంలోకి తీసుకురావాలని చెప్పింది. ఆ ప్రాంతంలోని ఇజ్రాయిలు, సౌది అరేబియా, యుఎఇలు ఇరాన్‌తో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నాయి. పాలస్తీనా సమస్యపై ఇరాన్ దృఢంగా ఉన్నది. ఈ ప్రాంతంలోని ప్రజాస్వామిక ప్రభుత్వాలను, హెజ్‌బొల్లా, హమాస్ లాంటి ఉద్యమాలను ఇరాన్ బలపరచటం ఆ దేశాలకు ఇష్టం లేదు. సిరియా, ఎమెన్‌లలో ఇరాన్ నిర్వహించిన పాత్ర ఆ దేశాలలో అమెరికా తొత్తు ప్రభుత్వాలు ఏర్పడకుండా నిరోధించింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఉన్న దేశాలు అమెరికాలోని తమ లాబీలను ఉపయోగించి అణు ఒప్పందాన్ని పునరుద్ధరించటాన్ని నిరోధించటానికి అన్ని ప్రయత్నాలు చేస్తారు. ఇజ్రాయిల్‌తో యుఎఇ, బహ్రెయిన్ చేసుకున్న అబ్రహం ఒప్పందాన్ని ట్రంప్ ఆకాశాని కెత్తగా బైడెన్ కూడా దానిని బలపరిచాడు. మిగతా అరబ్ దేశాలు కూడా ఇజ్రాయిల్‌తో ఇటువంటి ఒప్పందం చేసుకోవాలని బైడెన్ చెబుతున్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని నిరోధించాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రయత్నం చేశారు. ఆ ఒప్పందాన్ని ట్రంప్ విచ్ఛిన్నం చేశారు. డీల్ ఆఫ్ ది సెంచరి పేరుతో అమెరికా రాయబార కార్యాలయాన్ని టెల్ అవీవ్ నుండి జెరుసలెంకు మార్చారు. దీని వలన అత్యధిక పాలస్తీనా భూభాగాన్ని తన అదుపులో ఉంచుకోవటానికి ఇజ్రాయిల్‌కు చట్టబద్ధత వచ్చింది.

బైడెన్, కమలా హారిస్‌లు ఇజ్రాయిల్, తమదేశంలోని యూదులాబీకి సన్నిహితంగా ఉంటారు. ఈ ప్రాంతంలో ఒబామా కాలంలో అనుసరించిన విధానాలకు తిరిగి వెళ్ళాలని, పాస్తీనీయులకు ఆపివేసిన సహాయం తిరిగి అందించాలని కోరుతున్నారు. వాషింగ్టన్‌లోని

(మిగతా 34వ పేజీలో)

# భారత వ్యతిరేక చట్టం 'ఉపా'

ఏజి నూరాని



రచయిత సుప్రీం కోర్టు న్యాయమూర్తి, రాజ్యాంగ నిపుణుడు

చూసేందుకు సుందరంగా, వినేందుకు వినసొంపుగా ఉన్నప్పటికీ అమెరికా వ్యతిరేక కార్యకలాపాల చట్టం నమూనాలో రూపుదిద్దుకొని ఎదిగిన విషవృక్షం ఉపా చట్టం (యుఎపిఎ). చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం పేరిట 1967లో అమలు చేయటం ప్రారంభించిన ఈ చట్టాన్ని ఎక్కువగా దుర్వినియోగపరిచారు. ఈ చట్టాన్ని అమలు జరపటం ప్రారంభించగానే ఇది అమెరికాలోని మెకార్థిట్ చట్టానికి నమూనా అని అర్థమయింది. దీనికి తోడు ఈ చట్టంలో రాజద్రోహ నేరం కూడా ఉంది. జాతీయ పరిశోధనా సంస్థ చట్టం (ఎన్ఐఎ)2008 దీనిపై విచారిస్తుంది.

కొలంబియా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ సర్వీస్ పరిశోధకురాలు లేహ్ వర్గీస్ నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) రికార్డుల ఆధారంగా చేసిన పరిశోధనలో యుఎపిఎ కింద నమోదైన కేసులు 2016తో పోలిస్తే 2019 లో 1,226 కేసులు, 33 శాతం పెరిగాయి. దేశద్రోహం కేసులు 2016లో 35 నుంచి 2019లో 93 కేసులకు, 165 శాతం పెరిగాయి. (హిందూస్తాన్ టైమ్స్, అక్టోబర్ 12, 2020).

1962 అక్టోబరులో చైనాతో యుద్ధం జరిగిన కొద్దికాలానికే, 50 యేళ్ల క్రితం నాటి రాజకీయ పరిస్థితుల్లో ఈ చట్టం పురుడు పోసుకుంది. నాటి పరిస్థితుల్లో కాంగ్రెస్ నియంత్రణ నుండి దక్షిణాది రాష్ట్రాలు జారిపోతున్నట్లు కనిపించింది. 11 సంవత్సరాల జైలు శిక్ష తరువాత 1964 ఏప్రిల్‌లో విడుదలైన షేక్ అబ్దుల్లా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని తన పాత నినాదాన్ని ఇచ్చారు. ఆయన ఆమోదంతోనే మీర్జా అఫ్జల్ బేగ్ ప్లెబిసైట్ ఫ్రంట్‌ను స్థాపించాడు.

అపుడు బలహీనంగా ఉన్న ఇందిరాగాంధీ ప్రభుత్వం 1966 జూన్ 17న ఈ యుఎపిఎ చట్టాన్ని ఆర్డినెన్సు రూపంలో తెచ్చింది. రాష్ట్రపతి ప్రకటించిన ఆర్డినెన్స్‌కు అంతకు ముందు బిల్లులోని అంశాలకు తేడా ఉంది. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అప్పటికది రద్దయింది.

తరువాత తెచ్చిన బిల్లులోని ప్రధాన అంశం "చట్టవిరుద్ధమైన కార్యకలాపాల"కు జరిమానా విధించడం, బాధ్యులైన వ్యక్తికి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, అందుకు కారణంమైన సంఘాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించవచ్చు.

"చట్టవిరుద్ధమైన కార్యకలాపాల" గురించి ఈ చట్టంలోని నిర్వచనం ప్రకారం "అటువంటి వ్యక్తి లేదా సంఘంపై ఈ కింది అంశాలపై చర్య (మాటలు లేదా రాతలు, లేదా సంకేతాలు లేదా ప్రదర్శన ద్వారా లేదా ఇతర చర్యలకు పాల్పడటం ద్వారా) తీసుకోవచ్చు.

(1) భారతదేశ పరిధిలోని కొంత భూభాగాన్ని యూనియన్ నుండి వేరు చేసేందుకు పాల్పడే చర్యలకు మద్దతు తెలపటం,

(2) భారత భూభాగంలో ఏదైనా భాగానికి సంబంధించి భారతదేశ సార్వభౌమత్వంపై ప్రశ్నించినా,

(3) భారతదేశ సమగ్రతకు భంగం కలిగించటం లేదా భంగం కలిగించటానికి ఉద్దేశించినది ".

రెండు అస్పష్టమైన పదాలను, ఒక ప్రత్యేకమైన కార్యాచరణ అంశం మినహా ఆర్డినెన్స్‌లోని అంశాలు చాలావరకు యథాతథంగా ఉన్నాయి. కాని చట్ట విరుద్ధమని ప్రకటించాల్సిన ఒక అంశం తొలగించిన వాటిలో ఉన్నది. ప్రభుత్వాన్ని పడగొట్టటానికి "(ఎ) బలం లేదా హింసను వినియోగించడం (బి) ఏవైనా విదేశాల ఆదేశాలను పాటించడం" అన్నది ఆ అంశం. నక్సల్‌బరీ ఉద్యమం తీవ్రంగా ఉన్న పరిస్థితులలో ఈ వాక్యాన్ని బిల్లు నుండి ఎందుకు తొలగించారో అర్థం చేసుకోవడం అంత సులభం కాదు.

### కాశ్మీర్ విషయం

బిల్లులో పేర్కొన్నట్లు "ఏ దైనా దేశం భారతదేశ భూభాగంలో కొంత భాగం తనదని వాదిస్తే విదేశంలో భాగంగా చేయడం" సెక్షన్ 2 (డి) ప్రకారం, " అటువంటి భాగం భారతదేశ భూభాగంలో ఒక భాగంగా ఉంటుందో లేదో నిర్ణయించే హక్కును కలిగి ఉండడం, భారతదేశ భూభాగంలో కొంత భాగాన్ని యూనియన్ నుండి విడదీయడం". ఈ రెండోది స్పష్టంగా కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఉద్దేశించింది.

రెండూ కృత్రిమ నిర్వచనాలు. "అప్పగింత" అంటే ఒక భూభాగంపై సార్వభౌమత్వాన్ని తిరస్కరించడం కాదు, స్వేచ్ఛగా కుదరిన ఒప్పందం ద్వారా అప్పగించడం. భారతదేశ ప్రతినిధి, వి.కె. కృష్ణమీనన్ ఫిబ్రవరి 8, 1957న భద్రతా మండలిలో ఇలా అన్నారు: "(కాశ్మీర్) విలీనం వాస్తవం. కాని మన సార్వభౌమత్వాన్ని వినియోగించి దీన్ని రద్దు చేయవచ్చు. ఏదైనా సార్వభౌమ రాజ్యం భూభాగాన్ని వదులుకోవడం సాధ్యమే. ఒకవేళ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితం వ్యతిరేకంగా వచ్చినట్లయితే, ప్రజలు భారతదేశంతో కలిసి ఉండకూడదని నిర్ణయించుకుంటే, ఆ సమయంలో రాజ్యాంగ విధానాలను అనుసరించడం ద్వారా ఆ భూభాగాన్ని వేరు చేయడం మన కర్తవ్యం".

భారతదేశంలో భాగమైన ఒక భూభాగం దేశంలో భాగం కాదని చెప్పకుండా ఒక పౌరుడిని నిరోధించే పరిమితి ఉందా అనేది అనుమానాస్పదమే. కానీ రాజకీయ కారణాల రీత్యా, దేశ సమగ్రతను కాపాడుకోవటం కోసం దేశంలోని ఒక భాగాన్ని మరో దేశానికి స్వచ్ఛందంగా ఇవ్వటం, భారతదేశ సమగ్రతను కాపాడుకోవటానికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నది. భారత ప్రభుత్వం అప్పగించటానికి చేసుకొనే ఒప్పందాన్ని నిరోధించాలన్నది బిల్లు ఉద్దేశం కాదు.

యుఎపిఎలోని ఈ నిబంధన ప్రభావం ఏమిటంటే, భారత ప్రభుత్వం, దాని అధికారుల ద్వారా, ఒప్పందం ద్వారా తన భూభాగాన్ని వదులుకోవచ్చు. అటువంటి ఒప్పందం పూర్తయిన తర్వాత పౌరులు సమర్థించకపోవచ్చు లేదా సమర్థించవచ్చు.

కాశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రజాభిప్రాయ సేకరణను నిషేధించారు. ఏదేమైనా ఇతర భారతీయ రాష్ట్రాలకు భిన్నంగా, భారత ప్రభుత్వం కాశ్మీర్ ప్రజలతోనూ, అంతర్జాతీయంగా కొన్ని ఒప్పందాలను కుదుర్చుకుంది. అలాగే 1948లో ప్రభుత్వ శ్వేతపత్రంలో విలీనాన్ని "ఖచ్చితంగా తాత్కాలికం" అని పేర్కొ

న్నారు. కాశ్మీర్ సమస్య "అంతర్జాతీయ సమస్య" (ఆగస్టు 7, 1952) "ఏకపక్షంగా పరిష్కరించలేం" (ఫిబ్రవరి 25, 1955) అనినెహ్రూ పేర్కొన్నాడు.

అయితే తరువాత విధానం మారింది. పాలకుల విధానాలకు అనుగుణంగా పౌరుడు అతని / ఆమె అభిప్రాయాలను మార్చుకునేందుకు కట్టుబడి ఉంటారా? చట్టబద్ధంగా ధృవీకరించిన విలీనంలో ఎటువంటి మార్పులేదు. ఎన్నికలు (అటువంటివి) లేదా సమయం ముగియడం తదితరాల వలన, విలీనం "ఖచ్చితంగా తాత్కాలికం" అనే భారత ప్రభుత్వ వైఖరితో విభేదించడానికి పౌరునికి తప్పనిసరిగా హక్కు ఉంటుంది.

పైన పేర్కొన్న ప్రసంగంలో భద్రతామండలిలో కృష్ణ మీనన్ ఇలా అన్నారు: "కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం." ఇది భారత ప్రభుత్వ చట్టం ద్వారా మాత్రమే దేశంలో భాగం కాకుండాపోతుంది. "కాబట్టి, మేము ఇక్కడకు వచ్చినప్పుడు పరిస్థితి అది. ఆ సమస్యను పరిష్కరించటం కోసం మేము వివిధ మార్గాలను అన్వేషిస్తున్నాం. కానీ ఏ సమయంలోనూ జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వానికి సార్వభౌమాధికారం లేకుండా చేయలేదు. " పరిష్కారం కోసం ప్రజాభిప్రాయ సేకరణతో సహా "వివిధ ప్రతిపాదనల" పరిశీలన రాష్ట్ర సార్వభౌమత్వానికి పూర్తి అనుగుణంగా ఉంది. వేర్పాటుకు ఒప్పందం అన్న వాదనను నిషేధించడం "భారతదేశ ప్రాదేశిక సార్వభౌ మత్వాన్ని పరిరక్షించటం కోసం" అని చెప్పలేం. అటువంటి ఒప్పందం ప్రజల వాక్ స్వాతంత్ర్య ంపై "సహేతుకమైన పరిమితి" విధిస్తుందని చెప్పలేం. ఆ ఒప్పందం పూర్తి కావటానికి ఈ నిషేధం ఏ మాత్రం ఆటంకంగా ఉండదు.

ఈ చట్టం మొత్తం దేశానికి చెల్లుబాటు అయితే, ఇప్పటికీ ఐక్యరాజ్యసమితి ముందున్న కాశ్మీర్‌కు సంబంధించి వాక్ స్వాతంత్ర్యాన్ని నిషేధించటం తార్కికంగా సరికాదు. చాలా కాలంగా భారతదేశ విధానంగా ఉన్న కాల్పుల విరమణ రేఖ ఆధారంగా వివాదం పరిష్కారం కావాలన్న అభ్యర్ధనను కూడా నిరోధిస్తుంది.

ఈ సమయంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఎల్.పి.సింగ్‌ను 1967 డిసెంబర్‌లో ఈ రచయిత కలుసుకుని, తన ఆందోళనను వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ఎల్.పి. సింగ్ "ఇటువంటి సమస్యలు చట్టం ద్వారా లేదా బలప్రయోగం ద్వారా పరిష్కరించబడవని నాకు తెలుసు." అని వ్యాఖ్యానించాడు.

పార్లమెంటు ఉభయ సభల సంయుక్త కమిటీ సాక్ష్యాలను నమోదు చేసింది. పి.ఎం. బెనర్జీ, మధు లిమాయే, పి.రామమూర్తి, అటల్ బిహారీ వాజ్‌పేయి, వై.బి. చవాన్, చంద్ర శేఖర్‌లు దానిలో సభ్యులుగా ఉన్నారు.

**దఫ్తరీ వ్యాఖ్యానం**

అక్టోబర్ 16, 1967 న వారి సాక్షి అటార్నీ జనరల్ సి.కె. దఫ్తరీ. శక్తివంతమైన వాదనా పటిమతో ఆయన దేశంలోని సమర్ధులైన, తెలివైన న్యాయవాదులలో ఒకరు. ఆయనకు ఈ బిల్లు పట్ల అయిష్టత ఉన్నప్పటికీ ప్రభుత్వ అత్యున్నత న్యాయాధికారిగా దానిని రక్షించాల్సిన విధి నిర్వర్తించారు. ఆయన వివరణ యుక్తివంతంగా ఉంది: "నా వద్దకు వచ్చిన ముసాయిదాలో కొన్ని అంశాలపై మినహాయింపులు అవసరమని చెప్పాను. కొన్నింటిని తొలగించటం, మరి కొన్నింటిని చేర్చటంతో ఇప్పుడు ఈ రూపంలో ఉంది. ఇప్పుడు దీనిని రాజ్యాంగ విరుద్ధమని సవాలు చేయగల స్థితి లేని దశకు తీసుకురావడానికి అవసరమైన అంశాలను చేర్చాను. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19కి మినహాయింపుల క్రింద అనుమతించదగిన చట్టం అని నేను భావిస్తు న్నాను. మరో మాటలో చెప్పాలంటే ఈ సవర ణలు భారతదేశ భద్రత, సార్వభౌమాధికారం,సమగ్రత దృష్టితో చేసినవి. వాస్తవానికి న్యాయ పరమైన అభిప్రాయాన్ని చెప్పేందుకు మాత్రమే నన్ను పిలిచారు. ఇవి చాలా దూరం వెళ్ళటానికి దారితీస్తాయి.

"నిజాయితీగా మాట్లాడితే ఈ సెక్షన్ చెడు వైపుకు దారితీసే అవకాశం ఉంది, ఎందుకంటే, 'ఒక వ్యక్తికి సంబంధించి' ఇది 'ఒక చర్య లేదా మాటలతో లేదా రాసిన పదాల ద్వారా ... ఇది ఏదైనా ఒక ప్రాంతాన్ని ఏ కారణాల రీత్యానైనా అప్పగించే అంశానికి ఉద్దేశించినది లేదా మద్దతు ఇచ్చేది. ఇప్పుడు 'ఏ కారణాల రీత్యానైనా' , ఏ విధంగానైనా అనే పదాలు చట్టంలో ఒకటి కంటే ఎక్కువసార్లు కనిపిస్తాయి. ఇతర పదాలు 'ఒక చర్య లేదా పదాల ద్వారా, మాటలతో లేదా రాసిన, లేదా సంకేతాల ద్వారా లేదా కనిపించే ప్రాతినిధ్యం ద్వారా' అంటే స్పష్టంగా ప్రేరేపించే పదాలు ఒక పని చేయయటం ద్వారా నిర్దిష్ట ఫలితాన్ని సాధించటానికి రాసినవి. కాబట్టి, సైద్ధాంతిక చర్చ లేదా మంచి ఫలితాలు ఆశించి చేసే చర్చ అని పిలవబడేవి కూడా ఈ నిబంధన పరిధిలోకి రావు."

**అప్పగింత లేదా ప్రజాభిప్రాయ సేకరణ సరైంది**

సమానత్వానికి హామీ ఇచ్చే ఆర్టికల్ 14 పై సుప్రీంకోరు ఇచ్చిన తీర్పుల గురించి దఫ్తరి చర్చించాడు. "నేను తొలుత ప్రారంభ తీర్పుతో మొదలు పెడతాను. అది 1952. ప్రాథమిక హక్కులు, వాటిని సక్రమంగా కాపాడుకోవటం కోర్టులో అనేక మార్పులకు గురైనాయన్న విషయం మీకు తెలుసు. ఆరంభంలో ప్రాథమిక హక్కులు చాలా దృఢంగా ఉన్న సమయం అది. క్రమంగా అవి క్షీణించిన కాలం వచ్చి క్రమంగా ఆర్టికల్ 14 దాదాపుగా అంతర్థానం అయింది. తిరిగి ప్రాథమిక హక్కులను దృఢంగా ఉంచే, ప్రతిదానిని సరిగా పరీక్షించే మంచికాలం వచ్చింది.

"వాటి తీవ్రతకు తగిన విధంగా సమస్యలను పట్టించుకోని కాలానికి మనం వస్తున్నాం, వివిధ కాలాలలో భావాలు మారుతూ ఉంటాయి. ప్రతిదానిని చాలా జాగ్రత్తగా చూసిన సమయం ఉంది. వివిధ రకాల అంశాలను కోర్టు ఉదారంగా పరిశీలించిన కాలం ఉంది. అసలు పరిస్థితికి వస్తే నేను యాదృచ్ఛికంగా చెబుతున్నప్పటికీ ప్రభుత్వం ముందు చేసుకునే విజ్ఞప్తి కంటే ఈ కోర్టులో వచ్చే తీర్పు నిజమైన రక్షణగా ఉంటుంది".

చీఫ్ జస్టిస్ ఎం.సి. చాగ్లా కోర్టులో దఫ్తరీ ఈ ఇతివృత్తాన్ని "వివరించినప్పుడు" ఈ రచయిత అక్కడే ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, "సుప్రీంకోర్టు తన చివరి తీర్పులో ఆర్టికల్ 14 పై ఇచ్చిన తీర్పులన్నీ స్థిరంగా ఉన్నాయని చెప్పారు. ఈ కేసులో హాజరయినప్పటి నుండి, నేను కూడా అదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నాను. " చాగ్లా వస్తున్న చిరునవ్వును అణుచుకున్నాడు. ఒక దశలో దఫ్తరీ ఇలా వ్యాఖ్యానించాడు, "ఈ దేశంలోని ట్రిబ్యునల్స్ ఎలా పనిచేస్తాయో మాకు తెలుసు. అయినప్పటికీ నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదు. "

1957, ఫిబ్రవరి 8న కృష్ణమీనన్ భద్రతా మండలికి ఈ విధంగా హామీ ఇవ్వటం ఆసక్తికరంగా ఉంటుంది. "ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని అడగటానికి కాశ్మీర్‌లో ఎవరినీ అనుమతించడం లేదని అంటే, అంత కంటే అబద్ధం ఇంకేమీ లేదని నేను చెబుతాను. కాశ్మీర్ ఎన్నికల్లో పోరాడటానికి అనుమతించిన రాజకీయ పార్టీలలో ఒకదాని పేరు ప్లెబిసైట్ ఫ్రంట్. దాని నాయకులు బహిరంగంగా ప్రచారం చేశారు, వారు మసీదులను కూడా ప్రచారం కోసం ఉపయోగించినా మేం ఖండించ లేదు. యేడాదికి 70,000 మంది ప్రజలు అక్కడికి వెళ్ళి వస్తున్నారు. జర్నలిస్టులు ఏ సమయంలోనైనా అక్కడకు వెళుతున్నారు.

మరొక సమస్యను గమనిస్తే ఆక్సాయ్ చిన్ భారతదేశంలో ఒక భాగం అయినా , దానిని చైనాకు అప్పగించడం జాతీయ ప్రయోజనాల రీత్యా మంచిదని ఒక పౌరునికి వాదించే హక్కు లేకుండా చేయాలా? దేశానికి అత్యంత ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ ఏదైనా భూభాగం మార్పిడి కోసం మాట్లాడితే అది చట్టవిరుద్ధం అని బిల్లులో పేర్కొన్నారు.

ఇప్పటికే అది స్టాట్యూట్ బుక్ 1961 లో క్రిమినల్ లా సవరణ చట్టం 23 లో ఉంది. ఈ చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం "భారత దేశ ప్రాదేశిక సమగ్రతను లేదా భారతదేశ సరిహద్దులను ప్రశ్నించే ఏ ప్రకటన అయినా లేదా, భారతదేశ ప్రయోజనాలకు లేదా భద్రతకు ప్రమాదం కలిగిస్తే" మూడు సంవత్సరాల వరకు

జైలు శిక్ష విధించవచ్చు. ప్రస్తుత బిల్లులోని నిబంధనలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఇది కేవలం చట్టాల ద్వారా రాజకీయ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసింది. దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఈ బిల్లుపై ఉత్తమ విమర్శ చేశారు. అక్టోబర్ 31, 1964 న వల్లభ విద్యానగర్‌లో చేసిన ప్రసంగంలో, పిటిఐ నివేదికను ఉటంకిస్తూ, "భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో, కాశ్మీర్, నాగాలాండ్, మద్రాస్ వంటి సమస్యలను అధికారాన్ని ఉపయోగించడం ద్వారా కంటే రాజకీయ స్థాయిలో పరిష్కరించుకోవాలి. కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం గురించి మాట్లాడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాశ్మీర్‌తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో కొంతమంది వాదిస్తున్నారని, కానీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం కేవలం బలంతో పాలించలేదు. ప్రజల నుండి లభించే మద్దతుతోనే సమస్యల పరిష్కారం జరుగుతుంది," అని లాల్ బహదూర్ శాస్త్రి అన్నారు.

మోటారు వాహనాల చట్టం నుండి నిబంధనలను చేర్చటం ద్వారా యుఎపిఎని విస్తరించవచ్చా? చట్టసభల్లో హస్తలాఘవం ద్వారా ఉపాను తీసుకొచ్చారు. 1985 ఉగ్రవాద, విధ్వంస కార్యకలాపాల (నిరోధ) చట్టం (టాడా), 2002 ఉగ్రవాద నివారణ చట్టం (పోటా) ను దొడ్డిదారిన యుఎపిఎ లోకి తీసుకువచ్చారు.

2004లో ఉగ్రవాదాన్ని అణిచివేసే పేరిట సవరణ తెచ్చి ముప్పై రెండు "ఉగ్రవాద సంస్థల"జాబితా రూపొందించారు. 2008లో మరొకటి జతచేశారు. 2012లో మరొకటి చేర్చి ఈసారి ఉగ్రవాదులతో పాటు వారికి మద్దతిస్తున్న ఆర్థిక నేరగాళ్లను పట్టుకునేందుకని చెప్పారు.

పోలీసులు, శాంతిభద్రతలు రాష్ట్రాల అంశాలు. రాజ్యాంగ సవరణ, దాని వక్రీకృత వివరణ ఎన్ఐఏ చట్టాన్ని సమర్థించడానికి ఉపయోగించారు. రాష్ట్ర పోలీసులపై కేంద్రం పెత్తనాన్ని చెలాయిస్తున్నది. బెయిల్ మంజూరు, నేరాంగీకారం, దర్యాప్తు కాలానికి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిబంధనలను ఎన్ఐఏ ఉల్లంఘిస్తోంది.

ఉత్తర ఐర్లాండ్ ఆగష్టు 9, 1971 న ముందస్తు నిర్బంధం ప్రవేశపెట్టినా దీనిని డిసెంబర్ 5, 1975 న రద్దు చేశారు. మన దేశంలో ముందస్తు నిర్బంధం స్వతంత్ర భారతదేశం కంటే పాతది. దానిని రాజ్యాంగం ద్వారా కొనసాగిస్తున్నారు. నేర శిక్షాస్మృతి (సెక్షన్ 53) ప్రకారం జైలులో పెట్టడమనేది ఒకవిధమైన శిక్ష. నిర్బంధ చట్టాలు రాష్ట్రాలకు అధికారం కట్టబెడతాయి.

నిర్బంధించిన వారిని జైళ్ళకు పంపుతారు. ఇది విచారణ లేకుండా శిక్షించడం. శతాబ్దం క్రితం రౌలట్ కమిటీ ఆంక్షలను వ్యతిరేకించాం. బ్రిటీష్ కాలంలో భారతీయులు ఇప్పుడున్నదానికంటే ఎక్కువ వ్యక్తిగత స్వేచ్ఛను అనుభవించారా, హైకోర్టులు సుప్రీంకోర్టు కంటే అప్రమత్తంగా దృఢంగా ఉన్నాయా అనే దానిపై అధ్యయనం చేయడం అవసరం. ప్రతీకారం తీర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేతిలో ఎన్ఐఏ అనేది ఒక సాధనంగా మారింది. ఇది సమాఖ్య వాదాన్ని అపహాస్యం చేస్తున్నది.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# బైడెన్‌వీ అవే విధానాలు

(31వ పేజీ తరువాయి)

పిఎల్ఓ కార్యాలయాన్ని తిరిగి పనిచేయనివ్వాలని, కుదించబడిన పాలస్తీనా దేశం ఏర్పాటు విషయాలు తిరిగి ఎజెండాలోకి వస్తాయి. తమ రాయబార కార్యాలయాన్ని జెరుసలెంకు మార్చటం, గోలన్‌హైట్స్‌ను ఇజ్రాయిల్ భూభాగంగా గుర్తిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను తాను తిరగదోడనని బైడెన్ చెబుతున్నారు. టెల్‌అవీవ్‌ను ఇజ్రాయిల్ రాజధానిగా, గోలన్‌హైట్స్‌ను సిరియా భూభాగంగా అంతర్జాతీయ సమాజం ఆమోదించింది.

### సౌది అరేబియాతో సంబంధాలు

అమెరికా నుండి అధికంగా ఆయుధాలను కొనుగోలు చేస్తున్న సౌది అరేబియాలో ట్రంప్ మొదటి విదేశీ పర్యటన చేశారు. సౌది, ఎమిరేట్స్‌లు తమ ఆయుధాలను ఎమెన్‌పై ఉపయోగించటంపై ట్రంప్‌కు ఎలాంటి అభ్యంతరం లేదు. ఎమెన్‌పై ఈ దేశాలు జరుపుతున్న యుద్ధం తీవ్రమైన మారణకాండకు దారితీసింది. ఆరు సంవత్సరాల నుండి జరుగుతున్న ఈ యుద్ధాన్ని గురించి బైడెన్ అనేకసార్లు విమర్శించారు. ఈ యుద్ధాన్ని అంతం చేయటానికి బైడెన్ ప్రభుత్వం పూనుకుంటుందని భావించవచ్చు.

### ఉత్తరకొరియాతో అణుచర్చలు

ఉత్తరకొరియాతో అణు ఒప్పందం కోసం ట్రంప్ చాలా సమయాన్ని వెచ్చించాడు. మూడుసార్లు ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలు జరిపారు. అణ్వస్త్రాలను విసర్జించటానికి బదులుగా ఆ దేశానికి ఏమీ ఇవ్వటానికి ట్రంప్ సిద్ధం కాలేదు. ఉత్తర కొరియా తన అణ్వాయుధాలను ఆధునీకరించే కార్యక్రమం చేపట్టింది. బైడెన్‌ను గురించి ఉత్తరకొరియా గొప్పగా ఆలోచించటం లేదు. అతనొక పిచ్చికుక్క అని గతంలో వ్యాఖ్యానించింది. ఉత్తరకొరియాను పస్తుపెట్టి లొంగదీసుకోవాలని ఒబామా యంత్రాంగం భావించింది. ఉత్తరకొరియా అణ్వాయుధాలు తయారు చేయకుండా చూస్తూ దక్షిణకొరియాకు మిత్రునిగా కొనసాగుతానని బైడెన్ వ్యాఖ్యానించారు.

### లాటిన్ అమెరికాలో బెదిరింపు రాజకీయాలు

లాటిన్ అమెరికాలో ట్రంప్ విధానాల వలన క్యూబా, వెనిజులాలు తీవ్రంగా నష్టపోయాయి. చర్చల ద్వారా బైడెన్ సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకొస్తాడేమోనని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం క్యూబాతో పూర్తిస్థాయిలో దౌత్య సంబంధాలు ప్రారంభించి తర్వాత ట్రంప్ తిరిగి క్యూబాపై ఆంక్షలు, ఆర్థిక దిగ్బంధం విధించాడు. వెనిజులాలో ప్రభుత్వాన్ని మార్చటానికి శక్తికొలది ప్రయత్నం చేసి విఫలమైనారు. ఈ రెండు దేశాల నుండి వలస వచ్చి ఫ్లోరిడాలో ఉంటున్న మితవాదుల ఓట్లు పొందటం లక్ష్యంగా ట్రంప్ ఈ రెండు దేశాలపై బెదిరింపులను కొనసాగించారు. ట్రంప్ విజయం సాధించిన తర్వాత లాటిన్ అమెరికా దేశాలపై గన్‌బోట్ రాయబారాలను అనుసరించారు. లాటిన్ అమెరికా అమెరికాకు పెరటి దొడ్డి అని, ఆ ప్రాంతం నుండి అమెరికా మాత్రమే ప్రయోజనం పొందాలనే 19వ శతాబ్దం నాటి మన్రో సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు.

ఈ ప్రాంతంలో చైనా ఉనికి పెరగటంపై అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తున్నది. లాటిన్ అమెరికాలో బెదిరించే రాజకీయాలకు స్వస్తి పలుకుతామని, ఒబామా కాలంలో అనుసరించిన విధానాలనే అనుసరిస్తామని బైడెన్ అనుచరులు చెబుతున్నారు. కఠినమైన విధానాలు అంతమైనప్పటికీ స్వతంత్ర విధానాలను అనుసరించే దేశాలలో ప్రభుత్వాలను మార్చటానికి చేసే విధానాలు కొనసాగుతాయని బైడెన్ చెబుతున్న మాటలు స్పష్టం చేస్తున్నాయి. మూడొంతుల మంది అమెరికన్లు ఇరాక్, సిరియా, ఇతర దేశాలలో ఉన్న తమ సైన్యం స్వదేశానికి తిరిగిరావాలని కోరుతున్నారని ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది. అదే సమయంలో విదేశాలలో 800 ప్రాంతాలలో ఉన్న 2,00.000 సైన్యాన్ని ఉపసంహరిస్తామని అభ్యర్థులిద్దరిలో ఒకరు కూడా చెప్పలేదు. ఇటువంటి పరిస్థితులలో అమెరికా విధానాలలో పెద్దమార్పులు ఉండవని, కొద్దిపాటి మార్పులతో పాత విధానాలే కొనసాగుతాయని స్పష్టమౌతు న్నది. ❊

# తెలంగాణ విప్లవ పోరాటం

# పోలీసు చర్య-3

(2వ పేజీ తరువాయి)

సాయుధ ప్రతిఘటనను నిలిపివేయాలని, చట్టబద్ధంగా పోరాటాలు చేయాలని ప్రతిపాదించింది. విశాలాంధ్ర పార్టీ కమిటీ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. తెలంగాణా రైతాంగం సాధించిన విజయాలను రక్షించుకోవడానికి యూనియన్ సైన్యం చేస్తున్న దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చింది. పోరాటం విరమించడం అంటే పోరాడిన రైతాంగానికి ద్రోహం చేయడమే అని, అది తెలంగాణా ప్రజా ఉద్యమానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందని వాదించింది.

భూస్వాములు, వారి తాబేదారులు తిరిగి గ్రామాలకు చేరుకోవడం, రైతులపై దాడులు చేయటం, వారు పొందిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం పార్టీ కార్యకర్తలకు ఆగ్రహం కలిగించాయి. ఈ విధమైన పరిస్థితులలో గెరిల్లా ప్రతిఘటన కొనసాగించాలనే వారి వాదన నెగ్గింది. పార్టీ కార్యకర్తలు తిరిగి దళాలుగా ఏర్పడి భారత యూనియన్ సైనికులను, పోలీసులను సాహసోపేతంగా ప్రతిఘటించడం మొదలుపెట్టారు. తమకంటే ఎన్నోరెట్లు బలం కలిగిన యూనియన్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి పార్టీ కార్యకర్తలు తమ దళాలను పునర్ నిర్మించుకున్నారు. అయినా అత్యంత బలం కలిగిన సైన్యాన్ని ఎదిరించడంలో ఎంతో రక్తం చిందించవలసి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం 50,000 సైనాయన్ని దింపి ఏడాదిలో దాదాపు 10 నుండి 15 కోట్లు ఖర్చు పెట్టింది. అయినా ప్రతిఘటనను ఆపలేకపోవడానికి పార్టీ కార్యకర్తలు చావుకు వెరవకుండా జరిపిన అసాధారణ ప్రతిఘటనే కారణం. తెలంగాణా నాయకుల ఒత్తిడి వలన, పక్కనున్న ఆంధ్రా ప్రాంతంలో పాశవిక అణచివేత, పోరాటంలో పాల్గొంటున్న కార్యకర్తల నుండి ఒత్తిడి వలన గెరిల్లా ప్రతిఘటనను మరిన్ని ప్రాంతాలకు విస్తరించడం జరిగింది. అయితే అది విజయం సాధించలేదు. సాయుధ పోలీసులు, భూస్వాముల గుండాలు కమ్యూనిస్టు కార్యకర్తలను పాశవికంగా హత్యలు చేశారు. అందువలన పార్టీలోని చాలామంది మిలిటెంట్ కార్యకర్తలను అడవులకు పంపించవలసి వచ్చింది. 'తరవాత ఏం చేయాలనే' ప్రశ్న నాయకత్వం ముందుకొచ్చింది. 1948 లో జరిగిన పార్టీ రెండో మహాసభ 'తెలంగాణ మార్గమే మన మార్గం' అని పిలుపునిచ్చింది. అది తెలంగాణ సాయుధ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అటువంటి పోరాటాలను దేశ వ్యాపితంగా ప్రారంభించాలని, దానికి కార్మికవర్గ మద్దత్తు పొందాలని, ఆ పోరాటాలన్నీ చివరకు సాయుధ తిరుగుబాటుగా పరిణామం చెందాలని పిలుపునిచ్చింది.

భారత సైన్యం జోక్యంతో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసి పోవటం వలన నిజాంకి వ్యతిరేకంగా మొదలయిన తెలంగాణ సాయుధ పోరాటం ఇంకెంత మాత్రం విముక్తి పోరాటంగా లేదు. అదిప్పుడు రైతులు తమవద్ద ఉన్న భూమిని కాపాడుకోడానికి చేసే పాక్షిక సాయుధ పోరాటంగా మారింది. అంటే సాధించుకున్న ప్రయోజనాలను మాత్రమే కాపాడుకొనే పోరాటం. భూమికోసం జరిగే పాక్షిక పోరాటానికి బదులుగా, పొరపాటు అవగాహనతో దానిని కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా జరిగే విముక్తి పోరాటంగా సాగించటం జరిగింది. అయితే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రజల నుండి దూరం కాలేదు. తెలంగాణా పోరాటానికి సంఘీభవంగా 1948 సెప్టెంబర్‌లో సైనిక జోక్యానికి ముందు గాని, 1951 అక్టోబర్ వరకు తెలంగాణ సాయుధ ప్రతిఘటన జరుగుతున్నప్పుడుగాని కార్మికవర్గం ఏ రకమైన సమ్మెలు, సంఘీభావ పోరాటాలు చేయలేదు.

ఆ పరిస్థితులలో ఇంకెంత మాత్రం పోరాటాన్ని కొనసాగించలేమని, పోరాటం విరమించే సమయం వచ్చిందని నిర్ణయించడం జరిగింది. ఇందుకు కారణాలు. మొదటిది, ముఖ్యమైనది, పోరాటం చేస్తున్న గెరిల్లా దళాల పట్ల ప్రజలలో సానుభూతి ఉన్నప్పటికీ పోరాటాలలో ప్రజల భాగస్వామ్యం తగ్గింది. రెండోది ఒకవైపు సైనిక వలయాలు, పోలీసుల క్యాంపులు పెరుగుతూ, పోరాటాలలో ప్రజల భాగస్వామ్యం తగ్గటంతో గెరిల్లా దళాలు సాయుధులైన శత్రువులను ఎదిరించడం తగ్గింది. సైన్యానికి వ్యతిరేకంగా జరిగే దాడులు తగ్గుతూ, వ్యక్తిగతంగా భూస్వాములు, వారి ఏజెంట్ల పైనా దాడులు జరగడం మొదలయింది. పోరాటం గనక కొనసాగితే వ్యక్తిగత తీవ్రవాదంగా మారే ప్రమాదం ఉన్నదని స్పష్టమైంది.

మూడోది, రైతులు తాము ఆక్రమించుకుని సాగులోకి తెచ్చుకున్న బంజరు భూములను కాపాడుకోగలిగినా, ఆక్రమించుకున్న భూస్వాముల మిగులు భూములలో ఎక్కువ భాగం వదులుకోవలసి వచ్చింది. వారి ఆక్రమణలో ఉన్న భూమికి కూడా చాలా చోట్ల నామమాత్రంగానైనా కౌలు చెల్లించవలసి వచ్చింది. సాయుధులైన ప్రజలు ప్రతిఘటించి వాటిని తిరిగి పొందే పరిస్థితి లేదు.

నాలుగు, దేశవ్యాప్తంగా పాలకులు తమపట్టు పెంచుకున్నారు. పైగా దేశంలోని ఇతర ప్రాంతాలలో తెలంగాణ పోరాటానికి మద్దతుగా ఏ రకమైన సంఘీభావం వ్యక్తం చేయడం గాని, ప్రచారం గాని జరగలేదు.

ఐదో అంశం, భవిష్యత్తు కార్యాచరణపై నాయకుల మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తాయి.

ఆరో అంశం, పోరాటాలు చేస్తున్న గెరిల్లా నాయకుల మధ్య విభేధాలు పెరగటంతో దళాలను వదిలిపోవటంతో పాటు, కేంద్రాలలో ఉన్న నాయకులు కూడా పోరాటాలను వదిలి వెళ్లడం మొదలయింది. వీటిని తీవ్రమైన ప్రమాద ఘంటికలుగా పరిగణించింది.


చివరిగా, పాక్షిక ప్రయోజనాల కోసం జరిగే పోరాటాలకు, విముక్తి కోసం జరిగే పోరాటంలో భాగంగా జరిగే పాక్షిక పోరాటాలకు మధ్య ఉన్న బేధం స్పష్టంగా అర్ధమయింది. అలా అర్ధం చేసుకోవడం వలన భవిష్యత్తు ఎత్తుగడలను రూపొందించు కోవడం సులభం అయింది. తెలంగాణ ఉద్యమ నాయకులు అడవులలో నుదూర ప్రాంతాలు పర్యటించి ఈ అవగాహనను దళాలకు వివరించారు. తెలంగాణ పోరాటంలో పాల్గొంటున్న వారి రక్షణకు, రైతుల అధీనంలో ఉన్న భూమికి ప్రభుత్వం నుండి హామి పొందేవరకు పోరాటం కొనసాగించ గలరా అని అడిగి తెలుసుకున్నారు.

అమరాబాద్ ప్రాంతీయ కమ్యూనిస్టుల, గెరిల్లాల మహాసభలో పోరాటాన్ని ఉపసంహరిస్తూ చేసిన తీర్మానంలో ఉపసంహరణ ఎత్తుగడలను వివరిస్తూ, పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని శపథం చేశారు: "ఉద్యమం పురోగమిస్తున్నప్పుడు ఎంత నైపుణ్యంతో ముందుకు సాగుతామో, అననుకూల పరిస్థితులలో తిరోగమించ వలసి వచ్చినప్పుడు అంతే చొరవతో, ధైర్యంగా వెనక్కుతగ్గాల్సి ఉంటుంది. ఇలా వెనకడుగు వేయాల్సి వచ్చినందుకు నిరాశ చెందాల్సిన పని లేదు. ఉద్యమంలో సంపాదించిన అనుభవంతో, ప్రజలలో మనకున్న పునాదితో, కొత్త కార్యక్రమం, ఎత్తుగడల పంథా ఆధారంగా మనం తెలంగాణ ఉద్యమంలో బలహీనతలను అధిగమిస్తాం. జాతి ఐక్యతను, విముక్తిని సాధించడం ద్వారా ఇంతకన్నా ఎన్నో రెట్లు బలమైన ఉద్యమాన్ని నిర్మించుకుంటాం. భారతదేశ ప్రజల ప్రజాతంత్ర ఉద్యమంలో మన వంతు పాత్ర నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము"!

1951 అక్టోబర్ 21వ తేదీ తెలంగాణ సాయుధ పోరాటం విరమించుకుంటున్న నిర్ణయాన్ని ప్రకటించాము.

**(అనువాదం: కె ఉషారాణి)**

# పెట్టుబడిదారీ అరాచకానికి సోషలిజమే ప్రత్యామ్నాయం



–ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

"ఈ రోజు మనకు కనిపిస్తున్న పెట్టుబడిదారీ అరాచకమే నేడు జరుగుతున్న అనర్థాలన్నిటికీ మూలమని నా అభిప్రాయం. మన ముందు కష్టపడి ఉత్పత్తిచేసే వారు ఉన్నారు. కాని వారు ఉత్పత్తిచేసిన ఫలాలు వారికందడం లేదు....

"కొందరి చేతుల్లో కేంద్రీకరించబడడం ప్రయివేటు పెట్టుబడి లక్షణం. పెట్టుబడిదారులమధ్య పోటీకొంత, సాంకేతికాభివృద్ధివల్ల వచ్చే శ్రమవిభజన కొంత దీనికి కారణం. వీటివల్ల చిన్న పరిశ్రమలను మింగేసి పెద్ద పరిశ్రమలు ఏర్పడతాయి. ఈ పరిణామాల ఫలితంగా అతి శక్తివంతమైన ప్రయివేటు పెట్టుబడిదారీ నియంతృత్వం ఏర్పడుతుంది. దీన్ని ప్రజాస్వామ్యయుతంగా పనిచేసే రాజకీయ సమాజం కూడా అదుపుచేయలేదు. ఎందుకంటే రాజకీయపార్టీలనుండి చట్టసభలకు పోటీచేసే సభ్యులకు ప్రయివేటు పెట్టుబడిదారులే నిధులిస్తారు. ఇంకా ఇతరత్రా అనేక విధాలా ప్రభావితం చేస్తారు. వీరు ఒకరకంగా ప్రజలను చట్టసభలనుండి వేరు చేస్తారు. దీని ఫలితమేమంటే ప్రజా ప్రతినిధులు పేద ప్రజల ప్రయోజనాలను రక్షించలేరు. అదీ గాకుండా ఈ రోజున సమాచారాన్ని (పత్రికలు, రేడియో, విద్య)కూడా ప్రయివేటు పెట్టుబడిదారులే ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని అదుపులో ఉంచుకునే పరిస్థితి ఉంది. అందువల్ల ఈ రోజున ఒక పౌరుడు వ్యక్తిగతంగా తన రాజకీయ హక్కులను ఉపయోగించుకునే అవకాశమే లేదు. పెట్టుబడిపై ప్రయివేటు యాజమాన్యం గల ఆర్థికవ్యవస్థలో పరిస్థితి రెండు ప్రధాన సూత్రాలపై ఆధారపడి ఉంటుంది: మొదటిది, ఉత్పత్తి శక్తులు(పెట్టుబడి) ప్రయివేటు యాజమాన్యంలో ఉంటాయి. యజమానులు వాటిని తమకు ప్రయోజనం కలిగే విధంగా ఉపయోగించుకుంటారు. రెండవది, శ్రమ కాంట్రాక్టు స్వేచ్ఛగా జరుగుతుంది.

"ఉత్పత్తి లాభాలకోసమే జరుగుతుందిగాని వినియోగానికి కాదు. పనిచేయగల సామర్థ్యం ఉన్నవారందరికీ ఉపాధికల్పించాలన్న నిబంధన కూడా ఏమీ ఉండదు. అందువల్ల ఈ సమాజంలో నిత్యం "నిరుద్యోగ సైన్యం" ఉంటుంది. కార్మికుడు నిత్యం ఉద్యోగ అభద్రత మధ్య జీవిస్తుంటాడు. నిరుద్యోగులైన, తక్కువ వేతనాలు వస్తున్న కార్మికులు లాభదాయకమైన మార్కెట్ గిరాకీని ఏర్పరచలేరు గనుక వినియోగ వస్తువుల ఉత్పత్తికి పరిమితులు ఏర్పడతాయి. ఫలితంగా ప్రజలంతా ఈతిబాధల్లోపడతారు. సాంకేతికాభివృద్ధి ప్రజలమీదనుండి శ్రమభారాన్ని దించాల్సిందిపోయి మరింత నిరుద్యోగాన్ని పెంచుతుంది. పెట్టుబడిదారుల లాభాపేక్ష, వారి మధ్య పోటీ వల్ల పెట్టుబడి కేంద్రీకరణ, ఉపయోగంలో అస్థిరత చోటుచేసుకుని రోజురోజుకూ తీవ్రమైన ఆర్థిక మాంద్యాలు ఏర్పడ్డానికి దారితీస్తుంది. చివరికి ఈ పోటీ శ్రమ వ్యర్థంకావడానికి దారితీస్తుంది. ఆ మేరకు నేను ఇంతకు ముందే చెప్పినట్టు వ్యక్తుల సామాజిక చైతన్యం నీరుగారిపోవడానికి కూడా ఇది దారితీస్తుంది.

"వ్యక్తుల చైతన్యాన్ని నీరుగార్చడం పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించే అనర్థాలన్నిటిలోకీ పెద్ద అనర్థం. మన విద్యావ్యవస్థ మొత్తం దీనివల్ల నాశనం అవుతోంది. విద్యార్థిలో అతిశయంతో కూడిన పోటీ ప్రవేశపెడుతున్నారు. ఎలాగైనా విజయం సాధిస్తే తన భవిష్యత్తు బాగుపడిపోతుందనే ఉద్దేశ్యంతో విద్యార్థి విజయం కోసం పరితపించిపోతున్నాడు.

"ఈ భయంకరమైన అనర్థాలన్నిటినీ పారద్రోలేందుకు ఒకే ఒక మార్గం ఉందని నేను గట్టి నమ్మకానికి వచ్చాను. సోషలిస్టు ఆర్థికవ్యవస్థను నెలకొల్పడమే ఆ మార్గం. సామాజిక లక్ష్యాలవైపు పయనించే విద్యా వ్యవస్థ దీనికి తోడుకావాలి. అటువంటి ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు సమాజం ఆధ్వర్యంలో ఉంటాయి. వాటిని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవడం జరుగుతుంది. సమాజ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని సర్దుబాటు చేసే ప్రణాళికాబద్ధ ఆర్థికవ్యవస్థ, పనిచేయగలవారందరికీ పని కల్పిస్తుంది. ప్రతి పురుషునికీ, స్త్రీకీ, పిల్లవానికీ జీవనం గ్యారంటీ చేస్తుంది. ....."

**(విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ రాసిన "సోషలిజం ఎందుకు?" వ్యాసం నుండి.**
**1949 మే 'మంత్లీ రివ్యూ' పత్రికలో ఈ వ్యాసం ప్రచురించబడింది.)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.6. Published on December 1, 2020